


# మనసులో మాట

KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర:- సంపుటి:1 సంచిక: 141 శనివారం 10 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 30 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్



28 నుంచి ఏప్రిల్ 2 వరకు

## బడ్జెట్ సమావేశాలు

తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

29న ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టనున్న కేంద్రం

యధావిధిగా ఫిబ్రవరి1ననే బడ్జెట్ ప్రసంగం

.. వివరాలు 3లో

స్లీపర్ బస్సు ప్రమాదాల

## నివారణకు చర్యలు

గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు

గతేడాది ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం

.. వివరాలు 3లో

## ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది

.. వివరాలు 3లో



# మన భూములపై రాజముద్ర

## మీ భూమి - మీ హక్కు.. ఆయన ఫొటో ఎందుకు?

కరోనా సమయంలో కష్టపడి అన్నం పెట్టారు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో భూములు కాజేసేందుకు

గత ప్రభుత్వం కుట్ర పన్నిందన్న చంద్రబాబు

వివాదాస్పద చట్టాన్ని రద్దు చేస్తూనే రెండో సంతకం

ఇకపై భూ రికార్డులను ట్యాంపర్ చేయకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భద్రత

రాయవరంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

కాకినాడ : కరోనా సమయంలోనూ రైతులు పనిచేసి అందరికీ అన్నం పెట్టారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని.. 'మీ భూమి - మీ హక్కు' అని

మిగతా 2 లో

## కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

కోనసీమ ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు మంటలు

ఘటనాస్థలిని ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

అధికారులతో సమీక్ష.. నష్టపరిహారంపై కీలక ఆదేశాలు

బావిని అదుపులోకి తెచ్చేందుకు ఓఎన్జీసీ ముమ్మర యత్నాలు

2



పిఠాపురంలో గొడవలు చేస్తామంటే

# ఏరిపారేస్తా

## అవాస్తవాలు వైరల్ చేస్తే చూస్తూ ఊరుకోను

శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి

పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి

పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్

సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు



**కాకినాడ :** పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో

మిగతా 2 లో

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



2

పండగల విశిష్టతను బాగా చాటాలి

సంక్రాంతి అంటే నాకు ఎంతో ఇష్టం

ఇందిర పుణ్యమా అని రాజకీయాల్లోకి వచ్చా

సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు



# ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం

## దర్శనాలపై దాదాపు 93 శాతం భక్తులు సంతృప్తి

స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు రాక

మీడియా సమావేశంలో టీటీడీ ఛైర్మన్, ఈవో వెల్లడి

**తిరుమల :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించిన వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులు విశేష సంతృప్తి వ్యక్తం చేసినట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం కావడంతో ఆయన టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరూ కూడా టీటీడీ కల్పించిన సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏఐ సహకారంతో ఎప్పటికప్పుడు

మిగతా 2 లో

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఈడీ చర్యలపై మమతా నిరసన ప్రదర్శన

మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బీజేపీ

విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఈడీ పిటిషన్

3





# అద్దె బస్సుల సమ్మె పిలుపు విరమణ

## ఆర్టీసీ ఎండీతో బస్సుల యజమాన్యాల చర్చలు

**అమరావతి :** ఆర్టీసీలో అద్దె బస్సుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం సంబంధిత యాజమాన్యం ఈనెల 12 నుంచి ఇచ్చిన సమ్మె పిలుపును అద్దె బస్సుల యజమానులు విరమించుకున్నారు. సదరు సంఘాల నేతలతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

# టీటీడీ పాలకమండలికి జంగా కృష్ణమూర్తి రాజీనామా

## రాజీనామాను సీఎం చంద్రబాబుకు చేరవేత



### గెస్ట్ హౌజ్‌కోసం స్థలం కేటాయింపు తప్పా?

భాను ప్రకాశ్‌రెడ్డి వ్యతిరేకించడం బాధ కలిగించింది

బాబుకు ఇబ్బంది రాకూడదనే రాజీనామ చేశ

టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి వెల్లడి

3



2

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో

# భాగస్వామ్యం కండి

మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్యం మా లక్ష్యం

వైద్యారోగ్య శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి సత్యకుమార్

# మన భూములపై రాజముద్ర

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని తెలిపారు. గ్రామసభలు ఏర్పాటు చేసి రైతులకు ఈనెల 11 వరకు పాస్‌బుక్‌లు ఇస్తున్నాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా చూడాలని అధికారులకు చెప్పా. ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, మిగతా సిబ్బంది మనసుపెట్టి పనిచేయాలి. వచ్చే నెలలో మళ్లీ సర్వే చేసి పాస్‌బుక్‌లు ఇస్తాం అన్నారు. ఒక్కసారి ప్రింట్ అయ్యాయంటే ఇక జీరో మిస్టేక్స్ ఉండాలి. భూమికి సంబంధించి 29 అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. అన్నింటినీ పరిష్కరిస్తున్నాం. 22-ఏ భూములపై వచ్చిన సమస్యలన్నీ తొలగిస్తున్నాం. రైతుల భూరికార్డులన్నీ బ్లాక్‌చైన్‌లో భద్రంగా ఉంటాయి. ఎవరైనా భూకబ్జా చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకుంటాం. చిన్న చిన్న భూతగాదాలు పెట్టుకోవద్దని ప్రజలందరినీ కోరతున్నా. కుటుంబసభ్యులు, బంధువులతో వివాదాలు వద్దు. గొడవలు పడి కోర్టులకు వెళ్తే జీవితమంతా ఖర్చుయిపోతుంద సీఎం చంద్రబాబు తెలిపారు. అయితే పాసు పుస్తకాల పంపిణీలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి అధికారులపై సీఎం ఆగ్రహం




వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తీసుకున్న రైతులంతా సభకు రాకపోవటంపై కలెక్టర్, రెవెన్యూశాఖ అధికారులపై సీఎం మండిపడ్డారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో పారదర్శకత ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 'మీ భూమి మీద హక్కు' ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'మీ భూమి - మీ హక్కు'... చేసి చూపించామన్నారు. రైతులకు ఎప్పుడూ అన్యాయం జరగకూడదని అన్నారు. కరోనా సమయంలోనూ పనిచేసి రైతులు అందరికీ అన్నం పెట్టారని గుర్తుచేశారు. ఏపీలో 6,680 ఎకరాల్లో రీ సర్వే చేశామని.. 22.30 లక్షల పాస్ పుస్తకాలు సిద్ధం చేశామని చెప్పారు. గతంలో పట్టాదారు పాసు పుస్తకాలకు జగన్ ఫొటో పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని తెలిపారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాన్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని తెలిపారు. ఎవరైనా ట్యాంపరింగ్ చేస్తే గుర్తించి శిక్షించే పరిస్థితి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

మొదటి పేజీ తరువాయి

కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగుతుండటంతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగన తలం నుంచి పరిశీలించారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షోభ నిర్వహణ బృందం (జమీ) ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది. బావి హెడ్ సమీపంలో సురక్షితంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వామ్యం కండి

**మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్యం మా లక్ష్యం**

**వైద్యారోగ్య శాఖ అధికారుల వర్క్‌షాపులో మంత్రి సత్యకుమార్**

**విజయవాడ :** ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లతో మంత్రి.. ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. మెరుగైన ఆరోగ్య సేవలు, నాణ్యమైన వైద్య, విద్య అందించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వైద్య రంగంలో ప్రతికూలతలు ఎదుర్కొంటూనే సేవలందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపీ, ఐపీ, ఇతర సేవలు గతంతో పోలిస్తే 12శాతం పెరిగాయని చెప్పుకొచ్చారు. రోగులు అధిక శాతం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా చేయగలిగామని వ్యాఖ్యానించారు. డాక్టర్లు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. కింది సాయిలో 28శాతం అవినీతి ఉందని తెలుస్తోందన్నారు. పారిశుధ్యంలో ఇంకా మార్పు రావాల్సి ఉందని తెలిపారు. బోధనాస్పత్రుల్లో అనుమతించిన బెడ్లు 500 వరకూ ఉంటున్నాయని వివరించారు. ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మంచాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో మార్పులు రావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ ఐడీ జనరేట్ చేసేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. చాలాచోట్ల ఎఫ్ఎంఓలు లేకపోవడం ప్రధాన అంశంగా కనిపిస్తోందని అన్నారు. సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేషన్ మధ్యలో సరైన కోఆర్డినేషన్ ఉండట్లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురంలోని ఆస్పత్రుల్లో చాలా అంశాల్లో లోపాలు తన దృష్టికి వస్తుంటాయని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సూపరింటెండెంట్‌లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్ వెల్‌నెస్ వైపు ప్రభుత్వ వైద్యులు అందరూ ఆలోచించాలని కోరారు. ఆరు నెలలు సెకండరీ ఆస్పత్రుల్లో, ఆరు నెలలు బోధన ఆసుపత్రుల్లో పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సొంతూళ్లలో పని చేయాలని చూసేవారు అటెండెన్స్ తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కొత్త బోధనాస్పత్రులకు ఇంకా నిర్మాణమే మొదలవలేదని చెప్పుకొచ్చారు. ÷ఎఓ÷ూని సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సీగా చేయాలంటే రూ.1000 కోట్లు కావాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని.. ఇవాళ అన్నీ కావాలంటే కొంత సమయం పడుతుందని తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ సాధించాలంటే ప్రధాన భూమిక డాక్టర్లదేనని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆక్సిజన్ సప్లై, ఇతర సదుపాయాలు ప్రైవేటు సెక్టార్ నుంచి వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ విషయంలోనూ ప్రైవేటు ఆస్పత్రులు పని చేస్తున్నాయని వివరించారు. ఏపీ వ్యాప్తంగా మొత్తం ఆసుపత్రుల్లో ఇప్పటి వరకూ.. 144శాతం ఔట్ పేషెంట్ సేవలు అందించామని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని రకాల స్థాయిల్లోని ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. 140శాతం సర్జరీలు మన ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగాయని వివరించారు. పిల్లల డెలివరీలు అన్ని ఆస్పత్రుల్లో పెంచాల్సి ఉందని తెలిపారు. ఎబిహెచ్ఎ యాప్ పూర్తి స్థాయిలో డౌన్ లోడ్ అయ్యేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకూ 96శాతం మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేశారని వెల్లడించారు. మరమ్మతులు చేయాల్సిన పరికరాలను వెంటనే చేయించాలని చెప్పుకొచ్చారు. నెల రోజుల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, వీల్ చైర్లు, స్ట్రెచర్లు, పడకలు.. అన్నీ మారాలని సౌరభ్ గౌర్ సూచించారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం



మొదటి పేజీ తరువాయి

భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ లేని భక్తులకు కూడా వేగవంతంగా దర్శనం చేయించామని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలపై దాదాపు 93 శాతం మంది భక్తులు సంతృప్తి చెందారని అన్నారు. ఈ పది రోజుల్లో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు అన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాల్లో 6.83 లక్షల మంది దర్శించుకోగా ఈ ఏడాది లక్ష మంది భక్తులకు అదనంగా దర్శనాలు జరిగాయన్నారు. జనవరి 2వ తేది శుక్రవారం రోజు అయినప్పటికీ రికార్డు స్థాయిలో 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని అన్నారు. జనవరి 3వ తేది శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 182 గంటల దర్శన సమయంలో 164 గంటల సమయం సామాన్య భక్తులకు కేటాయించడంతో సామాన్య భక్తుల్లో ఆనందం కలిగిందన్నారు. పది రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లుగా తెలిపారు. భక్తులకు విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య 44 లక్షలు అన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 10 లక్షల లడ్డూలు అదనంగా విక్రయం జరిగిందన్నారు. దాదాపు 2400 మంది పోలీసులు, 1150 మంది విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. వివిధ విభాగాల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలో 5 భాషల్లో భక్తులకు అర్థమయ్యేలా 400 ప్రచార బోర్డులు ఏర్పాటు. రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో వైకుంఠ ద్వార దర్శనాలపై అవగాహన కల్పించామని అన్నారు. తిరుమలలో విద్యుత్ దీపాలంకరణపై భక్తులు విశేష ప్రశంస వచ్చిందన్నారు. తిరుమలలో టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తిరుమలలో నీటి కొరత లేకుండా నిరంతరాయం భక్తులకు నీటి సరఫరా చేశామని అన్నారు. ఈ పది రోజుల్లో 33 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ జరిగిందన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాలతో పోల్చితే ఈసారి 9.29 లక్షల మంది భక్తులకు అదనంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశామని అన్నారు. తొలి మూడు రోజులు టోకెన్ కలిగిన భక్తులకే దర్శనం కల్పించడం జరిగిందన్నారు. దర్శన క్యూ లైన్లు, రోడ్లు, మరుగుదొడ్ల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట వేశామన్నారు. ఈ సందర్భంగా టీటీడీ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చక్కటి సేవలు అందించిన పోలీస్ యంత్రాంగం, జిల్లా యంత్రాంగం, ఏపీఎస్ ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, ఇతర విభాగాలు, మీడియా ప్రతినిధులకు చైర్మన్ ధన్యవాదాలు తెలియజేశారు.టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా గతంలో కంటే అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. గత వైకుంఠ ఏకాదశి రోజు 7 లక్షలకు పైగా దర్శించుకుంటే ఈసారి 12 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. టీటీడీ భక్తుల కోసం చేస్తున్న సౌకర్యాలను చూసి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారని చెప్పారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య సమన్వయంతో సమయాన్ని సరైన విధంగా వినియోగించుకోవడంతో అనుకున్న దానికన్నా అదనంగా దర్శన సమయం సమకూరడంతో మరింత మంది భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం చేయించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్, శాంతారామ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో గొడవలు చేస్తామంటే ఏరిపారేస్తా

మొదటి పేజీ తరువాయి



ఆయన మాట్లాడారు. పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపు రంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తా ను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. అవసరమైతే రాజకీయ-పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు.కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

**విశాఖ సంక్రాంతి సంబరాల్లో వెంకయ్యనాయుడు**

**విశాఖపట్నం :** భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని.. భారతీయ వంటలు అందరూ తినాలని దేశ ప్రజలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. మన పండగల విశిష్టతను చాటాలన్నారు. సంక్రాంతి పండగ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. విశాఖపట్నంపై తనకు ఎంతో ప్రేమ ఉందని చెప్పారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. తాను ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థినని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. తెలుగు రైతుల పండగ సంక్రాంతి.. తెలుగు వారి లోగిళ్లలో ఇది పెద్ద పండగని వెంకయ్యనాయుడు అభివర్ణించారు. ఫల సాయాన్ని అందించే వ్యవసాయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదని ప్రజలకు ఆయన హితవు పలికారు. అలాగే జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను, మాతృభాషను మర్చిపోకూడదని చెప్పారు. ప్రజలకు అర్థమయ్యే భాషలో పరిపాలన చేయాలంటూ ప్రభుత్వాలకు ఆయన సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలంటూ ఈ సందర్భంగా తల్లిదండ్రులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కీలక సూచన చేశారు.విద్యార్థి దశలో ఎన్నో పోరాటాలు చేశానని.. జైలుకు సైతం వెళ్లానని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆమె కారణంగానే తాను రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. స్వతంత్ర భారతదేశంలో ఆత్మ నిర్భర భారత్ కోసం అందరూ కృషి చేయాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ప్రపంచంలో నాలుగో వంతు జీడీపీ భారతదేశానిదేనని పేర్కొన్నారు. పశు సంపద ఎంత బాగుంటే జాతీయ సంపద కూడా అంత బాగుంటుందన్నారు. ఆత్మ నిర్భర భారత్ ముందు.. ఎవరు ఎన్ని సుంకాలు వేసినా ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. అందుకే ఆత్మ నిర్భర భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ అంటున్నారని వివరించారు. తాను రైతు బిడ్డగా పుట్టానని.. అందుకే రైతులు అంటే తనకు చాలా అభిమానమన్నారు.

## అద్దెబస్సుల సమ్మె పిలుపు విరమణ

మొదటి పేజీ తరువాయి

చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తాము ప్రధానంగా ఎదుర్కొంటున్న 5 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎండీ ద్వారకా తిరుమలరావు ముందుంచారు. బస్సుల్లో ఓవర్ లోడ్ వల్ల వచ్చే సమస్యలను పరిష్కరించడం,బస్సు ప్రమాదానికి గురైనపుడు ఇచ్చే ఇన్సూరెన్స్ సమస్యలకు పరిష్కారం చూపడం. కేఎంపీఎల్‌ను 5.77 నుంచి 5.27కు తగ్గించడం, నిర్వహణా ఖర్చుల కోసం ఇచ్చే మొత్తాన్ని పెంచడం.

అద్దె బస్సుల వాహన కార్మికులకు ఇచ్చే వేతనాలను పెంచడం వంటివి ఉన్నాయి. అయితే.. పై సమస్యలన్నింటినీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో ఎండీ తిరుమలరావు చర్చించారు. అనంతరం.. ఈనెల 20లోగా సమస్యలను పరిష్కరిస్తామని అద్దె బస్సుల యజమానులకు ఎండీ హామీ ఇచ్చారు. దీంతో ఈనెల 12 నుంచి తలపెట్టిన సమ్మెను విరమించుకుంటున్నట్లు బస్సుల యజమానులు వెల్లడించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే విరమణ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు.

# 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు

**తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం**

**29న ఆర్థిక సర్వే ప్రవేశ పెట్టనున్న కేంద్రం**

**యధావిధిగా ఫిబ్రవరి 1ననే బడ్జెట్ ప్రసంగం**

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జనవరి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తొలి దశ సమావేశాలు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండోదశ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఉభయ సభలు సమావేశం అయ్యేందుకు ప్రభుత్వం ప్రతిపాదించిన తేదీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తొలి రోజైన జనవరి 28న రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్నారు. ఏటా మాదిరిగానే ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్జడెట్‌ను సమర్పించనున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో సమావేశ తేదీలపై గత కొన్ని రోజులుగా సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఆ చిక్కుముడి వీడింది. దీంతో ఆదివారమై బడ్జెట్ యధాతథంగా ప్రవేశ పెడతారు.

# ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

**పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది**

**రాయ్‌పూర్ :** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తీ.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. లొంగిపోయిన మొత్తం మావోయిస్టులపై రూ. కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు (ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయి నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలిస్తామని కేంద్ర ప్రకటించింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తోంది. దేశంలోని అన్ని రాష్టాల్లో దాదాపుగా మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. చివరకు ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం కొంత మేర ఉంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ఎరివేతకు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వేలాది మంది మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన రివార్డులను అందజేస్తోంది. అదీకాక.. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగం కావాలంటూ ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌లో పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌కాగా.. కీలక నేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.

# టీటీడీ పాలకమండలికి జంగా కృష్ణమూర్తి రాజీనామా

**అమరావతి :** తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ పాలకమండలి సభ్యత్వానికి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు నాయుడుకి పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలంటూ ఆ లేఖలో సీఎం చంద్రబాబుకు జంగా కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను ఆ లేఖలో జంగా వివరించినట్లు తెలుస్తోంది. తంలో తనకు కేటాయించిన బాలాజీనగర్‌లో ప్లాట్ నెంబర్ 2 నేటికీ ఖాళీగానే ఉందని.. దీనిని తనకు కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరారని సమాచారం. దీనిని టీటీడీ బోర్డుకు ప్రభుత్వం పంపడంతో.. ఆమోదముద్ర పడినట్లు తెలుస్తోంది. అయితే గురువారం జరిగిన కేబినెట్ భేటీలో ఈ భూ కేటాయింపును రద్దు చేసినట్లు సమాచారం. దాంతో ఆయన టీటీడీ సభ్యత్వ పదవికి రాజీనామా చేశారనే ప్రచారం సాగుతోంది. 2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. అనంతరం ఆయన టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దాంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దాంతో టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడుని నియమించి.. పాలక మండలి సభ్యులుగా పలువురుని నియమించారు. ఆ జాబితాలో జంగా కృష్ణమూర్తికి స్థానం కల్పించారు.

## గెస్ట్ హౌజ్‌కోసం స్థలం కేటాయింపు తప్పా?

**భాను ప్రకాశ్ రెడ్డి వ్యతిరేకించడం బాధ కలిగించింది**

**బాబుకు ఇబ్బంది రాకూడదనే టిటిడి బోర్డుకు రాజీనామ చేశ**

**టీటీడీ సభ్యుడు జంగా కృష్ణమూర్తి వెల్లడి**

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు సభ్యత్వానికి తాను రాజీనామా చేశానని జంగా కృష్ణమూర్తి స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో జంగా కృష్ణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ.. తన రాజీనామాపై వివరణ ఇచ్చారు. 2005లో తాను టీటీడీ సభ్యుడిగా ఉన్న సమయంలో తిరుమలలో గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం భూమి ఇవ్వాలని కోరినట్లు జంగా తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు భూమిని ఇచ్చారని జంగా కృష్ణమూర్తి తెలిపారు. కానీ ఆ సమయంలో ఆర్థిక వెసులుబాటు లేక గెస్ట్ హౌస్ నిర్మించ లేకపోయానని తెలిపారు. మళ్లీ తనకు స్థలం కేటాయించాలని తాజాగా టీటీడీని కోరారని పేర్కొన్నారు. అందుకు టీటీడీ బోర్డు తీర్మానం చేసి ముఖ్యమంత్రికి పంపిందని చెప్పుకొచ్చారు. ఈ భూమిని తనకు కేటాయించాలా, వద్దా? అనేది ప్రభుత్వం నిర్ణయమన్నారు. దీనిపై పరిపాలన పరంగా నిర్ణయం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఈ తీర్మానంపై టీటీడీ బోర్డులో సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ ఒక్కరే వ్యతిరేకించారని పేర్కొన్నారు. తనకు స్థలం కేటాయించడం ద్వారా బోర్డు తప్పు చేసిందనే ఆలోచన రాకూడదనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తి ప్రకటించారు. టీటీడీ బోర్డుకు స్థలం కేటాయించడానికి హక్కు లేదా? అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనకు కేటాయించి.. రద్దు చేసిన భూమిని తాను చైర్మన్‌గా ఉన్న ఓం శ్రీ నమో వెంకటేశ్వర గ్లోబల్ ట్రస్ట్‌కు మళ్లీ కేటాయించాలని టీటీడీని కోరానంటూ జంగా కృష్ణమూర్తి ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. ఇది ఎలా తప్పు అవుతుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తాను ఈ నిర్ణయం తీసుకోకుంటే ప్రభుత్వానికి, టీటీడీ బోర్డుకు ఇబ్బంది వస్తుందనే ఈ పదవికి రాజీనామా చేసినట్లు చెప్పుకొచ్చారు. ముచ్చటగా మూడోసారి శ్రీవారి సేవ చేసుకోవడానికి సీఎం చంద్రబాబు తనకు అవకాశం కల్పించారని వెల్లడించారు.

# స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు చర్యలు

- గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు
- ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం
- బిల్లును సిద్ధం చేసిన అమెరికా





**న్యూఢిల్లీ :** స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేం దుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది. గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించారు. ఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్టాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమ్జర్గ÷న్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ÷ఎ2÷ఎ టెక్నాలజీ ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, దిశ వంటి కీలక సమాచారాన్ని సమీప వాహనాలతో పంచుకోగలవని ఆయన వివరించారు. టెక్నాలజీ వల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేసినా.. రోడ్డుపై వాహనాలు ఆగి ఉన్నా.. మిగతా వాహనాలకు అలర్ట్ వెళ్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థను అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సాంకేతికత రోడ్డు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

- ఈడీ చర్యలపై మమతా నిరసన ప్రదర్శన
- మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బీజేపీ
- విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఈడీ పిటిషన్



**కోల్‌కతా :** ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ, దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సుబ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారం రోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా మమతా బెనర్జీ అధికార దుర్వి నియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

## కోల్‌కతాలో ఈడీ దాడులకు నిరసన

**హోంమంత్రి అమిత్ షా నివాసం ముందు టీఎంసీ ఆందోళన**

**న్యూఢిల్లీ :** కోల్‌కతాలో ఈడీ దాడులను ఖండిస్తూ టీఎంసీ ఎంపీలు ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కార్యాలయం ముందు నిరసనలు చేపట్టారు. శుక్రవారం ఉదయం టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, శతాబ్ది రాయ్, మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్‌తో పాటు మరికొంతమంది నిరసనలు చేపట్టారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేయటం మొదలెట్టారు. పోలీసులు రంగంలోకి దిగి వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అతి కష్టం మీద వారిని అక్కడి నుంచి పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌కు తరలించారు. రాజకీయ కన్‌స్టలెన్సీ సంస్థ ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో గురువారం ఈడీ సోదాలు నిర్వహించింది. కోల్‌కతాలోని ఆయన నివాసంలో ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఈడీ తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా మమతా మీడియాతో మాట్లాడుతూ.. 'మా ఐటీ సెల్ చీఫ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. మా పార్టీకి సంబంధించిన దస్త్రాలు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మా పార్టీ అభ్యర్థుల వివరాలు వాటిలో ఉన్నాయి. వాటిని వెనక్కు తీసుకున్నారని అన్నారు. మా పార్టీకి సంబంధించిన డాక్యుమెంట్లను ఈడీ తీసుకోవచ్చా? నేను ఇలాగే బీజేపీ ఆఫీసుకు వెళితే పరిస్థితి ఏమిటి? ఓటర్ జాబితా సమగ్ర సవరణ పేరిట




ఇప్పటికే 5 లక్షల మంది పేర్లను తొలగించారు. కేవలం ఎన్నికలు జరగనున్నాయనే ఇలా చేస్తున్నారు'.. అంటూ మండిపడ్డారు. కాగా, కేంద్రం రాజకీయ లబ్ధి కోసం ఈడీని అస్త్రంగా వాడుతోందని టీఎంసీ పార్టీ నేతలు అంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు.

# శబరిమల ప్రధాన పూజారి అరెస్టు

**శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం**

**తిరువనంతపురం :** కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరును సిట్ అధికారులు తాజాగా అరెస్టు చేశారు. పలు నివేదికల ప్రకారం.. బంగారు తాపడాల చోరీ కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా పలువురు సిట్ అధికారులు మాట్లాడుతూ.. శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో సిట్ అధికారుల బృందం ఆయన్ను అదుపులోకి తీసుకుందని వివరించారు. విచారణ అనంతరం శబరిమల ఆలయ ప్రధాన పూజారి కందరారు రాజీవరును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టితో రాజీవరుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. నిజానికి శబరిమలకు ఉన్ని కృష్ణన్ పొట్టిని తీసుకువచ్చింది కూడా తంత్రి కందరారు రాజీవరేనని ఇతర నిందితులు తమ వాంగ్మూలంలో తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. బంగారు తాపడాల చోరీ గురించి ఆయనకు ఫస్ట్ నుంచే సమాచారం ఉందని తెలిపారు. ఈ చోరీపై ఈడీ కేసు





÷ల్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 2019లో కేరళలోని శబరిమల ఆలయం గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించారు. ఉన్ని కృష్ణన్ అనే దాత వాటిని సరిచేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని తీసుకెళ్లారు. ఆ టైంలో ఈ పనిని పూర్తి చేయడానికి చెన్నైలోని ఓ కంపెనీకి ఇచ్చారు. ఆ రాగ తాపడాలను తొలగించే టైంలో రికార్డుల్లో వాటి బరువును 42.100 కిలోలుగా పేర్కొన్నారు. అయితే ఎలక్ట్రోప్లేటింగ్ పక్రియ పూర్తైన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత కనిపించకుండా పోయిందని ఆ కంపెనీ వెల్లడించింది. ఇందులో ఏదో తిరకాసు జరిగినట్లు అధికారులు గుర్తించి, విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో ఉన్ని కృష్ణన్ సహా పలువురు ప్రధాన అధికారులు నిందితులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# ప్రాజెక్టుల్లో మునిగిపోతున్న నిర్వాసిత జీవితాలు

పోలవరం కావచ్చు...మల్లన్న సాగర్ కావచ్చు లేదా కొండపోచమ్మ సాగర్ కావచ్చు లేదా..గతంలో గంగవరం పోర్టు కావచ్చు..ప్రాజెక్టులు ఏవైనా త్యాగం ప్రజలది, భోగం కార్పోరేట్లది అవుతోంది. వేలకోట్లు పెట్టి ప్రభుత్వాలు కట్టించే ప్రాజెక్టులు సైతం కార్పోరేట్లకు ధారదత్తం చేస్తున్నారు. భూముల సేరణ, ఇళ్లను సేకరించడం తరవాత వారికి కబుర్లు చెప్పడం ఆ తరవాత వారి త్యాగాలను మరచిపోతున్నారు. గంగవరం పోర్టు కోసం త్యాగం చేసిన మత్స్యకారులు రోడ్డున పడ్డారు. పోర్టును పొందిన ఆదానీ ఒడ్డున పడ్డారు. ఇలా ఏ ప్రాజెక్టు తీసుకున్నా ఇదే చరిత్ర కనిపిస్తుంది. ఘనత వహించిన తెలంగాణ వల్లభుడు కెసిఆర్ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు భూములు ఇచ్చి, ఊర్లను త్యాగం చేసిన వారు ఆగమయ్యారు. కెసిఆర్, ఆయన అనుయాయలు పొలాలు మాత్రం పచ్చగా తడుస్తున్నాయి. తాజాగా అమరావతి రాజధాని కోసం లక్ష ఎకరాలు సేకరిస్తున్నారు. అయినా పాలకలు భూదాహం తీరడం లేదు. అమరావతిలో భూమి తీసుకున్న రైతులకు అరకొరగానే పరిహారం అందించారు. ప్లాట్లను సక్రమంగా అందించలేదు. బహిరంగంగా వారిపై ప్రశంసలు కురిపించడం తప్పవారికి లబ్ది చేకూర్చడం లేదు. ఇంకా ప్లాట్ల కోసం అక్కడి రైతులు పాట్లు పడుతూనే ఉన్నారు. తాజాగా రెండోదఫా భూసేకరణ మొదలయ్యింది. ఈ అభివృద్ధి ఏ ప్రజల కోసమన్నది పాలకులు ఆలోచన చేయాలి. ప్రజలను ముంచి చేసే పనులు మంచి ఎలా అవుతాయి. పోలవరం సంగతి చూస్తే అక్కడి నిర్వాసితులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇలా దేశవ్యాప్తంగానే కాదు... తెలుగు రాష్ట్రాల్లో ఘనత వహించిన పాలకులు రైతులను నట్టేట ముంచుతున్నారు. పోలవరంలో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించిన ఆయన ముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేయడానికి కృషి చేయడం లేదు. తీయని మాటలు తప్ప చిత్తశుద్ద ఇకానరావడం లేదు. జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రా-జెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ అండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు. మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేక పోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫైచేసిన ఉన్నతాధి కారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు. ఇప్పటికైనా ముందు నిర్వాసితులను ఆదుకోవాలి. దుబారా హెలికప్టర్ ఖర్చులు తగ్గించుకుని వారికి న్యాయం చేయాలి.



కంచర్ల అచ్యుత్ రావు
ఎడిటర్

# తెలుగు వారి సంస్కృతీ, సాంప్రదాయానికి ప్రతీక కొండపల్లి బొమ్మలు

**ప్రపంచానికి తెలుగువారిచ్చిన విలువైన బహుమతి కొండపల్లి బొమ్మలు**

**యూరోపియన్ యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్**




**విజయవాడ:** ప్రాచీన చరిత్ర, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహితమైన తయారీ విధానం అంతర్జాతీయ స్థాయిలో కొండపల్లి హస్తకళల పేరు ప్రఖ్యాతలకు ముఖ్య కారణమని యూరోపియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ తెలిపారు. తెలుగువారి కళా వైభవానికి నిలువుటద్దం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి హస్తకళలను శుక్రవారం కొండపల్లిలోని ఏపీ టూరిజం శాఖ నిర్వహిస్తున్న కొండపల్లి ఎక్స్పీరియన్స్ సెంటర్ ను యూరోపియన్ యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి. లక్ష్మశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తో కలిసి పరిశీలించారు. స్థానికుల సంక్రాంతి ముగ్గులతో సాంప్రదాయ స్వాగతంతో అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ పర్యటన ప్రారంభమైంది. సాంప్రదాయ హారతి, పూల దండలతో రాయబారిని తిలకందిద్ది స్వాగతించగా, వీధి మొత్తం సప్తవర్ణ ముగ్గులతో అలంకరించబడిన పండుగ వాతావరణంగా మారింది. ఈ ప్రాంతమంతా సంక్రాంతి ముందుగానే వచ్చిన స్ఫూర్తిని ప్రజల మనస-స్సుల్లో రేకెత్తించింది. దీనికితోడు సంక్రాంతి గొబ్బెమ్మల పాటలకు రాయబారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ. లక్ష్మశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియాలు స్థానిక మహిళలతో కలిసి పాటలు పాడుతూ నృత్యాలు చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈయూ రాయబారి ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను సందర్శించి అందులో బొమ్మల తయారీ విధానాన్ని, వాటి ధరలను కళాకారుల నుండి అడిగి తెలుసుకున్నారు. సాదాసీదా పొనికి కర్రతో కళాకారుల చేతుల్లో ప్రాణం పోసుకుని, అద్భుత శిల్పాలుగా మారే ప్రక్రియను చూసి ఆయన ముగ్ధులయ్యారు. కేవలం బొమ్మలను బొమ్మలగానే కాకుండా, ఆ బొమ్మల వెనుక ఉన్న శతాబ్దాల నాటి చరిత్రను, హస్తాకళాకారుల మనోభావాలను, వారి అంకితభావాన్ని అంబాసిడర్ కొనియాడారు. ప్రతి బొమ్మ ఒక కథ చెబుతోంది, ప్రతి రంగు ఒక సంస్కృతిని ప్రతిబింబిస్తోంది అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించటం ఆయనను ఈ పర్యటన ఎంత హత్తుకుందో చెప్పకనే చెపుతుంది. ఐరోపా దేశాలకు, భారతీయ గ్రామీణ కళలకు ముఖ్యంగా తెలుగువారి సాంస్కృతిక వైభవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం ఎంతో అద్భుతంగా ఉందనటానికి ఈ పర్యటన ఒక గొప్ప సాంస్కృతిక వారధిలా నిలుస్తుందని, హస్తకళాకారుల నైపుణ్యం ప్రపంచ స్థాయి ప్రశంసలకు అర్హమని ఆయన పేర్కొన్నారు. స్థానిక సభ్యులు రమణరావు, తదితరలు రాయబారికి కొండపల్లి బొమ్మలను బహుకరించారు. ఈ సందర్భంగా హెర్వే డెల్ఫిన్ మాట్లాడుతూ.. "కొండపల్లి కళాకారుల వేళ్ల కొనల్లో అద్భుతమైన మ్యాజిక్ ఉంది. ఒక సామాన్యమైన చెక్క ముక్కను అపురూపమైన కళాఖండంగా మార్చడం నిజంగా అద్భుతం. ఈ



వారసత్వాన్ని కాపాడుతున్న కళాకారులకు నా అభినందనలు. ఈ పర్యటనలో ఆయన కళాకారులతో ముచ్చటించి, బొమ్మల తయారీలోని మెళకువలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కొండపల్లి ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన ఈ సందర్శన, స్థానిక కళాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత శక్తివంతమైన జీవన చేతిపనుల సంప్రదాయాలలో ఒకటైన కొండపల్లి హెరిటేజ్ స్ట్రీట్, ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను సందర్శించడంతో, కొండపల్లిలోని చారిత్రాత్మక వారసత్వ వీధి రంగులు, చేతిపనులు మరియు వేడుకలతో సజీవంగా మారింది. పార్క్ హయత్ హెూటల్ ల్లో ఈయూ రాయబారి ఆంధ్రా వంటకాలు సాంప్రదాయమైన అరటికాయ అరిటాకులో భోజనం చేశారు.. ఘాటైన 'గుంటూరు గోంగూర పచ్చడి', 'నాటుకోడి పులుసు' రుచికి ఆయన ఆశ్చర్యపోయారు. రాయలసీమ స్పెషల్ 'ఉలవచారు', నెల్లూరు 'చేపల పులుసు' అంబాసిడర్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయి. నోరూరించే 'పూతరేకులు', వేడి వేడి 'బొబ్బట్లు, పులిహోర' తిన్న తర్వాత, "యూరప్ డెజర్ట్ లకు ఇవి ఏమాత్రం తీసిపోవు" అని అంబాసిడర్ ప్రశంసించారు. "ఆంధ్ర వంటకాల్లోని సుగంధ ద్రవ్యాలు, వాటి వెనుక ఉన్న సంప్రదాయం అద్భుతం. ఇక్కడి ప్రజల ఆత్మీయత ఆ వంటకాల్లో కనిపిస్తోందని అని అంబాసిడర్ పేర్కొన్నారు. స్టార్ హెూటల్స్ అధ్యక్షులు రామిశెట్టి వీరాస్వామి కూడా రాయబారితో ఉన్నారు. గుణదల పార్క్ హైయత్ హెూటల్లో మధ్యాహ్న భోజనం అనంతరం మాట్లాడుతూ... యూరోపియన్ దేశాల సాంకేతికత, పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సుదీర్ఘ తీరప్రాంతాన్ని ఒక ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చేందుకు బ్లూ వ్యాలీ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించినట్లు ఈయూ రాయబారి హెర్వే డెల్ఫిన్ తెలిపారు. సముద్ర వనరుల స్థిరమైన వినియోగం, తీరప్రాంత అభివృద్ధి, సముద్ర ఆధారిత పరిశ్రమల వృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించే వీలుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల్లో సహకారంపై చర్చించామన్నారు. ఆవకాయ్-అమరావతి ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొనడం ఒక గొప్ప అనుభూతిని కలిగించిందని.. ఆ కార్యక్రమంలో ప్రదర్శించిన సంగీత, నృత్య ప్రదర్శనలను ఆశ్వాదించానన్నారు. త్వరలో దిల్లీలో ఈయు- ఇండియా సమ్మిట్ జరగనుందన్నారు. ఈయూ సమాఖ్య నాయకలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వివిధ అంశాలపై చర్చించి ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ పై సంతకాలు చేసే వీలుందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ఉన్న 6,000 ఐరోపా కంపెనీల సంఖ్య, పెట్టుబడులు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ కంపెనీల ద్వారా స-మారు 3.8 మిలియన్ల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఐరోపాలో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, వారికి స్కాలర్‌షిప్‌లు, ఇతర నైపుణ్య శిక్షణలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గత ఏడాది రికార్డు స్థాయిలో 9 లక్షల మంది భారతీయులు ఐరోపాకు వీసాలు పొందారన్నారు. రానున్న రోజుల్లో విద్య, వ్యాపారం, సంస్కృతి, పర్యాటక రంగాల్లో సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఈయూ రాయబారి హెర్వే డెల్ఫిన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# విజయ అకాడమీలో సంక్రాంతి సంబరాలు



**చల్లపల్లి:** సంక్రాంతి ముందేవచ్చిందా అన్నట్లుగా స్థానిక విజయా ఆకాడమీలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కావటంతో చిన్నారులు, విద్యార్థినీ విద్యార్థులు కొత్త దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. పలువురు చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణలో రావటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా భోగిమంటలు, పాలపొంగళ్లు, బొమ్మల కొలువు, హరిదాసుల వేషధారణలతో పండుగ వాతావరణం ఉట్టిపడింది. ఎల్ కేజీ, యుకేజీ చిన్నారులకు ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, హెచ్‌ఎం కోటేశ్వరి దంపతులు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసి కేరింతలు కొట్టారు.



# అలరింపజేసిన ఆవకాయ సాంస్కృతికోత్సవం





**విజయవాడ:** ఆవకాయ్... సినిమా, సంస్కృతి, సాహిత్యాల అమరావతోత్సవం రెండో రోజు శుక్రవారం సాయంత్రం పున్నమిఘాట్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు ప్రేక్షకులకు కొత్త మధురానుభూతులను అందించాయి. దుర్గమ్మ చల్లని నీడలో కృష్ణమ్మ చెంత సాంస్కృతిక సౌరభాల సంగమం సరికొత్త మాధుర్యానికి చేరువ చేసింది. కర్ణాటక, ఆధ్యాత్మిక సంగీత విభావరి మన సంప్రదాయ సాంస్కృతిక విశిష్టతను గుర్తుచేసింది. వనశ్రీరావు.. కూచిపూడి నృత్యం.. రస ఐక్యం ప్రేక్షకుల మదిలో పదిలమైన ముద్ర వేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కలలకు కదలిక ఇచ్చే కళ సినిమాకు సంబంధించి పాటల రచన, సాహిత్యానికి సంబంధించి సినీ రంగ ప్రముఖులతో జరిగిన చర్చా గోష్టి ఆధునిక సినిమా సాహిత్య ధోరణులను కళ్లకుకట్టింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తదితరులు కార్యక్రమాలకు హాజరై.. కళాకారులను అభినందించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శనివారం 10 జనవరి 2026


# పిహెచ్‌సిల్లో వైద్యసేవలు మెరుగుపడాలి

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం,(మనసులోమాట) జనవరి 09..** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలను మెరుగుపర్చాలని, ఓపి పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. పిహెచ్‌సి వైద్య సేవలపై తమ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ సర్వేపైనా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిహెచ్‌సిల ద్వారా అందుతుతన్న వైద్యసేవలపై కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఓపిని సగటున రోజుకి 50కి పెంచాలని ఆదేశించారు. అలాగే ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని సూచించారు. అందిస్తున్న వైద్య సేవలను మరింత మెరుగుపర్చాల్సి ఉందన్నారు. మలేరియా, డెంగ్యూ, డయేరియా తదితర వ్యాధులపై సమీక్షిస్తూ, సీజనల్ వ్యాధులు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికోసం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో ప్రసవాలపై సమీక్షిస్తూ, అన్నిపిహెచ్‌సిల్లో ప్రసవాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అన్ని చోట్లా అవసరమైన సదుపాయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంచి, అక్కడే ప్రసవాలు జరిగేటట్టు చూడాలని సూచించారు. అంటువ్యాధులు విజృంభించకుండా చూడాలన్నారు. మాతృ, శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, వైద్యాధికారులు, పిహెచ్‌సిల వైద్యులు పాల్గొన్నారు.



# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని..

## తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న హోం మంత్రి అనిత

**నక్కపల్లి జనవరి 9 మనసులో మాట..** కలియుగ ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని రాష్ట్ర హోం మంత్రి అనిత దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం తిరుమల ఆలయానికి చేరుకున్న మంత్రి అనిత స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమం, అభివృద్ధిని అందించే శక్తిని కూటమి ప్రభుత్వానికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం ఆలయ వేదపండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేయగా, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.మంత్రి అనిత వెంట పలువురు అధికారులు, పార్టీ నాయకులు ఉన్నారు.

# ప్రైవేట్ బస్సు యజమానులు అధిక ధరకు టికెట్స్ తీసుకుంటే చర్యలు

## రవాణా కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా



**అనకాపల్లి, జనవరి 9 (మనసులో మాట):** సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు దూర ప్రాంతాల నుంచి సొంత ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రజలు ప్రయాణించడం వలన ఏర్పడే అధిక డిమాండ్ నేపథ్యంలో ప్రైవేట్ బస్సు యజమానులు అధిక ధరలకు టికెట్స్ అమ్మకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని రవాణా కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా శుక్రవారం అన్ని జిల్లాల రవాణా శాఖ అధికారులు ఆయా జిల్లాలో ఉన్న ప్రైవేట్ బస్సు యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ నిర్దేశించిన ధరల కంటే 50 శాతం మాత్రమే గరిష్ట ధర గా నిర్ణయించి, అంత కంటే ఎక్కువ ధరలకు టికెట్స్ అమ్మే ప్రైవేట్ బస్సు యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ నిర్ణయించిందన్నారు. ఆర్ టిజిఎస్ ద్వారా మరియు జిల్లాలో గల రవాణా అధికారులు అభి బస్, రెడ్ బస్ వంటి యాప్ ల ద్వారా బస్ ధరలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అధిక ధరలు వసూలు చేసే బస్ యజమానులపై కేసులు పెడతామని తెలియజేశారు. ప్రతీ ప్రైవేట్ బస్సు లోనూ రవాణా శాఖ హెల్ప్ లైన్ నెంబర్ 92816 07001 ను డిస్ప్లే చేయాలని బస్ యజమానులను ఆదేశించారు. శుక్రవారం నుండి జనవరి 18 వరకు అన్ని జిల్లాలో గల రవాణా అధికారులు ప్రైవేట్ బస్సుల పై ఎన్ఫోర్స్మెంట్ చేస్తారని రవాణా కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా తెలియజేశారు.

## రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం

# అధిక ప్రాధాన్యత

**- 10 వేల కిలోమీటర్లు రోడ్ల కు 3 వేల కోట్లు కేటాయింపు**

**- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు**



**అనకాపల్లి, జనవరి 9 (మనసు లో మాట):** రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధి కి మూడువేల కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. శుక్రవారం ఉదయం జిల్లాలో జరుగుతున్న రోడ్లు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తో కలిసి పాల్గొన్నారు. పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లు అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన అన్నారు. రాష్ట్రంలో 10,500 కిలోమీటర్ల రోడ్లు అభివృద్ధికి మూడు వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆయన తెలిపారు. పనులకు సంబంధించి అన్ని అనుమతులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా లో 113 కోట్ల రూపాయలతో 38 రోడ్ల పనులు మంజూరు చేయడమైనదన్నారు. వీటిలో 22 పనులకు టెండర్లు పూర్తిచేయడం జరిగిందని, మిగిలిన పనులు టెండర్లు దశలో ఉన్నాయని తెలియజేసారు. ఈ పనులన్నింటి ని జూన్ నాటికి పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమైన అడ్డురోడ్డు-నర్సీపట్నం, భీమిలి-నర్సీపట్నం, వడ్డాది-పాడేరు రోడ్డుపనులు పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ఎన్.డి.పి. పథకం క్రింద 130 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన 62 కిలోమీటర్ల రోడ్డు పనులను మార్చినాటికి పూర్తిచేయడం జరుగు తుందన్నారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లింపులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 60 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందని, 70 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లింపులకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కాంట్రాక్టర్ల తో సమావేశం నిర్వహించడం జరిగిందని, బకాయిలు, పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులకు వారికి భరోసా కల్పించడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేయాలని వారికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. గ్రామీణ రోడ్లలో కూడా భారీ వాహనాల రద్దీ పెరిగిన నేపద్యంలో ముఖ్యమైన రహదారులను జాతీయ రహదారుల స్థాయి ప్రమాణాల తో నిర్మించుటకు పి.పి.పి. పద్దతిలో చేపట్టనున్నట్లు, అధిక లోడు వాహనాల ను నియంత్రించుటకు ఫిబ్రవరి నెల నుండి టోల్ గేట్ ల వద్ద ఆటోమేటిక్ లోడు పరిశీలన యంత్రాలను ఏర్పాటుచేసి, ఆర్.టి.జి.ఎస్. తో అనుసంధానం చేసి జరిమానాలు విధించుటకు వ్యవస్థను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, రోడ్లు భవనాలశాఖ ఎస్.ఇ. కె.జె. ప్రభాకర్, ఇఇ ఎన్. సాంబశివరావు పాల్గొన్నారు.

# ఒక జిల్లా - ఒక ఉత్పత్తి గా మామిడి తాండ్ర

**- అభివృద్ధి, విస్తరణకు జిల్లా కలెక్టర్ ప్రణాళిక**



**విజయనగరం, (మనసులోమాట):: జనవరి 09..** ఒక జిల్లా - ఒక ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి మామిడి తాండ్రను ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ప్రకటించారు. విస్తరణ, అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎల్‌కోట మండలం భీమాలి వద్ద తయారయ్యే మామిడి తాండ్ర ఇప్పటికే ఎంతో ప్రసిద్ధి పొందింది. ఇక్కడ ఏటా సుమారు 500 మెట్రిక్ టన్నుల వరకు మామిడి తాండ్ర తయారవుతోంది. ఈ ప్రాంతం నుంచి ఢిల్లీ, హైదరాబాద్ లాంటి ప్రదేశాలకు వెళ్లేవారు అక్కడి తమ బంధువులకు, ప్రముఖులకు భీమాలి మామిడి తాండ్రను బహూకరించడం అలవాటు. అటువంటి మామిడి తాండ్రను విశ్వవ్యాపితం చేయాలని, తద్వారా ఈ ప్రాంతంలోని రైతులు, తయారీదారులు, మహిళా సంఘాలకు చేయూత నివ్వాలని జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి నిర్ణయించారు. దీనిలో భాగంగా మామిడి తాండ్ర తయారీ, ప్యాకేజింగ్, మార్కెటింగ్‌కు ఆధునికతను జోడించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. దీనికోసం సంబంధిత అధికారులతో తమ ఛాంబర్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. పరిశుభ్రమైన విధానంలో, ఆధునిక పద్దతిలో మామిడి తాండ్రను తయారు చేయడం, నిల్వ చేయడం, బ్రాడింగ్, మార్కెటింగ్ వసతులపై కలెక్టర్ చర్చించారు. తయారీకి సోలార్ డ్రైయర్స్ లాంటి పరికరాలు, నిల్వ చేయడానికి కోల్డ స్టోర్‌రూమ్‌లు, ప్రత్యేక బ్రాండింగ్, సాధారణ మార్కెట్‌తోపాటు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్‌కు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీనికోసం ఇప్పటికే ఎల్.కోటలో ఉన్న ఎఫ్‌పిఓ ను పునరుత్తేజం చేయాలని, అక్కడ మూతపడ్డ కోల్డ్ స్టోరేజీని తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ ప్రాంతంలోనే కొత్తగా ఒక ఎస్‌పివి (స్పెషల్ పర్పస్ వెహికల్)ను కూడా ఏర్పాటు చేసి, మామిడి తాండ్ర ఉత్పత్తి, పంపిణీలో భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి, ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, మెప్మా పిడి చిట్టిరాజు, చేనేతజౌళిశాఖ ఎడి మురళీకృష్ణ, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, పరిశ్రమలశాఖ జిఎం ఎంవి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మునగపాక ఎంపిపి పై

# అవిశ్వాస తీర్మానం...?

**అనకాపల్లి ఆర్డీవో అయేషా కు వైఎస్ఆర్సీపి ఎంపిటిసిలు వినతి**

**సోంత రాజకీయ ఏజెండా తో ఎంపిపి ఉండడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని విశ్లేషకుల భావన**



**అనకాపల్లి, జనవరి 9 (మనసులో మాట):** జిల్లా అంతటా ఒకటైతే మునగపాక లో రాజకీయ పరిణామలు మరొకలా వేగంగా మారుతూ ఒక ప్రత్యకత కు వేదికగా నిలుస్తాయి. సోంత ఏజెండా తో రాజకీయాలు చేసేవారికి ఎవరికైనా కనువిప్పే అవుతుందని మునగపాక ఎంపిపి పరిస్థితే తేటతెల్లం చేస్తుంది.సోంత పార్టీ వారే అవిశ్వాసానికి సంసిద్ధులయ్యారంటే పరిస్థితి వేరే చెప్పనక్కర లేదు. మునగపాక మండలంలో 16 మంది ఎంపిటిసి ఉండగా వీరిలో అత్యధికులు వైఎస్ఆర్సీపి వారే. 11 మంది వైకాపా , నల్గురు కూటమి పార్టీ ల వారు కాగా మరొకరు మరణించారు. అయితే ఎంపిపి వైఎస్ఆర్సీపి కి చెందిన వారైనప్పటికీ అవిశ్వాస పరిస్థితులు తలెత్తాయి. దీనంతటికీ సాదారణ ఎన్నికలకు ముందు ఎంపీపీ జయలక్ష్మి వైకాపా నుంచి జనసేన పార్టీ లోకి మారి ఆపార్టీ తీర్ధం పుచ్చుకోవడం జరిగింది. అంతవరకు బాగానే ఉంది. కనీసం నియమ నిబంధనలు అనుసరించడం లేదు సరికదా పార్టీ మారుతున్నట్టు చెప్పలేదని వైకాపా ఎంపిటీసిలు అప్పటి నుంచి గుర్రుగా ఉన్నారు. ఈలోగా ఏమైందేమిటో తెలియదు గాని మరలా వైకాపా లోనికి ఎంపీపీ వచ్చేసారు. అయినా ఈ కప్పలతక్కిడి వ్యవహారాలేమిటని వైకాపా ఎంపిటిసి లలో అగ్రహావేషాలు అలుముకొనే ఉన్నాయి. మండల సమావేశాలకు సైతం మెజార్టీ ఎంపిటీసీ లు వెళ్ళని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏదేమైనా ఎంపీపీ పై అవిశ్వాసానికి పార్టీ వారిని సంప్రదించకుండా సోంత నిర్ణయాలు తీసుకోవడమే ఈ పరిస్థితులకు కారణమైందని రాజకీయ విశ్లేషకుల భావన. కాగా శుక్రవారం ఆర్డీఓ అయేషా కు మునగపాక ఎంపిపి పై అవిశ్వాసం కోరుతూ వైకాపా కు చెందిన పది మంది ఎంపిటీసీలు వినతిపత్రం అందజేయడం జరిగింది.



# కొణతాలను కలిసిన ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వి. సతీష్

**అనకాపల్లి, జనవరి 9 (మనసు లో మాట):** ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విశాఖకు చెందిన జనసేన సీనియర్ నాయకుడు, కూటమినేత వి.సతీష్ అనకాపల్లి లో శుక్రవారం సీనియర్ నేత, మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సతీష్ ను ఎమ్మెల్యే కొణతాల అభినందించారు. అనంతరంఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి సహకరించవలసిందిగా కొణతాల రామకృష్ణ ను సతీష్ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మాజీ సభ్యులు పూసపాటి భరత్ బాబు, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు బంటు రవి, రొంగలి రామకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జన్న కొండ తీర్ధ ఏర్పాట్లపై

# సమీక్షించిన కొణతాల



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** శతాబ్దాల చరిత్ర కలిగిన బొజ్జన్న కొండ కనుమ పండుగ రోజు నిర్వహించే తీర్థానికి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ బౌద్ధ క్షేత్ర ప్రదేశాన్ని సందర్శించి,మాట్లాడుతూ ఆర్కియాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిచే గుర్తింపబడిన ఆంధ్రప్రదేశ్‌లోని 4 నుండి 9వ శతాబ్దాల మధ్యనాటి వారసత్వ సంపదలో ఒకటి అన్నారు. బౌద్ధమత వైభవాన్ని, శిల్పకళను ప్రదర్శిస్తున్న బొజ్జన్నకొండ అనకాపల్లికి, శంకరం గ్రామంలో ఉన్న బౌద్ధ సంస్కృతి మరియు కళలను తెలిపే ఒక అద్భుతమైన ప్రదేశం అన్నారు. పురాతన బౌద్ధ క్షేత్రం, చారిత్రికంగా ముఖ్యమైన రాతితో చెక్కబడిన గుహలు, స్థూపాలకు ప్రసిద్ధి గాంచిన క్షేత్రానికి ప్రతి ఏటా విదేశీ సందర్శకులు సైతం వస్తుంటారన్నారు. ఈ సమీక్షలో కట్టదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, విద్యుదీకరణ, మంచినీరు, ఆరోగ్యం, రక్షణ, ట్రాఫిక్ విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని, చుట్టుపక్క గ్రామాలు, పట్టణాల నుంచి వేల సంఖ్యలో భారీ ఎత్తున భక్తులు తీర్థానికి వస్తారన్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ, మెడికల్ అండ్ హెల్త్, ఆర్కియాలజీ, అగ్నిమాపక కేంద్ర అధికారులు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మకర సంక్రాంతి శోభ

**భోగి మంటల చుట్టూ నృత్యాలతో అలరించిన ఉపాధ్యాయులు,**

**విద్యార్థులు పొంగలి కలుపుతున్న ఉపాధ్యాయులు**



**హుకుంపేట జనవరి 9 మనసులో మాట:** మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) ముందుగానే మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భోగి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా భోగి మంటలు వెలిగించి, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే దింసా నృత్యాలు చేస్తూ భోగి మంటల చుట్టూ విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం కుండలో పొంగలి వంటకాలను సిద్ధం చేసి పండుగ ప్రత్యేకతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేజీబీవీ ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ, సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన భారతదేశంలో ఆచారాలు పాటిస్తూ పండుగలను జరుపుకోవడం శుభపరిణామమని తెలిపారు. సెలవులకు ముందుగానే పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి సంక్రాంతి వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.విద్యార్థులు సంతోషంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేయడం వల్ల విద్యా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిత్యం పాఠాలు బోధించే ఉపాధ్యాయులు, చదువులో నిమగ్నమై ఉండే విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందుతారని అన్నారు. సెలవులకు వెళ్లే విద్యార్థులు జాగ్రత్తగా ఇంటికి చేరుకొని, సెలవులు ముగిసిన తరువాత తిరిగి పాఠశాలకు రావాలని ఆమె ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## సంక్రాంతి వేళ 'చైనీస్ మాంజా'పై ఉక్కుపాదం నిబంధనలు అతిక్రమిస్తే
# కఠిన క్రిమినల్ చర్యలు
### - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి టౌన్, జనవరి 9 మనసులో మాట:** రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) అమ్మకాలు, నిల్వ, రవాణా మరియు వాడకంపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం దీనిపై పూర్తి నిషేధం ఉందని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సింథటిక్ దారం ద్విచక్ర వాహనదారుల మెడకు తగిలి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి అన్నారు. గాలిపటాలు ఎగురవేసే క్రమంలో చిన్నారుల వేళ్లు తెగి తీవ్ర రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. ఆకాశంలో ఎగిరే పక్షులు, వన్యప్రాణులు ఈ దారంలో చిక్కుకుని విలవిల్లాడి మరణిస్తున్నాయి అని తెలిపారు. ఈ దారం విద్యుత్ తీగలకు తగిలితే విద్యుత్ షాక్ తగిలే అవకాశం ఉంది, ఇది అగ్నిప్రమాదాలకు దారితీస్తుంది. ఇది భూమిలో కలిసిపోని పదార్థం కావడం వల్ల పర్యావరణానికి దీర్ఘకాలిక నష్టం కలిగిస్తుంది. "చైనీస్ మాంజా అనేది పండుగ ఆటవస్తువు కాదు, అది ఒక ప్రాణాంతక ఆయుధం. మన ఆనందం ఇతరుల ప్రాణాలకు సంకటంగా మారకూడదు." అని ఎస్పీ అన్నారు.

## హ్యాపీ కిడ్స్ ప్లే స్కూలు లో సంక్రాంతి సంబరాలు



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు కరస్పాండెంట్ గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. శుక్రవారం చిట్టి పొట్టి చిన్నారులు అంతా సంక్రాంతి సమయంలో మాత్రమే కనిపించే హరిదాసు, గంగిరెద్దు వారు, జానపద వేషదారులు, రైతులు తదితర వేషధారణలతో పాఠశాలకు విచ్చేసి చూపరులను విశేషంగా ఆకర్షించారు. సంక్రాంతి హిందువులకు పెద్ద పండుగ అని సూర్యుడిని, ప్రకృతిని,పంటలను, ఆరాధిస్తూ భోగి మంటలు సంక్రాంతి గొబ్బెమ్మలు, ముగ్గులు, కనుమ పిండి వంటలతో సాగే పండుగ తెలుగు వారికి ప్రధానమన్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి అమితానందం పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునీత, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, విశ్రాంత నీటిపారుదల శాఖ ఏఈ మల్ల చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

# సిరమ్మ సాయం



విజయనగరం,(మనసులోమాట): జనవరి 9: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాస రావు(చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ తమ వద్ద పని చేస్తున్న సిబ్బంది పట్ల మరోసారి తన ఆప్యాయతను చాటుకున్నారు. తమ వద్ద చాలా కాలంగా వంట మాస్టర్ గా పని చేస్తున్న అనిల్ రే కి సంక్రాంతి పండగ కానుకగా 55 ఇంచీలు ఎల్ఇడి టీవీ ను బహూకరించారు. శుక్రవారం వసంత విహార్ లో గల అనిల్ రే ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులకు సిరమ్మ తన చేతుల మీదుగా బహుమానం అందచేసి, వారి పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకున్నారు. అంతే కాకుండా గతంలో ఫ్రిజ్ ను కానుకగా ఇచ్చారు. అదేవిదంగా వంట మాస్టర్ పిల్లలు ఇద్దరినీ కూడా కార్పోరేట్ స్కూల్ ఐన సన్ స్కూల్ లో చేర్పించి సిరమ్మే వారిని చదివిస్తున్నారు. ఈ సందర్భంగా వంట మాస్టర్ కుటుంబ సభ్యులు సిరమ్మకు తమ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కు వినతి
### - కార్పొరేటర్ మందపాటి సునీత జానకి రామరాజు



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** అనకాపల్లి జోన్ 82వ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ ప్రధాన కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కు వైసిపి కార్పొరేటర్ మందపాటి సునీత జానకి రామరాజు వినతిపత్రం అందించారు. పట్టణంలోని గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సారధ్యంలో జీవీఎంసీ విశాఖ ప్రధాన కమిషనర్ కేతన్ గార్గ్ (ఐఏఎస్) జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్పొరేటర్లు, అధికారులతో జోనల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జోన్ కు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. 82వ డివిజన్ లో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా 82 డివిజన్ పరిధిలో శారదానది సమీపంలో ఉన్న హిందూ స్మశాన వాటికలో విద్యుత్ దహన వాటిక పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, అలాగే పక్కనే ఉన్న క్రైస్తవ స్మశాన వాటికను కూడా అభివృద్ధి చేయాలని కోరారు. శారదానది ఆనుకొని ఉన్న పరశురాంపేటలో ఉన్న శాంతి పార్కు, గాంధీనగరంలో ఉన్న మహాత్మా గాంధీ ఉద్యానవనం, విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఓపెన్ జిమ్ పార్కుల నిర్వహణ లోపం ఏర్పడిందని సరి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని అందించే దిశగా ఈ పార్కులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మలాడ జంక్షన్ నుంచి బైపాస్ కి వెళ్లే మార్గంలో రోడ్డు, డ్రెయిన్ మంజూరు చేయాలన్నారు. అలాగే వార్డులో గతంలో మంజూరైన పలు అభివృద్ధి కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆ వినతి లో కోరారు. వినతి పత్రంలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు ఉన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో 400 దుప్పట్ల పంపిణీ
### - వివేక స్ఫూర్తి ఫౌండేషన్ రోటరీ క్లబ్ సేవాభావం




**హుకుంపేట జనవరి 09 (మనసులో మాట)..** గిరిజన ప్రాంతాల్లో వివేక స్ఫూర్తి ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దుప్పట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజన కుటుంబాలకు 400 దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతగిరి, హుకుంపేట, డుంబ్రిగూడ మండలాల్లోని 17 మారుమూల గిరిజన గ్రామాల్లో ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. కుసుమవలస, కంభవలస, లోచ్చులపుట్టు, కిటింగపుట్టు, ఎగసంతరి, జలగలబంధ, గట్టు, చీకటిపుట్టు, మద్దిపుట్టు, జంగంపుట్టు, దుర్గం, దాలిపుట్టు, కరకవలస, బొడ్డపుట్టు, పట్టం, వెంగడ తదితర గ్రామాల్లో దుప్పట్లు అందజేశారు. వివేక స్ఫూర్తి ఫౌండేషన్ ట్రస్టీ అనిల్ కుమార్ నేతృత్వంలో ఫౌండేషన్ సభ్యులు, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం కార్యదర్శి వంశీ మోహన్‌తో కలిసి కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్యం, పరిశుభ్రత, సుస్థిర జీవన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సేవా కార్యక్రమం గిరిజన ప్రాంత ప్రజల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది

# పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ




**పాయకరావుపేట జనవరి 9 మనసులో మాట..** రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సొంత నిధులతో సైకిళ్ళు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల,జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల,మంగవరం,సత్యవరం, ఎస్.నరసాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు హోంమంత్రి అనిత అందించిన సైకిళ్ళను నాయకులు చేతుల మీదగా అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు,టిడిపి మండల అధ్యక్షుడు చించలపు పద్దు,టిడిపి పట్టణ అధ్యక్షుడు యాళ్ళ వరహాల బాబు, మజ్జూరి నారాయణరావు, పెదిరెడ్డి శ్రీను,జూరెడ్డి ప్రసాద్,మండల తెలుగు యువత అధ్యక్షుడు గొల్లపల్లి నాగు,చింతకాయల రాంబాబు, వేములపూడి అప్పారావు,కట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వెలం కాయలపాలెం చెరువు ఆక్రమణ సర్వేలో అవకతవకలు



**రోలుగుంట మనసులో మాట జనవరి 9..** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం వెలంకాయలపాలెం చెరువు ఆక్రమణలు గ్రామ జీవితాన్ని ముంచుతున్నాయి కొండపాలెం పంచాయతీకి చెందిన వెలంకాయలపాలెం గ్రామంలో 7.87 ఎకరాల చెరువు ఇప్పుడు 4 ఎకరాలకు తగ్గిపోయింది. సర్వే నంబర్ 91 (ఎల్ పి నంబర్ ఏ: 1788)లో ఉన్న ఈ చెరువు ఆక్రమణలతో రైతుల పంటలు, గ్రామ సాంప్రదాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు అన్నీ ప్రమాదంలో పడ్డాయి.రైతుల ఆవేదన: "చెరువు లేకపోతే మా జీవనాధారం పోతుంది"రైతులు బేజవాడ వాసు, శ్రీను, మణికంఠ, ప్రసాద్, సూర్యచంద్ర, సత్తిరాజు, పెంటయ్య, నాగేశ్వరరావు, చిరంజీవి మాటల్లో కొందరు వ్యక్తులు చెరువు గట్టులు వేసి, మట్టి నింపి, దున్ని పంటలు వేసుకున్నారు. "పంట కాలంలో ఈ చెరువు నీరే మా పొలాలకు ఆధారం. వర్షపు నీరు బయటకు వెళ్తోంది. కొద్ది కాలంలో చెరువు పూర్తిగా అదృశ్యమవుతుంది," అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంత్యక్రియల సమయంలో చెరువు ప్రాంతంలో జరిగే సాంప్రదాయ కార్యక్రమాలకు స్థలం దొరకడం, ఉపాధి హామీ పథకం పనులు అడ్డుకోవడం వంటి సమస్యలు తలెత్తాయి. "నీటి దారులు మూసేసి, చెరువు రూపం మారిపోతోంది," అని గ్రామస్థులు వాపోతున్నారు. రీసర్వేఎమ్మార్వో ఫిర్యాదు మేరకు జరిగిన తాజా సర్వేలో సర్వేయర్ మహేష్ తెలిపినట్లు, జగనన్న సర్వే రిపోర్ట్ ప్రకారం రెండింటికి 14 సెట్లు తేడా ఉంది. అయితే గ్రామ ప్రజలు 1985 సర్వే రికార్డులను ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న శాశ్వత భూ హక్కు' పథకం కింద 2020 నుంచి భూ రీసర్వేలు జరుగుతున్నాయి. ఇది బ్రిటిష్ కాలం తర్వాత మొదటి సమగ్ర సర్వే కానీ పాత రికార్డులు, కొత్త సర్వేల మధ్య తేడాలు ఇలాంటి వివాదాలకు కారణమవుతున్నాయి. వెలంకాయలపాలెంలో ఇప్పటికే అధికారులు, నాయకులకు ఫిర్యాదులు చేశారు కానీ పరిష్కారం రాలేదు. ఇలాంటి సమస్యలు పంట సాగు, పర్యావరణాన్ని దెబ్బతీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కేసుల విద్యార్థి యువజన ఉద్యమాల్ని అణచలేరు
### విద్యార్థి యువజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన



**విజయనగరం (మనసులోమాట) జనవరి 9:** విద్యార్థులకు యువజనలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు పైన కేసులు నమోదు చేసి జైలుకు పంపుతూ రౌడీషీట్లు ఓపెన్ చేయడాన్ని ఖండిస్తూ రాష్ట్ర సమితి పిలుపుమేరకు విజయనగరం లో బాలాజీ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ నాగభూషణం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి వాసు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్ వైఎస్ఆర్ విద్యార్థి విభాగం వైయస్సార్ యువజన విభాగం నాయకులు జి. ఈశ్వర్ కౌశిక్ ఎ.అవినాష్,సాయి కుమార్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ప్రజా పరిపాలన నడుస్తుందా లేదంటే నారా లోకేష్ తీసుకున్న రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తుందా అని ప్రశ్నించారు. మీ ఇంట్లో ఉన్నటువంటి ఆస్తులు మేము అడగడం లేదు ఎన్నికలలో మీరు ఇచ్చిన హామీలు అమలు చేయమని అడిగితే విద్యార్థి యువజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసి జైలు కు తరలించి రౌడీ షీట్లు ఓపెన్ చేస్తున్నారు ప్రతిపక్షంలో మీరు ఉన్నప్పుడు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యార్థి యువజన సమస్యలు నేరుగా నా దృష్టికి తీసుకురండి అన్న నారా లోకేష్ నేడు సమస్యలు ఉన్నాయని ప్రశ్నిస్తున్న నాయకుల పైన కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలలో ఇచ్చినటువంటి హామీలు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు విడుదల చేయకుండా ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం పైన కావస్తున్నా నేటికీ ఏ మాత్రం కూడా వాటిని ఆలోచించకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రియంబర్స్మెంట్ విడుదల చేయాలన్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు మాత్రం ఉండవు. మీ క్యాబినెట్లో మీ పార్టీలలో ఉన్నటువంటి నాయకులకు చైర్మన్లు డైరెక్టర్లు పదవులు ఇస్తూ వాళ్లకు నెలనెలా జీతాలు ఇవ్వడానికి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉంటాయని ఎద్దేవా చేసారు. విశాఖపట్నంలో గత రెండు సంవత్సరాల క్రితం పాతగా ఉన్నటువంటి కేసులను తోడి నేడు రౌడీ షీట్లు ఓపెన్ చేయడానికి ఖండించారు. తక్షణమే పెట్టినటువంటి రౌడీషీట్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు,, విద్యార్థి యువజన రంగంలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు గౌరీ శంకర్, రాజేష్, సుమన్, చరణ్, వంశీ, రమణ




## ఎంతో సుందరంగా కనిపిస్తున్న
# రాజేంద్రపాలెం పీహెచ్‌సీ

**కొయ్యూరు జనవరి 9 (మనసులో మాట):** రాజేంద్రపాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సుందరంగా దర్శనమిస్తూ గ్రామస్తుల మన్ననలు పొందుతోంది. ఆసుపత్రి ప్రాంగణాన్ని పూల మొక్కలు, తోటలతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి, పరిశుభ్రతతో పచ్చదనాన్ని పెంచేలా తీర్చిదిద్దారు. ఈ అభివృద్ధి పనులను సీహెచ్ఓ ప్రశాంత్ తన సొంత నిధులతో చేయించడం విశేషం. ప్రజలకు వైద్య సేవలు అందించే కేంద్రం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలన్న ఉద్దేశంతో ఆయన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పీహెచ్‌సీ భవనం ముందు భాగంలో ఏర్పాటు చేసిన పూల తోటలు, ఫెన్సింగ్, చక్కగా నిర్వహిస్తున్న ప్రాంగణం వల్ల రోగులు, సందర్శకులకు మంచి అనుభూతి కలుగుతోంది. ప్రభుత్వ నిధులు లేకుండానే వ్యక్తిగత చొరవతో ఆరోగ్య కేంద్రాన్ని సుందరంగా మార్చిన సీహెచ్ఓ ప్రశాంత్‌ను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు. ఈ విధంగా రాజేంద్రపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి ఇతర ఆరోగ్య కేంద్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## కోట్లాది నిధులతో
# భారీ ఎత్తున అభివృద్ధి పనులు
### 84వ వార్డు డివిజన్ కార్పొరేటర్ చినతల్లి నీలబాబు



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** జీవీఎంసీ అనకాపల్లి జోన్, 84వ డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలు నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని స్థానిక కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాలాపువానిపాలెం, సిరసపల్లి కొత్తూరు, నరసింగరావుపేట, కొప్పాక రఘురాం కాలనీ, లక్ష్మి నారాయణ కాలనీ ప్రాంతాల్లో ఐదు కోట్లు నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చినతల్లి నీలబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చినతల్లి నీలబాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సమావేశంలో జీవీఎంసీ ప్రధాన కమిషనర్ అమిత్ గార్గ్, స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ దృష్టికి డివిజన్ లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వారి దృష్టికి తీసుకువచ్చాను అన్నారు. కొప్పాక నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు కాలువ లేకపోవడంతో మురికి నీరు రోడ్డు మీదకే వస్తుందన్నారు. ఇంకా ఇంకా అనేక అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారని వివరించారు. 84 డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు జీవీఎంసీ ప్రధాన కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్, మేయర్ పీలా శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవిందా సత్యనారాయణ కృషి ఫలితంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆమె తెలిపారు.

# పెద్దపాత్రుని లక్ష్మి మృతి
### - నివాళులర్పించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం, జనవరి 09, (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పినతల్లి పెద్దపాత్రుని లక్ష్మి కన్నుమూశారు. ఆమె మృతి పట్ల స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నర్సీపట్నంలోని ఆమె పార్థివ దేహానికి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో స్పీకర్ స్వయంగా పాల్గొన్నారు. తన పిన్నితో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, ఇతర కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు. ఈ అంతిమ యాత్రలో భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

## ఈదటం గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ



**పాయకరావుపేట జనవరి 9 మనసులో మాట..** మండలంలోని ఈదటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సొంత నిధులతో అందించిన సైకిళ్లను కూటమి పార్టీల నాయకులు పంపిణీ చేశారు. పాఠశాలలో 26 మంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఘనసాల పద్మావతి, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నేమాల సత్యనారాయణ, బూత్ కమిటీ కన్వీనర్ అల్లు తాతబాబు, నేమాల లోవరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ నేమాల సత్యనారాయణ, గ్రామ పెద్దలు కిల్లాడ చిన్నబ్బాయి, నేమాల సత్తిబాబు, పిల్లి దేవుళ్ళు, గంపల రాంబాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## హోంమంత్రి అనిత ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

ఎస్. రాయవరం, జనవరి 9,(మనసులో మాట):పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడిఅనిత అధ్వర్యంలో మహిళలుకు ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 14 వతేదీ ఉదయం 9గంటలకు హోంమంత్రి క్యాంప్ కార్యలయం సారిపల్లిపాలెం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటోలలో విజేతలుకు మొదటి బహుమతిగా 25 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 15 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 10 వేల రూపాయలు అందచేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మహిళలలంతా ఈ సంక్రాంతి సంబరాలు లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు.

## మూలపేట గ్రామంలో ఎల్ఈడి బల్బులు, ఐమాక్స్లైట్లు ఏర్పాటు

### దగ్గరుండి పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బిశెట్టి గంగప్పలనాయుడు



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** మండలంలోని మూల పేట గ్రామంలో మెయిన్ రోడ్డు మొత్తం మరియు ముఖ్యమైన ప్రదేశాల్లో సర్పంచ్ బిసెట్టి గంగ అప్పల నాయుడు మరియు పంచాయతీ పాలకవర్గం సభ్యులు దగ్గరుండి ఎల్ఈడి ఐమాక్స్ లైట్లు వేయించడం జరిగింది. పంచాయతీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఈరోజు వరకు గ్రామం తో పాటు పాక దిబ్బలకుకూడా విద్యుత్తు వెలుగులు కు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య మరియు త్రాగినీటిపై మా పంచాయతీ పాలకవర్గం ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఆడారి సత్యనారాయణ తో పాటు ఎల్లపు నాగేశ్వరరావు బొడ్డేడ ఆదికుమార్ పాల్గొన్నారు.

### హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో ముందస్తు

## సంక్రాంతి సంబరాలు

### కరస్పాండెంట్ ఎస్ గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** స్థానిక వుడ్ పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్లో కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. చిట్టి పొట్టి చిన్నారులు అంతా సంక్రాంతి సమయంలో మాత్రమే కనిపించే హరిదాసు ,గంగిరెద్దు వారు, జానపద వేషదారులు మరియు రైతులు తదితర వేషధారణలతో పాఠశాలకు విచ్చేసి చూపరులను విశేషంగా ఆకర్షించారు. సంక్రాంతి హిందువులకు పెద్ద పండుగ అని సూర్యుడిని, ప్రకృతిని,పంటలను, ఆరాధిస్తూ భోగి మంటలు సంక్రాంతి గొబ్బెమ్మలు, ముగ్గులు, కనుమ పిండి వంటలతో సాగే పండుగ తెలుగు వారికి ముఖ్యమైన పండుగలలో ఒకటని కరస్పాండెంట్ శేశెట్టి గిరీష్ కుమార్ తెలియజేశారు, చిట్టి పొట్టి చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి అమితానందం పొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునీత సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు విశ్రాంత నీటిపారుదల శాఖ ఏఈ మల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికే

# కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

- ఏపీయుఎఫ్ఐడి కార్పొరేషన్ ఛైర్మెన్ పీలా గోవింద సత్యనారాయణ
- అనకాపల్లి పట్టణ టీడీపీ కార్యాలయం లోని గ్రీవెన్స్ సెల్ లో టీడీపీ శ్రేణులు, ప్రజల సమస్యలపై వినతులు స్వీకరణ



**అనకాపల్లి, జనవరి 9 (మనసులో మాట):** అనకాపల్లి పట్టణం గవరపాలెం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి నియోజవర్గం టిడిపి ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ కు పలు సమస్య లుపై టిడిపి శ్రేణులు, ప్రజలు వినతులు అందజేయడం జరిగింది. వెంటనే ఆ సమస్యలు పరిష్కారానికి సంబంధిత ఆదికారుల దృష్టికి ఆయన తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ , టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జుల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ సెల్ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ప్రజలు వివిధ సమస్యలపై వ్రాత పూర్వకంగా అర్జీలు సమర్పించారు. అనకాపల్లి జీవీఎంసీ 83 వ వార్డులో వాటర్ ట్యాంక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అంతేకాకుండా అనకాపల్లి మండలం లోని పలు గ్రామాలలో హై మాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలనీ గ్రామ టీడీపీ నాయకులు కోరగా ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. పాస్ పుస్తకాల కోసం అనకాపల్లి మండలానికి చెందిన రైతులు పిర్యాదు చేయగా వెంటనే తహశీల్దారు తో పాస్ పుస్తకాలు అందజేయలన్నారు. అంతేకాకుండా రేషన్ కార్డులు,ఇండ్ల స్థలాలు, పింఛన్లు,సిసీ రోడ్లు, కాలువల కోసం వినతులు అందజేయాగా మాజీ మంత్రి,శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ , పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, వి. సూర్యప్రభ, టిడిపి నాయకులు పోలవరపు త్రినాధ్, బొద్దపు ప్రసాద్, పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# గజ వాహనంపై ఉపమాక వెంకటేశుడు



**నక్కపల్లి జనవరి 9 మనసులో మాట..** తిరుమల తిరుపతి దేవస్థానం వారి అనుబంధ దేవాలయమైన అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతముపై స్వయం వ్యక్తం గా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస, రాపత్తు అధ్యయన ఉత్సవములు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి మూలవిరాట్కు కొండ దిగువున గల ఆలయంలోనూ ఉపాలయములలోనూ నిత్య పూజాది కైంకర్యములు ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో యధావిధిగా నిర్వహించారు. తరువాత స్వామివారి ఉత్సవ మూర్తులను గజ వాహనంపైన గోదాదేవి అమ్మవారిని పల్లకిలోనూ అధిష్టింప చేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో విశేష ప్రసాద నివేదనలు పూర్తిచేసి ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం తీర్థ గోష్టి భక్తులు అందరికీ ప్రసాద వినియోగము నిర్వహించారు. ర. దీనిలో భాగంగా అధ్యాపక స్వామి తిరువాయ్ మొజి ఇయర్పా నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ సేవాకాలములు పూర్తి చేసిన తర్వాత విశేష ప్రసాద నివేదనలు, తీర్థ గోష్టి భక్తులు అందరికీ ప్రసాదవినియోగము నిర్వహించారు. నక్కపల్లి కి చెందిన శ్రీ వైష్ణవ గోష్టి సభ్యులు నాలాయిర దివ్య ప్రబంధ సేవాకాలములు నిర్వహించారు. స్వామివారి కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ

- ఉద్యమాలతో పాటు సామాజిక సేవల్లో ముందున్న గిరిజన సంఘం



**హుకుంపేట జనవరి 09 (మనసు మట)..** ఆదివాసి గిరిజన సంఘం హుకుంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో బూర్జ పంచాయితీకి చెందిన జుంబుబువలస, మజ్జివలస, దుంబ్రివలస గ్రామాల్లోని 220 గిరిజన కుటుంబాలకు చలి రగ్గులు పంపిణీ చేశారు. ఈ విషయాన్ని మండల కార్యదర్శి టి. కృష్ణరావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ముఖ్య అతిథిగా హాజరై గిరిజన కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసి గిరిజన సంఘం నిరంతరం ఆదివాసుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమే పనిచేస్తోందన్నారు. ఆదివాసుల హక్కులు, చట్టాల అమలుకు నిత్యం పోరాటాలు సాగిస్తూనే, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా సంఘం ముందుంటుందని తెలిపారు. చలికాలంలో గిరిజనులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, కొంతమంది మానవతావాదుల ఆర్థిక సహకారంతో రగ్గులను సేకరించి ఆదివాసులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు టి. కృష్ణారావు, అరకుఅనంతగిరి నాయకులు దశరథ్, సివేరి కొండలరావు, హైడ్రో పోరాట కమిటీ కన్వీనర్ ఎం. సురేష్ కుమార్తో పాటు ఇతర నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉపాధి వేతనాలు తగ్గింపుపై జడ్పిటిసి అసంతృప్తి




**కోటవురట్ల (మనసులో మాట) జనవరి 9:** ఉపాధి పథకం కొత్త చట్టంలో వేతనదారులకు వేతనాల తగ్గించడం సమంజసం కాలేదని కోటవురట్ల జడ్పిటిసి ఉమాదేవి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఉపాధి పథకం ప్రజావేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ. 300 వేతనాన్ని రూ. 240 కు తగ్గించడం వల్ల వేతనదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై అధికారులు వివరణ ఇవ్వాలన్నారు. ఇది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని జిల్లా ఉపాధి హామీ అధికారి శ్రీ లలిత తెలిపారు. పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని అధికారులు చెప్తున్నారని, ఏ ప్రాతిపదికన నిరుద్యోగ భృతి చెల్లిస్తారో తెలపాలన్నారు. 2024-25 సంవత్సరంలో మొత్తం రూ. 19.81 కోట్ల విలువైన పనులకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి గ్రామసభలు ఏర్పాటు చేశారు. అనంతరం నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకులకు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని జిల్లా అంబుడ్స్ పర్సన్ వేణుగోపాల్ అన్నారు. డూమా ఇంచార్జ్ పిడి రవీంద్ర, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఓ నాగరాజు పాల్గొన్నారు.

### టిడిపి విధివిధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న దొడ్డి శ్రీనివాసరావును

# పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- మాజీ ఎంపీ పప్పల చలపతిరావు కు వినతి పత్రం చేస్తున్న టిడిపి శ్రేణులు



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** తెలుగుదేశం పార్టీ ఆశయాలు విధి విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, తెలుగుదేశం పార్టీని భ్రష్టు పెట్టిస్తున్న మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావును పార్టీ నుండి సస్పెండ్ చేసి ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగించాలని శుక్రవారం జరిగిన మునగపాక మండలతెలుగుదేశం పార్టీ సమావేశంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీర్మానించి, ఆ తీర్మానాన్ని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బొండా జగన్నాథం, జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు కు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి తెలుగుదేశం పార్టీని పూర్తిగా గాలికి వదిలేసి తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను జనసేన పార్టీలోకి జాయిన్ చేస్తూ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని, మండలంలో ఏ పదవి లేకుండా అధికార జులుం చేస్తూ తెలుగుదేశం పార్టీ వారు అధికారులకు స్థానిక సంస్థలపై విన్నవిస్తే అవేమీ చేయవద్దని అధికారులపై ఒత్తిడి తెస్తూ తెలుగుదేశం పార్టీని చిన్నాభిన్నం చేస్తున్నారని వివిధ ఆరోపణలు చేస్తూ వినతి పత్రాన్ని సీనియర్ టిడిపి నాయకులకు అందజేశారు. ఈ వినతి పత్రంపై సంతకాలు చేసినవారిలో రాష్ట్ర గవర కార్పోరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర తెలుగు మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి కడియం అనురాధ, మునగపాక మండల టిడిపి అధ్యక్షులు పెంటకోట విజయ్, మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జి విల్లూరి నూకనరసింగరావు, మునగపాక గ్రామ శాఖ అధ్యక్షుడు దాడి శివ, జిల్లా యాదవ సంక్షేమ సంఘం కార్యదర్శి సబ్బి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరద నర్సింగరావు, దొడ్డి రమేష్, సూరిశెట్టి శివాజీ, యువత ప్రెసిడెంట్ మోహన్, మద్దాల కృష్ణ, బొడ్డేడ ప్రసాద్, దొడ్డి సాంబశివరావు, ఎంవిఆర్ నాయుడు, దాడి శ్రీనివాసరావు అన్ని గ్రామాల నుండి కార్యకర్తలు తీర్మాణాన్ని ఆమోదించారు.



## అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నర్సీపట్నం రూరల్, జనవరి 9, ( మనసులో మాట) : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునిగా నియమితులైన బొడ్డు శ్రీనివాస రావుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వగ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజవర్గం సమన్వయకర్త కచ్చాల చినబాబు, పెందుర్తి నియోజకవర్గం సమన్వయకర్త విన్నకోట రాము, పాయకరావుపేట సమన్వయకర్త ఎం ఎన్ చక్రవర్తి, చోడవరం నియోజవర్గం పాత్రు నాయుడు, రాష్ట్ర ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శి కెవి సత్యనారాయణ, గొలుగొండ మండల సీనియర్ అధ్యక్షులు కన్నూరు సత్యనారాయణ, అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపారపు సత్యనారాయణ. నక్కపల్లి మండల ప్రెసిడెంట్ ప్రగడ చక్రరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** అనకాపల్లి మండలంలో పూడికపోయిన పలు చెరువులను స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో భాగంగా బట్లపూడి పంచాయతీలో 300 ఎకరాల భూమికి నీరునందించే కొప్పాక చెరువు, ఎంకమ్మ చెరువులకు నీరునందించే ఎరకన్న దొర చెరువును స్వయంగా పరిశీలించారు. పూడికతో పూడిక, మొక్కలు తో నిండిపోయి కారణంగా నీరు నిలువ ఉండటం లేదు. దీంతో పంట భూములకు సాగునీరు అందక రైతు నష్టపోతున్నారు. గ్రామస్తులు విన్నవించిన ఈ ప్రధాని సమస్యకు త్వరగా త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

### పల్లెపండుగలో భాగంగా

## ఫారం పాండ్స్ పనుల ప్రారంభం

- జీకే మండ పంచాయితీలో ఘనంగా ఓపెనింగ్



**హుకుంపేట జనవరి 09 (మనుసు లో మాట)..** మండలంలోని జీకే మండ పంచాయితీలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఫారం పాండ్స (ఫార్మ్ పాండ్స్) పనుల ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, నీటి సంరక్షణ లక్ష్యంగా చేపట్టిన ఈ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీఓ లింగమూర్తి ఎఫ్ఏఎస్ (ఎఫ్ ఎ సి), గ్రామ సర్పంచ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న శ్రామికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ లింగమూర్తి మాట్లాడుతూ ఫారం పాండ్స్ ద్వారా భూగర్భ జల మట్టం పెరుగుతుందని, వ్యవసాయానికి అవసరమైన నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామంలో సాగునీటి సమస్యకు ఇది శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మమాట్లాడుతూ, పల్లెపండుగలో భాగంగా చేపట్టిన ఈ అభివృద్ధి పనులు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధి హామీ శ్రామికులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సౌకర్యానికి సహకరిస్తున్న ఆసియన్ పెయింట్స్, అంబుజా సిమెంట్ వారికి ధన్యవాదాలు

### పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** మునగపాక మండలంలో ములపేట రెగ్యులేటర్ నుండి మంగళవారిపేట కాలువ మీద ఆసియన్ పెయింట్స్ మరియు అంబుజా సిమెంట్స్ సంయుక్తంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) నిధుల కింద రూ. 19 లక్షలతో 5 ప్రాంతాల్లో గేట్ల ఏర్పాటు చేయడం జరిగింది. 6వ గేట్ను కూడా ఏర్పాటు చేయాల్సిందిగా సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు కోరడం జరిగింది.సర్పంచ్ అభ్యర్థన మేరకు ఆసియన్ పెయింట్స్ మరియు అంబుజా సిమెంట్స్ ప్రతినిధులు దేవేందర్ మరియు అనిల్ సానుకూలంగా స్పందించారు. ఈ గేట్ల ఏర్పాటు చేయడం వలన సుమారు 1000 ఎకరాల భూమికి నీటి పారుదల సౌకర్యం కలగడమే కాకుండా వరద ముప్పు నుంచి కూడా రక్షణ లభిస్తోందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, అనిల్, ఆడారి త్రిమూర్తులు, కాలువ అధ్యక్షులు ఆడారి ముత్యాల నాయుడు, కోయిలాడ త్రిమూర్తులు, కోయిలాడ సత్యనారాయణ, యల్లపు పూర్ణ, ఆడారి రాంబాబు, బొడ్డేడ లక్ష్మణరావు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## ప్రతి నెల రెండోవ శనివారం విశాఖ ఎంవిపి ఎసిఇ లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ

**విశాఖపట్నం, జనవరి 9 (మనసు లో మాట):** విశాఖపట్నం ఎంవిపి కాలనీ సెక్టార్ 10 ఎఎస్ రాజా మహిళా కళాశాల సమీపంలో అడ్వాన్స్ సెంటర్ ఫర్ ఎండోక్రైనాలజీ అండ్ దయాబెటిస్ సెంటర్లో ప్రతీ నెల రెండో శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ సెంటర్ అధినేత డాక్టర్ రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో కొన్ని పరీక్షలను పూర్తి ఉచితం గాను, మరికొన్ని ముఖ్యమైన రక్త, మూత్ర పరీక్షలను నామ మాత్రపు రుసుం లకి చేస్తామని ఆయన తెలిపారు. అత్యాధునిక లివర్ ఫైబ్రో స్కాన్ మెషిన్ తో లివర్ ను అణువణువూ స్కాన్ చేసి శోధిస్తామన్నారు. దీని వల్ల దయాబెటిస్, ఆల్కహాలిక్స్, ఒబేసిటీ, స్మోకర్స్, బ్లడ్ ప్రెజర్, ఫ్యాటీ లివర్, థైరాయిడ్ ప్రాబ్లమ్స్, హెపటైటిస్ బి అండ్ ఎస్ తదితర సమస్యలు ఉన్న రోగులకు రోగ నిర్ధారణ అత్యంత ఖచ్చితత్వం తో జరుగుతుందన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంప్లో మధుమేహ వ్యాధి గ్రస్తులకు వచ్చే ఆరోగ్య సమస్యలను కూలంకుషంగా వివరించడంతో పాటుగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరిస్తామన్నారు. అవసరమైన వారు ఈ మెగా హెల్త్ క్యాంపును వినియోగించు కోవాలన్నారు.

## బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలిగా అనురాధ



**అచ్చుతాపురం జనవరి 9 మనసులో మాట..** భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా నునపర్తి గ్రామ సర్పంచ్ చుక్కా అనురాధ ను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు గురువారం ఉత్తర్వులు అందజేశారు. వైసీపీ నుండి వచ్చిన ఆమె గత కొన్నాళ్లుగా బీజేపీలో చురుగ్గా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న అనురాధని జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా అవకాశం కల్పించారు. అధిష్ఠానం, స్థానిక బీజేపీ నేతలు తనపై పెట్టిన నమ్మకానికి తగినట్టుగా పార్టీకి సేవలందిస్తానని ఈ సందర్భంగా అనురాధ పేర్కొన్నారు.

## 10 కేజీల గంజాయి స్వాధీనం ఒక వ్యక్తి అరెస్టు



**చీడికాడ, జనవరి 9, (మనసులో మాట)..** 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు వివరాల్లోకి వెళ్తే గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఏజెన్సీ వైపు నుండి 12వ మైలు రాయి మీదుగా ఒక వ్యక్తి పల్సర్ బండి మీద 10 కేజీల గంజాయిని పట్టుకుని వస్తూ ఉండగా చీడికాడ పోలిస్ స్టేషన్ ఎస్సై కు వచ్చిన సమాచారం మేరకు కోణం జంక్షన్ వద్ద వెహికల్ చెకింగ్ చేసి సదరు వ్యక్తిని గంజాయి పల్సర్ బండి తో పట్టుకోవడం జరిగింది. సదరు గంజాయిని బండి ని సీజ్ చేసి, సదరు వ్యక్తి పై ఎం డి పి ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ముద్దాయిని రిమాండ్ కి తరలించడం అయ్యింది. ఈ గంజాయిని వేపగుంట కి చెందిన మరొక వ్యక్తికి అమ్ముటకు తీసుకువెళ్తూన్నట్టు తెలియడమైనది. కాబట్టి ఎవరైనా గంజాయిని పండించినా, కలిగియున్నా, రవాణా చేసినా చట్టప్రకారం శిక్షార్హులు అవుతారు, తరచు గంజాయి రవాణా కేసులలో ఇన్వాల్వ్ అయ్యి ఉన్న వారిపై పిట్ ఎన్ డి పి ఎస్ కేసు నమోదు చేసి జైలు కి పంపించడం జరుగుతుందని ఎస్ఐ సతీష్ తెలిపారు

# వివిధ ప్రతిభావంతులకు చేయూత

### లబ్ధిదారులకు ఉపకరణాల పంపిణీ - జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ తిరుమణి శ్రీపూజ




**పాడేరు రూరల్, జనవరి 9(మనసులో మాట):** సమాజంలోని దివ్యాంగులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ అన్నారు. దివ్యాంగులకు చేయూత కార్యక్రమంలో భాగంగా స్థానిక సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు తదితర ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇలాంటి సహాయక పరికరాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10 మందికి వీల్‌చైర్లు, ఇద్దరికి ట్రైసైకిళ్లు (మూడు చక్రాల సైకిళ్లు), ఇద్దరికి హ్యాండ్ ట్రిక్స్ (చేతి స్టిక్స్) పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారుల సమస్యలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పెదబయలు మండలం పెడికిముడుపల్లి గ్రామానికి చెందిన ఒంటరి వికలాంగుడు చంటి తన జీవనాధారం కోసం తలర్సింగి గ్రామంలో అద్దె గృహంలో నివసిస్తూ ఫ్యాన్లు, మిక్సీలు, గ్రైండర్లు, వాటర్ పంపులు, మోటార్లు రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నానని, తనకు ఎటువంటి ఆర్థిక ఆధారం లేదని ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి ఎల్‌డీఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి సమస్యలు ఉన్న దివ్యాంగుల పట్ల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, సహాయాలు అందేలా చూడాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తమకు అవసరమైన ఉపకరణాలు అందుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మేనేజర్ కె. కవిత, కౌన్సిలింగ్ అండ్ మానిటరింగ్ అధికారి కె. అప్పలనాయుడు, ఇతర సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మునగపాక ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం ఇచ్చిన వైసిపి ఎంపీటీసీలు

### - ఎంపీడీవో కు తీర్మాన పత్రం అందజేస్తున్న వైసీపీ ఎంపీటీసీలు



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో మునగపాక మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికలలో ఎక్కువ స్థానాల్లో వైసిపి ఎంపీటీసీలు గెలిచి అందరూ ఏకగ్రీవంగా మునగపాక కు చెందిన జయమ్మను ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పరాజయం కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఎన్నికల్లో, వైసీపీ ఎంపీటీసీలు ఎవరికి చెప్పకుండా జనసేన పార్టీలో ఎంపీపీ తో పాటు జాయిన్ కావడం, మళ్లీ అక్కడ నిరాదరణకు గురైన ఎంపీపీ ఎంపీటీసీలకు చెప్పకుండా మళ్లీ వైసీపీలోకి జాయిన్ అవ్వడం దురదృష్టకరమని, వైయస్సార్సీపి ఎంపీటీసీగా గెలిచిన ఎంపీపీ ఎవరికి సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఎంపీపీ జయము పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ మేరకు మునగపాక ఎంపీడీవోకి అనకాపల్లి ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ సభ్యులు సూరిశెట్టి రాము, మద్దాల వీరు నాయుడు, మొల్లేటి కృష్ణవేణి, శరగడం అప్పలనరస, కాండ్రేగుల లక్ష్మి, బొడ్డేడ హేమ పాల్గొన్నారు.

# అయ్యన్న విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు




**కె.కోటపాడు,జనవరి 9 ( మనసులో మాట):** సంక్రాంతి పండగను పురస్కరించుకొని అయ్యన్న విద్యా సంస్థలలో ఏటాలాగే సంక్రాంతి సంబరాలు ముందస్తుగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంక్రాంతి వేడుకల్లో పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వేసిన రంగురంగుల రంగవల్లులతో కళకళలాడి సంక్రాంతిశోభ సంతరించుకుంది. అచ్చం స్వచ్ఛమైన పల్లెను తలపించేలా సంక్రాంతికి ముస్తాబయిన పూరిల్లు, పాడిపంటలు, పశుపక్షాదుల బొమ్మల సెట్, ఎద్దుల నాటుబండి సంబరాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆకట్టుకున్నాయి. ఆనాటి సంస్కృతి, సాంప్రదాయం, జీవనశైలి ప్రతిబింబిచేలా కట్టెలపొయ్యిమీద మట్టిచట్టిపై అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీంనూర్జహాన్ దంపతులు శుభసూచకంగా పాలను మరిగించి పొంగించారు. విద్యార్థులు సంక్రాంతి సాంప్రదాయం పిండివంటకాలను ప్రదర్శించారు. డాక్టర్ ఖాశీం నూర్జహాన్ దంపతులు రుచిచూసి ప్రశంసించారు. హరిదాసులు, సోదమ్మ వేష ధారణలు ఆకట్టుకున్నాయి. ఈ వేషధారణల చిన్నారులకు బహుమతులు అందచేశారు. సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సాంప్రదాయ వస్త్రధారణల్లో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. భోగి మంటలు వేశారు. మంటలుచుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు చేరి నృత్యం చేస్తూ సందడి చేశారు. హుషారుగా కేరింతలతో హోరెత్తించారు. అయ్యన్న విద్యా సంస్థల క్రీడా మైదానంలో సాంప్రదాయబద్ధమైన బిళ్ళ-కర్ర, ఏడు పెంకులాట, అల్లీ కాయాలాట, తొక్కుడుబిళ్ళ, తాడాట, టగ్ అఫ్ వార్ ఆటలాడారు. గాలి పటాలను ఎగురవేశారు. సంక్రాంతిగేయాలతో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఖాశీం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ సుమతి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.

# జీ.కోడూరులో విద్యుత్ భద్రత, పీఎం సూర్యఘర్ పై అవగాహన



**మాకవరపాలెం జనవరి 9 (మనసులో మాట)..** మాకవరపాలెం మండలం జి.కోడూరులో విద్యుత్ భద్రత, గ్రామంలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యలపై అవగాహనతో పాటు పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల వినియోగంపై విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అక్రమ విద్యుత్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, అలాగే కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం సూర్యఘర్ సోలార్ ప్లాంట్ల ద్వారా లభించే ప్రయోజనాలను గ్రామ ప్రజలకు వివరించారు. సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపన ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.త్రినాథ్ రావు, స్థానిక ఏఈ బాలకృష్ణ, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు జయబాబు, శేషుబాబు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఏపీఎన్జీజీవో అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎన్నికలు

### - నూతన కార్యవర్గం ఎన్నిక పాడేరులో భారీ ర్యాలీ



**పాడేరు రూరల్, జనవరి 09 (మనసులో మాట)..** ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (ఏపీఎన్జీజీవో) అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా నామినేషన్ ప్రక్రియలో ఒక్క సెట్ నామినేషన్లు మాత్రమే దాఖలవ్వడంతో ఎన్నికలు ఏకగ్రీవమని ఎన్నికల అధికారి జి.వి.ఆర్.ఎస్. కిషోర్, సహాయ ఎన్నికల అధికారి కె. రంగాచారి ప్రకటించారు. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఎల్.ఆర్.బి. పాత్రుడు (వ్యవసాయ శాఖ), అసోసియేట్ అధ్యక్షుడిగా గుల్లేలి సింహాద్రి (మెడికల్) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి. మోహనరావు (పాలిటెక్నిక్), పి. కృపారావు (ట్రెజరీ), ఆర్. బాలకృష్ణ (గిరిజన సంక్షేమం), పి. రాంబాబు (పంచాయితీ రాజ్) ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలిగా పి. వెంకట లక్ష్మి (మెడికల్) ఎంపికయ్యారు. కార్యదర్శిగా ఎస్. సంజీవ రాజు (మెడికల్), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్. శ్రీనివాసరావు (కమర్షియల్ ట్యాక్స్) ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా కె. సురేష్ (వెటర్నరీ), జి. చిట్టిబాబు (మెడికల్), ఎల్. సత్యనారాయణ (పంచాయితీ సెక్రటరీ), బింగయ్య (ఖాదీ బోర్డు), బి. సూర్యనారాయణ (జీఎస్‌యూఎస్) ఎన్నికయ్యారు. మహిళా జాయింట్ సెక్రటరీగా అమృత దుర్గా ప్రియదర్శిని (పంచాయితీ సెక్రటరీ), కోశాధికారిగా జి. సుబ్రహ్మణ్యం (ఇరిగేషన్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ కార్యక్రమానికి ముందు సుమారు 400 మంది ఉద్యోగులతో పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎరుపు జెండాలతో పట్టణం అంతా అలంకరించగా, కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మలేరియా అధికారి వరహాలు దొర, అనకాపల్లి జిల్లా ఏపీఎన్జీజీవో అధ్యక్షుడు రవికుమార్, విశాఖపట్నం నాయకులు రవిశంకర్, పార్వతీపురం నాయకులు దుర్గాప్రసాద్, శ్రీధర్, మధుశంకర్ పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కామ్రేడ్ విద్యాసాగర్, కామ్రేడ్ డీవీ రమణ ఆదేశాల మేరకు ప్రతి కార్యాచరణను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.




# శ్రీ గౌతమీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

### - భోగి మంటలు, భోగిపళ్లు పోసిన డీఈవో రామకృష్ణారావు

పాడేరు రూరల్, జనవరి 9(మనసులో మాట):మండలంలోని స్థానిక శ్రీ గౌతమీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ తామర మాణిక్యం, ప్రిన్సిపాల్ వెంకట, శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు అల్లూరి సీతారామ రాజు జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డీఈవో భోగి మంటలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారులకు తన స్వహస్తాలతో భోగిపళ్లు పోసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. చదువుతో పాటు విద్యార్థులకు పండుగల ప్రత్యేకతలు, సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా శ్రీ గౌతమీ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులతో కలిసి పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన పాఠశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొని సంక్రాంతి సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

# రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘ క్యాలెండర్ అవిష్కరణ




అనకాపల్లి, జనవరి 9 (మనసు లో మాట):అనకాపల్లి సిఐటియు కార్యాలయం లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకందారులు సంఘం రాష్ట్ర క్యాలెండర్ ను ప్రముఖ పారిశ్రామిక వేత్త యాదవ సంక్షేమ సంఘం జిల్లా అద్యక్షులు బర్నికాన సాయినాథ్ బాబురావు, ఉమ్మిడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్, వైస్ చైర్మన్ సబ్బి శ్రీనువాసరావు, ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకల పెంపకం దారులు సంఘం జిల్లా అధ్యక్షులు ఉరికిటి శివ సూర్యనారాయణ ఆవిష్కరించారు. ఈసందర్బంగా బాబురావు మాట్లాడుతూ గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలు పై సంఘం సంభ్యులు మరింత బాద్యతాయుగంగా పని చేయాలన్నారు. పశు వైద్యం తోపాటు పెంపకందారులకు ఋణాలు అందించాలని ప్రభుత్వంను వారు కోరారు. ఈ కార్యక్రమం లో గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్.రాయవరం లో 10 విద్యార్ధులుకు సైకిళ్ళ పంపిణీ



**ఎస్. రాయవరం, జనవరి 9,(మనసులో మాట):** మండల కేంద్రమైన ఎస్.రాయవరం లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లోని 10 వ తరగతి విద్యార్థులు కు శుక్రవారం సైకిళ్ల పంపిణీ చేసారు. వైస్ ఎం.పి.పి బొలిశెట్టి గోవిందరావు చేతులు మీదుగా విద్యార్థులుకు సైకిళ్లు ను ఉచితంగా అందచెసారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కృషితో సి.ఎస్.ఆర్ నిధులతో పాయకరావుపేట నియోజకవర్గం లోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్ లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ కి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక హైస్కూల్ లో 30 మశీది విద్యార్థులుకు పంపిణీ చేశారు. . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతి అప్పారావు, ఎం.పి.టి.సి బైపా శ్రీనివాసరావు, హైస్కూల్ కమిటీ చైర్మన్ వాసం ప్రసాద్, సోమిరెడ్డి రాజు, స్థానిక కూటమినేతలు,హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు షేక్ రమణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### చీమలాపల్లి క్రికెట్ పోరులో

# ఎర్రవరం ఘన విజయం



**అచ్యుతాపురం మనసులో మాట :** మండలం లో చీమలాపల్లి గ్రామంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఎర్రవరం ఉమ్మలాడ జట్ల మధ్య హోరాహోరీ పోటీ జరిగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఉమ్మలాడ జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 76 పరుగులు చేసింది. ఎర్రవరం జట్టు కేవలం 5 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి సులభంగా విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో గంగిరెడ్డి మోహన్ అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 13 బంతుల్లో 38 పరుగులు చేసి వరుసగా మూడు సిక్సర్లు బాది మైదానాన్ని హోరెత్తించారు. ఈ అద్భుత ఆటకు గాను ఆయనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు, ఈ పోటీల్లో గ్రామ నాయకులు క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.



## విశాఖ ఉక్కు కు ఐరన్ ఓర్ గనులు కేటాయించాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షకార్యదర్శులు వి.వి శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు**

**అనకాపల్లి, జనవరి 9 (మనసు లో మాట):** విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఐరన్ ఓర్ గనులు కేటాయించలేని ప్రభుత్వం, మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కాకుండానే కెప్టివ్ పోర్ట్ నిర్మాణం కి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.వి శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడారు ప్రైవేటు స్టీల్ ప్లాంట్ కు గనులు కోసం కూడా కేంద్రం చుట్టూ కూటమి ప్రభుత్వం తిరుగుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ వాటా గా ఉన్న గంగవరం పోర్టును ప్రైవేటు పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలనడం చూస్తే కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తల పక్షాన ఉందని తేటతెల్లం అవుతుందని ఎద్దేవా చేశారు. అంతేగాకుండా అనకాపల్లి జిల్లా లో ప్రైవేట్ కంపెనీలకు వందల ఎకరాల భూములు కేటాయిస్తున్నారని వారన్నారు. ఒకవైపు రైతులు, నిర్వాసితులు సమస్యలు పరిష్కరించడం లేదని పరిశ్రమల పై ఉన్న శ్రద్ధ భూములు ఇస్తున్న నిర్వాసితులపై లేదని. నిర్వాసితుల సమస్యలపై పోరాటాలు చేస్తుంటే నిర్బంధాలు చేస్తున్నారని వారు దుయ్యబట్టారు. ఏదేమైనా విశాఖ స్టీల్ ప్లాంట్ కి సొంత ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని వారన్నారు. కాగా రైతులు, నిర్వాసితుల కోసం పోరాడుతున్న అప్పలరాజు పై పెట్టిన పీడీ యాక్ట్ ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు.

## ఎర్రవరపు బాలచంద్రుడు మరణం టిడిపికి తీరని లోటు

**జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్లవరహా నరసింహారావు**



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** మండలంలోని వాడ్రాపల్లి గ్రామానికి చెందిన ఎర్రవరపు బాలచంద్రుడు మరణం టిడిపి పార్టీకి తీరనిలోటని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మల్ల వరహా నర్సింగ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. చాలాకాలంగా తెలుగుదేశం సానుభూతిపరుడుగా తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో పనిచేసిన వ్యక్తి బాలచంద్రుడు అని ఆయన జీవితం అంతా తెలుగుదేశం పార్టీకే అంకితం చేశారని ఆయన దినకర్మ సందర్భంగా నివాళులర్పించారు.

### కష్టపడి చదవడమే కాదు..

## ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతాం

**నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు**



**నర్సీపట్నం, జనవరి 9, ( మనసులో మాట) :** కష్టపడి చదవడమే కాదు, ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మంచి అవకాశాలు ఉంటాయని నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో ఫేర్ వెల్ డే సెలబ్రేషన్స్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడి, ఇష్టపడి చదివి, మంచి ప్రవర్తనతో నేడు డిఎస్పి స్థాయికి ఎదిగానన్నారు. అలాగే విద్యార్థులు కూడా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని, వృద్ధాప్యంలో వారిని బాగా చూసుకోవాలని హితవు పలికారు. పట్టణ సీఐ షేక్ గఫూర్ మాట్లాడుతూ, ఉన్నత విలువలతో చదువుకొని మంచి ఉద్యోగాన్ని సాధిస్తే జీవితం సంతోషమయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గాడి సత్యవతి, డైరెక్టర్ దొరబాబు, ప్రిన్సిపాల్ నానాజీ, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిత్యం ప్రజల్లో మమేకమైన వాడే నిజమైన లీడర్

**- మాజీ ఎంపీ పప్పల చలపతిరావు**



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల కోసం పనిచేసే వాడే నిజమైన లీడర్ అని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. మునగపాక మండల తెలుగుదేశం పార్టీ సమావేశం పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చలపతిరావు మాట్లాడుతూ పార్టీలో గొడవలు పెట్టేవాడు, గొడవలు సృష్టించేవాడు ఎప్పుడూ లీడర్ కాలేడని ప్రజలతో ఎప్పుడు మమేకమవుతూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఉన్న నాయకుడే ఎప్పటికీ ప్రజల మనసుల్లో ఉంటాడని, కార్యకర్త పిలిచిన ఫంక్షన్కు నేను ఓపిగ్గా వెళ్లడం వల్లే ఇప్పటికీ లీడర్ గా కొనసాగుతున్నానని చలపతిరావు గుర్తు చేశారు. రేపు రాబోవు స్థానిక సంస్థలు ఎన్నికల్లో కార్యకర్తలంతా ఐక్యబలంతో ముందుకు సాగాలని, పార్టీలోని చిన్నచిన్న సమస్యలను పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, పార్టీ విధి విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తి ఎన్నో రోజులు పార్టీలో మనుగడా సాగించలేరని, అవి పక్కన పెట్టి మన పని మనం చేసుకుంటూ పోవాలని ఆయన సూచించారు. ఈ సమాజంలో టిడిపి కార్యకర్తలు తనకు జరుగుతున్న అన్యాయాలపై చలపతిరావు దృష్టికి తీసుకువచ్చారు. అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తొందర పడొద్దు అని ఆయన హితవ్ పలికారు. ఈ సమావేశంలో ఎలమంచిలి నియోజకవర్గం పార్టీ పరిశీలకులు బోండా జగన్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లాలం గంగాభవాని భాస్కరరావు, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, ఎలమంచిలి టిడిపి అధ్యక్షుడు పి తులసిరాం, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు డైరెక్టర్ బిలా స్రవంతి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, రాష్ట్ర తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శి కడియం అనురాధ, బొడ్డేడ ప్రసాద్, ఎం వి ఆర్ నాయుడు, కాండ్రేగుల శంకర్, సూరిశెట్టి రాము, పెంటకోట శ్రీరామ్ మూర్తి, సబ్బి శ్రీనివాసరావు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**- కరస్పాండెంట్ వేగి వీరుడు నాయుడు ఆధ్వర్యంలో**



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** స్థానిక ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ వేగి వీరి నాయుడుఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. చిన్నారులు అంతా సంక్రాంతి సమయంలో మాత్రమే కనిపించే హరిదాసు ,గంగిరెద్దు వారు, జానపద వేషదారులు భోగి మంటలు,మరియు రైతులు తదితర వేషధారణలతో పాఠశాలకు విచ్చేసి చూపరులను విశేషంగా ఆకర్షించారు. సంక్రాంతి హిందువులకు పెద్ద పండుగ అని సూర్యుడిని, ప్రకృతిని,పంటలను, ఆరాధిస్తూ భోగి మంటలు సంక్రాంతి గొబ్బెమ్మలు, ముగ్గులు, కనుమ పిండి వంటలతో సాగే పండుగ తెలుగు వారికి ముఖ్యమైన పండుగలలో ఒకటని వీరు నాయుడు తెలియజేశారు, స్కూలు విద్యార్థులు చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి అమితానందం పొందారు. స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగిమంట వేసి చుట్టూ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు.

## మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు పండగ పూట పస్తులేనా - సిఐటియు



**అచ్చుతాపురం జనవరి 9 మనసులో మాట:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కమ్మనైన వంటలు వండి వడ్డిస్తున్న వంటలమ్మలకు గత నాలుగు నెలలుగా బిల్లులు, జీతాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు వీరికి వెంటనే బిల్లులు, జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వండి వడ్డిస్తున్న మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు బిల్లులు, జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వలన వంటలు వండడం భారంగా మారింది వెంటనే బిల్లులు ,జీతాలు చెల్లించి పండక్కి ఇబ్బందులు లేకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది వీటితోపాటు ప్రభుత్వం వంట గ్యాస్ పాత్రలు సరఫరా చేయాలని కార్మికులుగా గుర్తించి వేతనాలు పెంచాలని ప్రతినెల బిల్లులు, జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరుగుల గున్న, ఆర్. సత్యవతి ,,అందే రాము, లాలం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# సిమెంటు రహదారి నిర్మాణాన్ని సద్వినియోగం చేసుకోండి

**- పిఎసిఎస్ డైరెక్టర్ భీమన్న**



**చింతపల్లి, జనవరి (మనసులో మాట)** సిమెంట్ రహదారి నిర్మాణాన్ని. గ్రామస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ పరపతి సంఘం సహకార బ్యాంక్ (పి ఏ సి ఎస్) డైరెక్టర్ వంతల భీమన్న అన్నారు. మండలంలోని తమ్మంగుల పంచాయతీ పరిధిలోని కొండపల్లి గున్నలు గ్రామంలో మూడు లక్షల రూపాయల ఎంపీపీ, ఎంపీటీసీ నిధులతో మంజూరైన సిమెంటు రహదారి నిర్మాణ పనులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు అప్పారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ సిమెంటు రహదారుల నిర్మాణానికి లక్షలాది రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలోని కొండపల్లి గున్నలు గ్రామంలో 62 మీటర్ల సిమెంటు రహదారి నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం జరిగిందని, ఈ నిర్మాణ పనులకు గ్రామస్తులు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కురిశాల కన్నబాబు ని కలసిన మాజీ శాసనసభ్యులు అదీప్ రాజ్ పైల శ్రీనివాసరావు



**పరవాడ జనవరి 9 (మనసులో మాట)** కాకినాడ జిల్లా, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి వర్యులు కురసాల కన్నబాబు ని వారి స్వగృహం నందు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ , పెందుర్తి ముఖ్య వైసీపీ నాయకులు , వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి , మాడుగుల మరియు పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు దుశ్శాలువ తో సత్కరించి మర్యాదపూర్వకంగా కలసి ఈ సందర్భంగా కన్నబాబుకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. పెందుర్తి నియోజకవర్గంలో పలు విభాగాలలో కొత్తగా నియమించిన నాయకులను, కార్యకర్తలు ను ఆయనకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మాడుగుల మరియు పాయకరావుపేట నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, నియామక కమిటీ లు గురించి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో పరవాడ జడ్పిటిసి పైల సన్యాసిరాజు, రాష్ట్ర కార్యదర్శి గండి రవి, మరియు వై.సి.పి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ పై అవగాహన తప్పనిసరి



**గాజువాక (మనసులో మాట)జనవరి 9..** సౌర పలకల ద్వారా సొంతంగా విద్యుత్తును తయారు చేసుకోవడం వల్ల నెలవారీ కరెంటు బిల్లులు గణనీయంగా తగ్గుతాయని ఏపీఈపిడీసీఎల్ ఈఈ బికే నాయుడు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 65 వ వార్డు,వికాస్ నగర్ ఇండోర్ స్టేడియం ఆవరణలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అధ్యక్షతన ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ సౌర విద్యుత్ అన్నది కాలుష్య రహిత శక్తి వనరు అని పేర్కొన్నారు. దీనివల్ల గ్రీన్ హౌస్ వాయువుల విడుదల ఉండదని,తద్వారా గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చు అని చెప్పారు. తక్కువ నిర్వహణ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం ఉంటుంది అని తెలిపారు. ప్రభుత్వం కల్పించే రాయితీని పొందుతూనే ఇంటికి కావాల్సిన విద్యుత్ ను ఉపయోగించుకోవచ్చని, కరెంటు బిల్లుల భారం తగ్గుతుంది అన్నారు. ప్రతి ఇంటిపై సోలార్ పలకలు అమర్చుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించినట్లు అవుతుంది అన్నారు. దీనిపై పూర్తి వివరాల కోసం వెబ్ సైట్ లో గాని దగ్గర్లోని విద్యుత్ శాఖ కార్యాలయాలను గాని సంప్రదిశీచవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ మాధవి,గాజువాక,పెదగంట్యాడ ఏఈ లు ఆర్ వి రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, వార్డు తెదేపా అధ్యక్షుడు రట్టి వాసు,ఇంచార్జి బైపిల్లి గాంధీ, సీఓ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు



### వివేకానంద జయంతి సందర్బంగా

## రేవుపోలవరం లో ర్యాలీ

**ఎస్ రాయవరం, జనవరి 09, (మనసులో మాట):** స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం గ్రామంలో స్థానిక వివేకనంద విగ్రహ వ్యవస్థాపకుడు బంగారు చిట్టి అధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో విద్యార్థులు, యువకులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. రేవుపోలవరం పాఠశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ అమ్మవారి శతకం పట్టు మీదుగా మాధవా స్వామి ఆలయం సమీపంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్దకు చేరుకుంది. సముద్రతీరంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాలనీ మీదుగా సాగిన ర్యాలీ తిరిగి రేవుపోలవరం పాఠశాల వద్ద ముగిసింది. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు స్వామి వివేకానంద సూక్తులును నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్. రాయవరం మండలం తెలుగు యువత అధ్యక్షులు కోడలావరాజు, జనసేన నాయకులు సంజీవరావు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కొవిరి బంగారి, టీడీపీ నాయకులు రమణబాబు,ఆర్ఎస్ఎస్ కార్యకర్త నూకరాజు, జనసేన నాయకులు కారే సూరిబాబు, బొంది బన్ని, యువకులు గనగళ్ళ మధు, శ్రీను, దూడ నూకరాజు, కొమర తాతాజీ, ఎరిపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

## తూటిపాల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**మాకవరపాలెం జనవరి 9 (మనసులో మాట)..** మాకవరపాలెం మండలం తూటిపాల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మన తెలుగు పండుగల విశిష్టతను, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలను ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. సందర్భంగా భోగి సంక్రాంతి కనుమ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. శాస్త్రసాంకేతికత పెరుగుతున్న కొద్దీ విద్యార్థులు మన తెలుగు పండుగలు, సాంప్రదాయాలను కొంత మేర మరిచిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి జీవితంలో పాఠశాలలు ఇలాంటి పండుగల ద్వారా మన సంస్కృతి, ఆచార వ్యవహారాలను తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, ఆ దిశగా సంక్రాంతి సంబరాలను పాఠశాలలో నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవు

**- మునగపాక ఏఎస్ఐ నాగేశ్వరరావు, దొర**



**మునగపాక, జనవరి 9, మనసులో మాట..** ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి ప్రయాణం సాగించే వాహనదారులపై చర్యలు తప్పవని మునగపాక ఏఎస్ఐ నాగేశ్వరరావు, దొర హెచ్చరించారు. శుక్రవారం అనకాపల్లి పూడిమడక మెయిన్ రోడ్ లో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సక్రమమైన రికార్డు లేకుండా, హెల్మెట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ ఇతర పత్రాలు లేకుండా ప్రయాణించే వారిపై అపరాధ రుసుం విధించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేని ముగ్గురు మైనర్ బాలురను ఆపి స్థానిక పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. బండి స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్ తరలించారు.

## ఎర్రవరంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ



**అచ్యుతాపురం । జనవరి 9 । మనసులో మాట..** అచ్యుతాపురం మండలం ఎర్రవరం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ శ్యామ్ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జగన్, గ్రామ కూటమి నాయకులు జి. కనకారావు, అగ్గాల భాస్కర్ రావు, అగ్గాల హనుమంతరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి

**- సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ చూపించండి**
**- పిజిఆర్ఎస్ కు 81అర్జీలు - రెవెన్యూ క్లినిక్ కు 19 అర్జీలు**
**- జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ**



**పాడేరు, జనవరి 09 (మనసులో మాట):** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 81, రెవెన్యూ క్లినిక్ కు 19 వినతులు వచ్చాయి. జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీ పూజ, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్,పాడేరు ఇంచార్జ్ ఆర్ డివో ఎమ్ వివిఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు,విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.



## సంక్రాంతి పండుగ సీజన్‌లో దొంగతనాల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలి

**- సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు**

**పరవాడ జనవరి 9, (మనసులో మాట)..** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాలకు సీఎం మల్లికార్జునరావు విజ్ఞప్తిసంక్రాంతి పండుగ సీజన్ సందర్భంగా చాలా మంది తమ స్వగ్రామాలకు లేదా బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు ఇళ్లకు తాళాలు వేసి వెళ్తుంటారు. ముఖ్యంగా ఫార్మా కంపెనీలలో పని చేసే ఉద్యోగులు మరియు గ్రామస్తులు పండుగల సమయంలో ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్ల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు మరియు ఇతర విలువైన వస్తువులు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో ఉంచడం లేదా నమ్మకమైన బంధువుల ఇళ్లలో భద్రంగా ఉంచుకోవాలి. తాళాలు వేసి ఊరికి వెళ్లే సమయంలో ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు ఉంచకుండా చూసుకోవాలి. ఇళ్లకు బలమైన, నాణ్యమైన తాళాలు వేసుకోవాలి. అలాగే ఇంటి తాళం చెవులు బయట అందరికీ కనిపించేలా లేదా సులభంగా దొరికే ప్రదేశాల్లో ఉంచకుండా జాగ్రత్త వహించాలి.పండుగల సమయంలో కొందరు దొంగలు ఇళ్లన్నీ లాక్ చేసి ఉన్నాయని భావించి గ్రామాలు మరియు కాలనీలను టార్గెట్ చేసే అవకాశం ఉంటుంది.

## ప్రపంచ ఛాంపియన్ లవ్లీనాతో తలపడ్డ



నర్సీపట్నం బాక్సర్ మౌనికసర్సీపట్నం, జనవరి 9 (మనసులో మాట)ఈ నెల 8న విశ్వవిజేత ప్రపంచ ఛాంపియన్ లవ్లీనాతో తలపడ్డ నర్సీపట్నం బాక్సర్ మౌనిక చాలా కష్టపడి చివరి వరకు ఆడి ఓటమి పాలైంది. 15 సంవత్సరాలకు పైగా బాక్సింగ్లో అనుభవం కలిగిన లవ్లీనా, ఆసియన్ గేమ్స్, వరల్డ్ ఛాంపియన్షిప్, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గని అనేక పతకాలు గెలుచుకుంది. ప్రస్తుతం ఆమె డీఎస్పీగా పోలీస్ ఉద్యోగం చేస్తూ, ఢిల్లీ నోయిడాలో బాక్సింగ్ శిక్షణతో పాటు స్పారింగ్ ఫైట్స్ లో పాల్గొంటున్నారు. లవ్లీనాతో స్పారింగ్ ఫైట్ చేయడం ఎంతో గొప్ప అనుభూతి అని కోచ్లు పేర్కొన్నారు. నర్సీపట్నంలో సరైన మౌలిక వసతులు, ముఖ్యంగా బాక్సింగ్ రింగ్ లేకపోయినా, సీనియర్ నేషనల్స్ కు ఎంపికై ఢిల్లీలో దేశంలోని అగ్రశ్రేణి బాక్సర్లతో తలపడటం నర్సీపట్నానికి గర్వకారణమని సీనియర్ బాక్సర్లు అన్నారు. నర్సీపట్నం నుంచి ఎంతో మంది బాక్సర్లు నేషనల్ స్థాయికి వెళ్తున్నప్పటికీ, సరైన బాక్సింగ్ రింగ్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నేలపై, గచ్చు మీద, రాళ్లతో కూడిన గుంటలు పడ్డ పట్టి నేలపై సాధన చేయడం వల్ల, బాక్సింగ్ రింగ్పై పోరాడే సమయంలో కాళ్లు జారిపోవడం, ఫుట్వర్క్ సరిగా లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని నేషనల్సకు వెళ్లి వచ్చిన బాక్సర్లు, సీనియర్ కోచ్లు తెలిపారు.

## బొజ్జన్న కొండ తీర్థ ఏర్పాట్లపై సమీక్షించిన కొణతాల



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** శతాబ్దాల చరిత్ర కలిగిన బొజ్జన్న కొండ కనుమ పండుగ రోజు నిర్వహించే తీర్థానికి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ బౌద్ధ క్షేత్ర ప్రదేశాన్ని సందర్శించి,మాట్లాడుతూ ఆర్కియాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిచే గుర్తింపబడిన ఆంధ్రప్రదేశ్‌లోని 4 నుండి 9వ శతాబ్దాల మధ్యనాటి వారసత్వ సంపదలో ఒకటి అన్నారు. బౌద్ధమత వైభవాన్ని, శిల్పకళను ప్రదర్శిస్తున్న బొజ్జన్నకొండ అనకాపల్లికి, శంకరం గ్రామంలో ఉన్న బౌద్ధ సంస్కృతి మరియు కళలను తెలిపే ఒక అద్భుతమైన ప్రదేశం అన్నారు. పురాతన బౌద్ధ క్షేత్రం, చారిత్రికంగా ముఖ్యమైన రాతితో చెక్కబడిన గుహలు, స్థూపాలకు ప్రసిద్ధి గాంచిన క్షేత్రానికి ప్రతి ఏటా విదేశీ సందర్శకులు సైతం వస్తుంటారన్నారు. ఈ సమీక్షలో కట్టదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, విద్యుదీకరణ, మంచినీరు, ఆరోగ్యం, రక్షణ, ట్రాఫిక్ విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని, చుట్టుపక్క గ్రామాలు, పట్టణాల నుంచి వేల సంఖ్యలో భారీ ఎత్తున భక్తులు తీర్థానికి వస్తారన్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ, మెడికల్ అండ్ హెల్త్, ఆర్కియాలజీ, అగ్నిమాపక కేంద్ర అధికారులు, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డైట్ లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు



**అనకాపల్లి, జనవరి 9 (మనసు లో మాట):** తెలుగు వారి ప్రధాన పండగైన సంక్రాంతి ని పురష్కరించుకొని అనకాపల్లి లో శుక్రవారం దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, అటానమస్ (డైట్) లో అత్యంత ఉత్సాహభరితంగా, సంప్రాదాయబద్ధంగా సంబరాలు జరిపారు. ఈ సందర్బంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, హరిదాసు గానం, గంగిరెద్దుల ప్రదర్శన, భోగి మంటలు, సాంప్రదాయ నృత్యాలు, ఆట పాటల కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తయారుచేసిన సంక్రాంతి ప్రత్యేక వంటకాలు అందర్ని మెప్పించాయి. సంక్రాంతి వేడుకలు సందర్బంగా డైట్ సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది కి రైస్ బస్తాలు ,పంచదార పాకెట్స్ అందజేసి, భోగిమంటలు వెలిగించిన దాడి విద్యా సంస్థ ల ఛైర్మెన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రైతుల కష్టానికి గౌరవం తెలిపే పండుగ అని, మన సంప్రదాయాలు, సంస్కృతి తరతరాలకు అందాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ కళలను, తెలుగు సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతుల తోపాటు పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 50 గృహనమూనాలు తయారు చేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు గా 55 వేలు నగదు అందజేశారు. విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని పండగ వాతావరణం మరింత రమణీయంగా మార్చారు.అలాగే విద్యార్థులు కోలాటం ఆడి అందరినీ అలరించి, భోగి మంటలు వెలిగించి, గాలి పటాలు ఎగరవేశారు. ఈ పండగ వాతావరణం లో హరిదాసు, గంగిరెద్దుల ఆటపాటలు ఆకర్షణీయంగా నిలిచాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు భారతీయ సాంప్రదాయాలు, సంస్కృతిని విద్యార్థులు పరిరక్షించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పండుగలు సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బంది, అడ్మిన్ సిబ్బంది, అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## బౌద్ధ మేళా గోడ పత్రికను ఆవిష్కరించిన మాజీ ఎంపీడాక్టర్ సత్యవతి



**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** ప్రముఖ బౌద్ధ పర్యటక క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద నిర్వహించు బౌద్ధ మేళ (సంక్రాంతి సంబరాలు) గోడ పత్రికను మాజీ ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 16 కనుమ పండుగ సందర్భంగా ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భముగా డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ అనకాపల్లి మణిహారంగా ప్రపంచ ప్రశిద్ది గాంచిన, అతి ప్రాచీన బౌద్ధ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద జరుగు మేళ విజయవంతం అందరూ కృషి చేయాలని కోరారు. బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు, బుద్దిస్ట్ సొసైటీ ప్రతినిధుల ఆధ్వర్యములో అత్యంత ఘనముగా దేశ, విదేశీ బౌద్ధ బిక్షువులు హాజరు కావడం గొప్ప విషయం. బౌద్ధ బిక్షువులతో పాటు రాష్ట్రంలో గల అనేక బౌద్ధ సంఘాల ప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అభిమానులు పాల్గొంటారు. సిద్దార్ధ సోషల్ సర్వీస్& కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లానాగభూషణము మాట్లాడుతూ బౌద్ధ మేళా ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని, బౌద్ధ మేళా కార్యక్రమములో దేశ విదేశీ పూజ్య బౌద్ధ బిక్షువులు వెనరబుల్ జ్ఞానదీప్ మహా థేరో ( నాగపూర్ ), వెనరబుల్ రజ ధమ్మాజీ ( మయన్మార్ ),వెనరబుల్ కంటి బార మోజే ( కంబోడియా ), వెనరబుల్ వన్నెథ్ చట్ జీ ( కంబోడియా )ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే స్థానిక ఎంపీ సి.ఎమ్.రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అతిధులు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు, ఇతర బౌద్ధ ప్రముఖులు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ గారు, బొడ్డు కళ్యాణరావు, తదితర ప్రముఖులు పాల్గొంటారన్నారు.

# నర్సీపట్నంలో ఘనంగా ప్రారంభమైన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

**- జనసేన పార్టీ అప్పన దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహణ**
**- నర్సీపట్నంలో మొట్టమొదటిసారిగా గేమ్ మ్యాట్ లపై పోటీలు పోటీలను ప్రారంభించిన కూటమి నాయకులు**






నర్సీపట్నం రూరల్, జనవరి 9, ( మనసులో మాట) : నర్సీపట్నం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలలో భాగంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం కూటమి నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ప్రారంభ మ్యాచ్ గాజువాకకు చెందిన ఏజా వారియర్స్ టీం, నర్సీపట్నం టీం ల మధ్య సాగింది. ఒకరికొకరు తీసుపోని విధంగా పోటీ ఉత్కంఠగా సాగింది. ప్రాంగణమంతా వీక్షకులతో నిండిపోయింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, సంక్రాంతి సంబరాలలో భాగంగా జనసేన పార్టీ నాయకుడు అప్పన దొరబాబు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నర్సీపట్నంలో నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు ఆటలో గాయాలు తగలకుండా నర్సీపట్నంలో మొట్టమొదటిసారిగా రాష్ట్రస్థాయి పోటీలలో ఉపయోగించే గేమ్ మ్యాట్లను ఈ పోటీలలో ఉపయోగించడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అప్పన ఎన్ ఎస్ జి దొరబాబు మాట్లాడుతూ, ఈ పోటీలలో జిల్లాలోని 24 జట్లు తలపడనున్నాయన్నారు. మూడు రోజుల పాటు సాగే ఈ పోటీలలో విజేతలకు రూ. లక్ష అందిస్తున్నామన్నారు. జిల్లాలోని కబడ్డీ క్రీడాకారుల ప్రతిభా పాటవాలను వెలికి తీయడమే తమ లక్ష్యం అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో జనసేన పార్టీ తరఫున తాము ఎప్పుడూ ముందుంటామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అప్పన సురేష్ బాబు, డాక్టర్ కిల్లాడ సత్యనారాయణ, సుతాపల్లి శ్రావణ్, మీసాల సత్యనారాయణ, దుంపలపాటి సహదేవుడు, కొప్పాక కళ్యాణ్, అద్దేపల్లి గణేష్, మారిశెట్టి రాజా పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

**అనకాపల్లి రూరల్, జనవరి 9 (మనసులో మాట):** స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక, వివిధ వేషధారణలు, నృత్యాలు, రంగవల్లికలు విశేషంగా ఆకర్షించాయి. ప్రిన్సిపల్ కమల కుమారి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ శతాబ్దాలుగా భారతీయ సంస్కృతి సంప్రదాయంలో భాగంగా సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దేశ ఘన చరిత్రకు అద్దం పట్టే సంక్రాంతి పండుగను మహా ఉత్సవంలా ప్రతి ఇంటిలోనూ జరుపుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కోరాడ రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## మత్తు పదార్థాలు కు వ్యతిరేకం గా 26న 2కే రన్

**గాజువాక (మనసులోమాట) జనవరి 10..** జనవరి 26వ తేదీన యువత మత్తు పదార్థాల వినియోగంకి వ్యతిరేకంగా గాజువాక కూడలి నుండి జింక్ గేట్ వరుకు 2కే రన్ పోస్టర్ ను ఆవిష్కరణ చేసిన గౌరవ శ్రీ విశాఖ పోలీస్ కమీషనర్ శంఖ బాత్ భాగ్చీ అనంతరం మాట్లాడారు.నేటితరం యువత మత్తుకి బానిస కాకుండా అవగాహన ర్యాలీకి జాగరపు శ్రీను పిలుపినిచ్చారు.గణతంత్ర దినోత్సవం రోజున మహాత్మ మదర్ థెరీసా టస్ట్ అధ్యక్షుడు జాగరపు శ్రీను ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిభిరంతో పాటు, పేదలకి ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.పేద ప్రజలకి ఉచిత కంటి, దంత, చెవి, ఉచిత క్యాన్సర్ పరీక్షలు, గుండెకి సంబందించిన ఇ సి జి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు జాగరపు శ్రీను తెలిపారు.

## చుక్కపల్లి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు



**చీడికాడ, జనవరి 9, (మనసులో మాట)** మండలంలో చుక్కపల్లి హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంక్రాంతి సంబరాలు ఉపాధ్యాయులు నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల ముగ్గులు చేశారు విద్యార్థులు బుడబుడకలు రైతు కొమ్మ నాడు వేషాలు వేశారు అలాగే కోడి గొర్రెలు ప్రదర్శన చేశారు ఈ సందర్భంగా భోగి మంటలు వేశారు విద్యార్థులు సంక్రాంతి నృత్యాలను ప్రదర్శించారు ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను ఉపాధ్యాయులు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బివి రమణ ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

## గంజాయి బారిన పడవద్దు




నర్సీపట్నం ,జనవరి 9 (మనసులో మాట)గంజాయి బారిన పడి ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దని నర్సీపట్నం డీఎస్పీ పీ.శ్రీనివాసరావు, నర్సీపట్నం శ్రీవిద్య జూనియర్, డిగ్రీ కళాశాలలో జరిగిన ఫెర్వేల్ డే కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మీకు ఏ రంగంలో ఆసక్తి ఉందో ఆ రంగంలో చేరాలని, దీనిపై తమ తల్లిదండ్రులను ఒప్పించి ఆ రంగంలోకి వెళ్లాలని సూచించారు. బాగా చదువుకొని మంచి ఉ ద్యోగాలు తెచ్చుకుంటే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ గఫూర్, కళాశాల కరస్పాండెంట్ గాడి సత్యవతి, డైరెక్టర్ దొరబాబు, ప్రిన్సిపల్ నానాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అవినీతిపై ఉక్కుపాదం

**- డబ్బులు అడిగితే వేటు తప్పదు**
**- ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ**



పాడేరు రూరల్, జనవరి 09(మనసులో మాట):ప్రభుత్వ సేవల విషయంలో అలసత్వం వహించినా, ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించినా లేదా అదనపు వసూళ్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ హెచ్చరించారు. ముఖ్యంగా సచివాలయాల పరిధిలోని అగ్రికల్చర్, ఇంజనీరింగ్, ఆరోగ్య, రెవెన్యూ విభాగాల సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, సేవలకు సంబంధించి అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తే అది అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించబడుతుందని అధికారులకు స్పష్టం చేశారు. ఈ చట్టం కింద ఒకసారి కేసు నమోదైతే, లంచం తీసుకోలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత సదరు ఉద్యోగిపైనే ఉంటుందని, అది అత్యంత క్లిష్టమైన ప్రక్రియ అని గుర్తు చేశారు.ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు రక్షణ కల్పించాలంటే ప్రతి అంశాన్ని తప్పనిసరిగా రికార్డు చేయాలని సూచించారు. పదిహేను రోజుల ముందు జారీ చేసే నోటీసులు, సర్వ్ చేసిన కాపీలను పక్కాగా భద్రపరచాలని, పీహెచ్‌సీలలో మందుల పంపిణీకి సంబంధించి ఎవరికి ఇచ్చారన్న వివరాలు రికార్డులుగా ఉంచాలని ఆదేశించారు. తద్వారా డబ్బులు అడిగారన్న ఆరోపణలు వచ్చినప్పుడు వాస్తవాలను నిరూపించే అవకాశం ఉంటుందన్నారు. ఐబీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌ను మెరుగుపరుచుకోవాలని, ప్రతి విభాగం తమ రికార్డులను స్పష్టంగా నిర్వహించాలని తెలిపారు.క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు జిల్లా అధికారులు రోజుకు కనీసం ఒక గంట సమయాన్ని పిటిషనర్లతో నేరుగా మాట్లాడటానికి కేటాయించాలని ఆదేశించారు. ఫీల్డ్ అధికారులు ఇచ్చే నివేదికలనే గుడ్డిగా నమ్మవద్దని, తహసీల్దార్లు లేదా ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పూర్తికాకపోయినా పూర్తయ్యాయని చెప్పే అవకాశం ఉందని హెచ్చరించారు. బాధితులతో నేరుగా మాట్లాడినప్పుడే వాస్తవాలు బయటపడతాయని పేర్కొన్నారు. ప్రవర్తనా లోపాలు, నిబంధనల ఉల్లంఘనలపై డబ్ల్యూఎఫ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మలత, ఆర్డిఓ లోకేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

## కోస్తాంధ్ర

| | | |
|---|---|---|
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

శనివారం 10 జనవరి 2026




## పిఠాపురం ప్రజలతో మమేకమైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

### సంక్రాంతి సంబరాల ప్రారంభోత్సవం అనంతరం పట్టణంలో

# క్షేత్ర స్థాయి పర్యటన

- ▸▸ పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి
- ▸▸ ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ ముందుకు సాగిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్







**పిఠాపురం (మనసులో మాట), జనవరి 9:** తనపై ఎంతో ప్రేమతో ఓట్లువేసి గెలిపించి, తమ నాయకుడిగా ఎంచుకున్న నియోజకవర్గ ప్రజలని కలుసుకునేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పట్టణంలో క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలను ప్రారంభించిన అనంతరం పట్టణంలో కాలినడకన ప్రజల వద్దకు వెళ్లి, వారితో ముచ్చటిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. పిఠాపురం ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి..ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానం నుంచి పవన్ కళ్యాణ్ వెలుపలికి రాగానే పలువురు ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు నిల్చుని ఉన్నారు. వారి సమస్యలు తెలుసుకునేందుకు వాహన శ్రేణి నుంచి దిగిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్కడి నుంచి శ్రీ కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయం వరకు ప్రజలను పలుకరిస్తూ కాలినడకన ముందుకు సాగారు. పెద్దింటి అనంత పద్మావతి అనే మహిళ తమకు ఇంటి స్థలం కావాలని కోరారు. మరో మహిళ తమ ఇళ్ల వద్ద విద్యుత్తు తీగలు సాగిపోయి కిందికి వచ్చేసి ప్రమాదకరంగా ఉన్నాయని, సాగిపోయిన విద్యుత్తు తీగలు తగిలి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్న విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.పిఠాపురం పోలీస్ స్టేషన్ పరిశీలన..అనంతరం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరిశీలించారు. స్టేషన్లో ఉన్న గదులను చూసి పిఠాపురంలో శాంతి భద్రతల తీరుపై ఆరా తీశారు. స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఫొటోలు దిగారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చి కుక్కుటేశ్వర స్వామి ఆలయ సమీపంలో యానాదుల కాలనీ వాసులను పలుకరించారు. దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి యానాదుల కాలనీలో పక్కా ఇళ్లు నిర్మించాలని, డ్రెయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి చెప్పుకున్నారు. శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం వెలుపల ఉన్న దుకాణదారులను పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. చివరిగా ఆలయ అర్చకులతో మాట్లాడి వారితో ఫొటోలు దిగారు. ఉప ముఖ్యమంత్రి వెంట జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఇతర అధికారులు ఉన్నారు.






- ▸▸ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు
- ▸▸ రైతుల భూములకు భరోసా ఇచ్చేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- ▸▸ రీ-సర్వేలో తప్పులుంటే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- ▸▸ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు... పెత్తనం భరించనక్కర్లేదు
- ▸▸ వివాదాలు సృష్టించే ప్రభుత్వం కాదు... పరిష్కరించే ప్రభుత్వం
- ▸▸ టెక్నాలజీతో ట్యాంపరింగ్ ఫ్రీ డాక్యుమెంట్లు
- ▸▸ భూములను లాక్కోలేరు... రికార్డులు తారుమారు చేయలేరు
- ▸▸ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ సభలో సీఎం చంద్రబాబు

## రైతులకు ప్రభుత్వం

# పూర్తి భరోసా



**మండపేట (తూర్పు గోదావరి జిల్లా), మనసులో మాట, జనవరి 9:** "మీ భూమి-మీ హక్కు ఇదీ రైతులకు, భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రైతులకు వివాదాల్లేని క్లీన్ డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని... ఆ దిశగానే భూముల రీ-సర్వే చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం రాయవరంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన చంద్రబాబుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా రాయవరంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్య ఉన్న, మీ భూమి..మీ హక్కు పేరిటి రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. క్యూఆర్ కోడ్ ద్వారా తక్షణం భూమి వివరాలు తెలుసుకునేలా పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ ముద్రించిందని రైతులకు సీఎం వివరించారు. రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త టెక్నాలజీతో ట్యాంపరింగ్ చేసేందుకు వీళ్లేకుండా పట్టాదారు పాస్ పుస్తకం తయారు చేసినట్టు చెప్పారు. రీసర్వే పూర్తైన 6688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్ పుస్తకాలు ముద్రించగా... ప్రస్తుతం వాటిని పంపిణీ చేస్తున్నట్టు రైతులతో సీఎం చెప్పారు. రైతులు, భూ యజమానులకు తప్పుల్లేని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. అనంతరం మీ భూమి- మీ హక్కు ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... "పూర్వీకుల నుంచి సంక్రమించిన, స్వార్జితమైన భూమితో రైతులకు ఓ అనుబంధం ఉంది. కరోనా సమయంలో అంతా సెలవు తీసుకున్నారు. కానీ అందరికీ అన్నం పెట్టే రైతన్నకు సెలవే లేదు. అలాంటి రైతులకు చెందిన భూ పత్రాల విషయంలో గత పాలకులు పాస్ పుస్తకాల జారీకి సంబంధించి అక్రమాలు చేశారు. గత పాలకుల్ని, ప్రభుత్వాన్ని హెచ్చరించాను. కానీ వారి అహంకారం నెత్తికెక్కి మీ ఆస్తులపై ఆయన ఫొటో వేసుకున్నారు. పూర్వీకులు ఆర్జించిన భూమిపై నాటి పాలకుని ఫొటో ఏమిటి.? సరిహద్దు రాళ్లపై గత పాలకుని ముద్రలేమిటి? ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటూ ఓ చట్టాన్ని తెచ్చి వాళ్లకు నచ్చిన వాళ్ల ఆధీనంలోకి తీసుకువచ్చేలా చేశారు. దీనిని గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించాను. మీ భూముల వివరాలన్నీ గత పాలకుల అనుచరులు అమెరికాలో పెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి రాకపోతే ప్రజల భూములన్నీ కాజేసేందుకు కుట్రపన్నారు. నిన్నా మొన్నా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు చాలా ప్రమాదకరమైన ఆలోచన చేశారు. రైతుల భుంలపై వేరేవాళ్ల ఫోటోలెందుకని ప్రశ్నించాను. ప్రభుత్వంలోకి వచ్చాం... రాజముద్ర వేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాం. గత పాలకుల తీరు కారణంగా ఎక్కడకు వెళ్లినా భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్లే వస్తున్నాయి. ఈ వివాదాలను పరిష్కరించేందుకు సంకల్పించి మీ వద్దకు వచ్చాను."అని సీఎం చెప్పారు.

## పిఠాపురంలో

# సంక్రాంతి శోభ

- ▸▸ మూడు రోజుల వేడుకలకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ▸▸ అచ్చ తెలుగు సంస్కృతిని ఆవిష్కరించిన సంక్రాంతి సంబరాలు
- ▸▸ ఆకట్టుకున్న జానపద కళారూపాలు, శాస్త్రీయ నృత్యరీతులు
- ▸▸ డప్పు శబ్దాలు, కొమ్ముకోయల ఆటలు.. గరగ నృత్యాలు, వీరనాట్య రీతులు, కోలాటాల సందళ్ల మధ్య సంబరం
- ▸▸ గోపూజలు చేసి, హరిదాసుల కీర్తనలు ఆస్వాదించిన పవన్ కళ్యాణ్
- ▸▸ సీమంతం, భోగి పళ్ల మహోత్సవాల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్










**పిఠాపురం (మనసులో మాట), జనవరి 9:** కాకినాడ జిల్లా పీఠికాపురాన్న సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రతి అడుగు తెలుగింటి సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడగా.. పల్లె పదాలు, ప్రగతి వీచికలు అన్ని ఒకే వేదికపై ఆవిష్కృతం కాగా... డప్పుల శబ్దాల సందళ్లు, పల్లె పడుచుల కోలాటాల కోలాహలం మధ్య స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహచర మంత్రులతో కలిసి 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం' పేరిట ఏర్పాటు చేసిన ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. సంప్రదాయ బద్ధంగా గో ఆరాధన చేసి, రంగవల్లులు తీర్చిదిద్దిన హరివిల్లుల ముంగిట ప్రకృతికి పూజలు నిర్వహించారు. తెలుగు సంస్కృతికి అద్దం పట్టే జానపదుల గీతికలు, శాస్త్రీయ నృత్యాలను ఆహుతులతో కలిసి ఆస్వాదించారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్ ను ప్రారంభించి మన హస్తకళల శైలిని పరిశీలించారు. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్..పవన్ కళ్యాణ్ తో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. పిఠాపురానికి సంక్రాంతిని ముందుగానే తెచ్చిన ఈ సంబరాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి.హరిదాసు సంకీర్తనలు, మేళతాళాల మధ్య ఆటలాడే బసవన్నలు, గుండెలపై ధరించిన డప్పుల శబ్దాలతో చిందులేసే తప్పెటగుళ్ల కళాకారుల విన్యాసాలు, లయబద్ధంగా సాగే గరగ నృత్యాలు, శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు, చిన్నారుల భవితను కాంక్షించే భోగిపళ్ల మహోత్సవాలు, ప్రకృతికి జీవాన్నిచ్చే గోమాతల పూజలు, హస్త కళల సోయగాల మధ్య అచ్చ తెలుగు పండుగ సంక్రాంతికి పిఠాపురం నుంచి స్వాగతం పలికారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పిఠాపురానికి చేరుకున్న పవన్ కళ్యాణ్ కి శాస్త్రీయ కూచిపూడి నృత్య కళాకారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

**థింసా కళాకారులతో పదం కలిపిన పవన్ కళ్యాణ్..**

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన కళారూపాలు తిలకిస్తూ పవన్ కళ్యాణ్ ముందుకు కదిలారు. ఆ కళా రూపాలు ఉప ముఖ్యమంత్రిని విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్లెపడుచుల కోలాటాలు, వీర నాట్యాలు, గిరిజన సంప్రదాయాలకు అద్దం పట్టే కొమ్ము కోయల సందళ్లు అడుగడుగునా స్వాగతం పలుకగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కళాకారులతో మమేకమవుతూ.. ఆసక్తిగా తిలకిస్తూ కళాకారులను పేరు పేరునా పలుకరిస్తూ.. వారితో ఫొటోలు దిగుతూ ముందుకు సాగారు. ప్రతి సంప్రదాయం గురించి ఆరా తీస్తూ వారి కళాకారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా కళాకారులతో కలిసి పదం కలిపి నృత్యం చేశారు.

**హరిదాసులకు స్వయంపాక దానం..**

సంక్రాంతి మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంటి ముంగిట రంగవల్లుల హరివిల్లులను తిలకిస్తూ, హరిదాసుల సంకీర్తనలు విన్నారు. సంప్రదాయబద్ధంగా ధాన్యం, ధనం, కూరగాయలు, పండ్లతో కూడిన స్వయంపాక దానం చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ స్టాల్ ను పరిశీలించారు. వరితో పాటు విభిన్న జాతుల సిరి ధాన్యాల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

**రాట్నం వడుకుతూ..**

చేనేత, జౌళి, చేతివృత్తులు, మహిళా, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పవన్ కళ్యాణ్ సందర్శించారు. చేనేత కళాకారులను పలుకరించి స్వయంగా రాట్నం వడికి, మగ్గాన్ని పరిశీలించారు. జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలను స్టాళ్లను తిలకించారు. ఉప్పాడ చీరలు, కలంకారీ తదితర వస్త్రాల మీద అద్దిన కళలు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. నేతన్నలు ప్రత్యేకంగా రూపొందించిన కోటును ధరించి వారిని ఉత్సాహపరిచారు. తోలు బొమ్మల కళాకారులతో ముచ్చటించారు. లేపాక్షి స్టాల్ లో శ్రీనివాసుని ప్రతిమలను తిలకించారు. అనంతరం గర్భిణులకు పవన్ కళ్యాణ్ శ్రీమంతం వేడుక నిర్వహించారు. అదే స్టాల్ లో చిన్నారులకు భోగి పళ్లు పోసి చిరాయుష్షు కలగాలని ఆశీర్వదించారు. ఏటికొప్పాక లక్క బొమ్మలు, బొబ్బిలి వీణలను పరిశీలించారు. వీణతో తంత్రిని మీటి సంగీత ధ్వనులను ఆస్వాదించారు. రాష్ట్రంలో పర్యాటక కేంద్రాలు, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఏర్పాటు చేసిన పర్యాటక శాఖ స్టాల్ ను సందర్శించారు. శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్ , పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, జానపద కళలు, సృజనాత్మక అకాడెమీ ఛైర్మన్ వంపూరి గంగులయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జ్ కృష్ణంరాజు, ఏఎంసీ ఛైర్మన్ వాకపల్లి దేవి, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, నటులు హైపర్ ఆది, ఆర్ కే సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి స్వాగతం

**పలికిన ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్**



**కాకినాడ (మనసులో మాట) జనవరి 9..** పీఠకాపుర సంక్రాంతి మహోత్సవాల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం మంగళగిరి నుంచి ప్రత్యేక ఛాపర్ లో బయలుదేరిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ ఎస్పి గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్వీవీ సత్యనారాయణ, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతం కాకినాడ ఎస్పీ గ్రౌండ్ నుంచి రోడ్డు మార్గంలో ఆయన పిఠాపురం పయనమయ్యారు.

# బాబాయ్ ను లేపేస్తే అది వార్త కాదు...

- శాంతిభద్రతల విషయంలో ఉపేక్షించేది లేదు
- వైసిపి కుట్రలు పన్నితే ఇక్కడే కూర్చుని ఏరిపారేస్తా



**పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 9:** పిఠాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా దానిని వైరల్ చేస్తున్నారు. పిఠాపురంలో చెట్టు మీద ఆకు ఊగినా, పక్షి ఈక రాలినా ఏదో జరిగిపోయిందని ప్రచారం చేస్తున్నారు. అంటూ పవన్ కళ్యాణ్ పిఠాపురంలో జరిగిన సంక్రాంతి వేడుకలలో ఘాటు వ్యాఖ్యలు చేశారు ... పులివెందులలో సొంత బాబాయ్ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. ఎంతో విజ్ఞత ఉన్న రాజకీయ నాయకులే మాటకు మాట అనుకుంటున్న రోజులివి. అలాంటిది చిన్న పిల్లలు ఒక మాట అనుకోరా? దానికి కులాలను మధ్యలోకి తీసుకురావాలా? గత ప్రభుత్వానికి తెలిసింది ఒక్కటే... బూతులు తిట్టడం, కేసులు పెట్టడం, ప్రజలకు మనశ్శాంతి లేకుండా చేయడం. ఇప్పుడు అదే పద్ధతిని అవలంబిస్తున్నారు. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దాం.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడదాం అనుకుంటే ఇక్కడే కూర్చొని ఏరివేస్తాను. శాంతి భద్రతల విషయంలో పోలీసులు చాలా కఠినంగా వ్యవహరించాలి. వ్యవస్థలకు ఎవరూ అతీతులు కాదు. ముఖ్యమంత్రి అయినా, నేను అయినా తప్పు చేస్తే శిక్షించే పరిస్థితులు ఉండాలని అసెంబ్లీలో చెప్పాం. నన్ను ఒక మాట అన్నా పడతాను, పార్టీని దూషించినా భరిస్తాను.. ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే మాత్రం ఉపేక్షించను. దాని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయి. నా మాటలు మెత్తగా ఉంటాయి.. కానీ చర్యలు చాలా గట్టిగా ఉంటాయి.. శాంతిభద్రతల విషయాన్ని చాలా లోతుగా తీసుకుంటాను. పర్యావసనాలు తీవ్రంగా ఉంటాయంటూ ఉప ముఖ్యమంత్రి హెచ్చరించిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాలలో తీవ్రంగా వైరల్ అవుతున్నాయి.

### 'పిఠాపురం'లో అభివృద్ధి పనులకు

# డిప్యూటీ సీఎం శ్రీకారం

- రూ. 211కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు పీ నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్



**పిఠాపురం (మనసులో మాట), జనవరి 9:** పిఠాపురం నియోజకవర్గం పరిధిలో గత ఏడాది సుమారు రూ.308 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులలో ఇప్పటికే 60 నుండి 70 శాతం పనులు పూర్తి చేశామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో రూ. 211 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం' వేదిక నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మరో రూ.186 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. శుక్రవారం రూ.26 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగంగా పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 4.03 కోట్ల అభివృద్ధి పనులను గొల్లప్రోలు మున్సిపాలిటీ పరిధిలో రూ.80.02 లక్షల విలువైన అభివృద్ధి పనులను, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రూ.12.46 కోట్లతో నిర్మించిన 41 ఎన్ఆర్జీఎస్ పీఆర్ రోడ్లను, రూ. 2.95 కోట్లతో నిర్మించిన పిఠాపురం 33/11 విద్యుత్తు సబ్ స్టేషన్, రూ. 1.35 కోట్లతో పిఠాపురంలో నిర్మించిన పశువుల సంతను, రూ.3.05 కోట్లతో గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నిర్మించిన సుద్దగడ్డ బ్రిడ్జిని, రూ. 27 లక్షలతో గొల్లప్రోలు వద్ద నిర్మించిన సూరంపేట బ్రిడ్జిని, రూ. 1.16 కోట్లతో గొల్లప్రోలు జడ్పీ హైస్కూల్, పిఠాపురం లోని ఎస్బీఎంఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పీఎం ల్యాబ్ లను ప్రారంభించినట్టు తెలిపారు. అదే విధంగా రూ.9.60 కోట్లతో చేపట్టే ఏపీఐఐసీ ప్లాటేడ్ ప్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి, రూ.2 కోట్లతో కోనపాపపేట వద్ద నిర్మించే కోస్టల్ రీ సైలెన్స్ పథకానికి, నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం క్రింద రూ.31.22 కోట్లతో చేపట్టే 178 గోకులాలకు, 12 హెల్త్ క్లినిక్ లకు, రెండు గ్రామ పంచాయతీ భవనాలకు, పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.6.05 కోట్లతో చేపట్టే సీసీ డ్రెయిన్లు, మోడల్ రోడ్డు అభివృద్ధి పనులకు, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రూ.3 కోట్లతో చేపట్టే సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు, పిఠాపురం నియోజకవర్గ పరిధిలో సీజీఎఫ్ గ్రాంటు క్రింద రూ.14.05 కోట్లతో వివిధ ఆలయ అభివృద్ధి పనులకు, రూ.92.34 కోట్లతో పంచాయతీ రాజ్, డ్వామా ఆధ్వర్యంలో ఎపీఆర్ఆర్ఎస్పి గ్రాంటు క్రింద చేపట్టే గ్రామీణ రోడ్ల పనులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో వివిధ దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, కాకినాడ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మరోహర్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, జానపద కళలు, సృజనాత్మక అకాడెమీ ఛైర్మన్ వంపూరి గంగులయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జ్ కృష్ణంరాజు, ఏఎంసీ ఛైర్మన్ వాకపల్లి దేవి, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, డీఆర్ఓ జె వెంకట్రావు, నటులు హైపర్ ఆది, ఆర్ కే సాగర్, ఆర్డీఓ లు ఎస్ మల్లిబాబు, కే శ్రీ రమణి, పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నేనే చీపురు పట్టి ఉడవాలా?

- జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు మున్సిపల్ కమిషనర్ నామ కనకారావులపై ఫైర్ అయిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్..
- మోహన్ నగర్, ఇందిరానగర్ ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి
- అవసరమైతే రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలంటూ తుమ్మల బాబుకు పవన్ హితవు
- పాడా ప్రకటించి ఉపయోగం ఏముందంటూ ప్రశ్నించిన పవన్..



**పిఠాపురం, (మనసులో మాట ) జనవరి 9:** పిఠాపురం పట్టణంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, స్థానిక పారిశుద్ధ్య లోపాలపై అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం పట్టణంలోని మోహన్ నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం అపరిశుభ్ర వాతావరణాన్ని చూసి చలించిపోయారు. అత్యంత దారుణంగా ఉన్న పరిసరాలను గమనించిన పవన్ కళ్యాణ్, వెంటనే జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావులను నిలదీశారు. "ఇంత అపరిశుభ్రత మధ్య ప్రజలు ఎలా నివసిస్తారు? అధికారులు ఏం చేస్తున్నారు? నేనే స్వయంగా చీపురు పట్టి ఉడవాలా?" అంటూ పవన్ కళ్యాణ్ వారిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.అనంతరం, జిల్లా కలెక్టర్తో మాట్లాడిన పవన్, తక్షణమే సదరు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భారత్, ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. రాబోయే 30 రోజుల్లోగా మోహన్ నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యను పూర్తిగా పరిష్కరించి, ప్రాంతాన్ని శుభ్రం చేస్తామని పవన్ కళ్యాణ్కు హామీ ఇచ్చారు. గుడ్ మార్నింగ్ పిఠాపురం చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకుంటానంటూ తుమ్మల బాబు పవన్ కళ్యాణ్ కు తెలిపారు, ఇక్కడ గల స్థానిక నాయకులతో కూర్చుని చర్చించి ఇలాంటి సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తుమ్మల బాబుకు పవన్ కళ్యాణ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి అధికారులను హెచ్చరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ తీరుపై ఇప్పటికే పలుమార్లు మనసులో మాట దినపత్రికలో అనేక కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే! పవన్ వార్నింగ్ తో అధికారుల్లో కదలిక ఉంటుందా! లేదా అనేది వేచి చూడాల్సి ఉంది!

## కోనసీమలో బ్లోఅవుట్ ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమలాపురం (మనసులో మాట) జనవరి 9 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మండపేట నియోజకవర్గం రాయవరం పర్యటనలో భాగంగా కోనసీమ జిల్లాలో మలికిపురం మండలం ఇరుసుమండ వద్ద జరిగిన బ్లోఅవుట్ ప్రాంతాన్ని శుక్రవారం హెలీఫ్యాడ్ ద్వారా ఏరియల్ వ్యూ ద్వారా సర్వే నిర్వహించారు. అనంతరం రాయవరంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఓఎన్జిసి అధికారులు ఎంపీ హరీష్ బాలయోగితో చర్చలు జరిపారు. ఘటనపై ఓఎన్ జిసి అధికారులను చంద్రబాబు నాయుడు వివరణ అడిగారు.కోనసీమలో తరచూ బ్లోఅవుట్లు ఎందుకు జరుగుతున్నాయని దానిపై సమగ్ర రిపోర్టు ఇవ్వాలని ఓఎన్ జిసి అధికారులను అడిగారు. అనంతరం ఘటన జరిగిన ప్రాంతంలో ఆస్తి నష్టం పై వెంటనే నివేదిక సమర్పించి బాధితులకు నష్టపరిహారం అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సీఎం చంద్రబాబు ఆదేశించారు.






## గ్రామ సభల్లో ఆమోదం... ఆ తర్వాతే పాస్ పుస్తకాలు...




**మండపేట (తూర్పు గోదావరి జిల్లా), మనసులో మాట, జనవరి 9:** "తహసీల్దారు కార్యాలయంలో కాదు... గ్రామసభలు నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించాను. ఎక్కడా మోసం జరక్కుండా, వివాదాలకు తావివ్వకుండా రాజముద్రతో మీ భూమి- మీహక్కు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. పద్ధతి ప్రకారం రీసర్వే చేయించి.. రికార్డులు అన్నీ అత్యంత సురక్షితంగా ట్యాంపర్ చేయలేని విధంగా భద్రపరుస్తున్నాం. భూ రికార్డులు ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగిస్తున్నాం. జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకంపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు మీ రికార్డు వచ్చేస్తుంది. ప్రభుత్వం ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకంతో మీ ఆస్తిపై మీకు పూర్తి భరోసా వస్తుంది. సర్వే చేసిన రికార్డులను మరోమారు తనిఖీ చేసి రైతులు చెప్పిన వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నాం. ఈకేవైసీ పూర్తి అయ్యాకే పాస్ పుస్తకం ముద్రించి జారీ చేస్తాం. ఎక్కడా అవినీతి లేకుండా, పెత్తనం లేకుండా మీ భూమి – మీ హక్కు పట్టాదారు పాస్ పుస్తకాలను గ్రామ సభ ద్వారా ఇస్తున్నాం. ఈ పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేసే విషయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలి. క్షేత్రస్థాయి వరకూ రీసర్వే పూర్తైన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరగాలి. ఓ యజ్ఞం తరహాలో ఈ పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు, భూ యజమానులకు అందించాలని కోరుతున్నాం. జారీ అయిన పాస్ పుస్తకాల్లో తప్పులు దొర్లితే నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఉన్నదే వివాదాలు పరిష్కరించడానికి. గత పాలకుడు రూ.660 కోట్ల సర్వే రాళ్లపై బొమ్మలు ముద్రించడానికి ఖర్చు పెట్టాడు. పట్టాదారు పాస్ పుస్తకాలపై ఆయన ఫోటో వేసుకోడానికి రూ.22 కోట్లు ఖర్చు చేశారు. 77 లక్షల సర్వే రాళ్లపై అతని ఫొటో వేయించుకున్నారు. వాటన్నిటినీ సరి చేయించాం. ఆర్వోఆర్, ఎఫ్ లైన్ లాంటి రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. బలవంతంగా 22ఏ జాబితాలో పెట్టేసిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నాం. భూయజమానులకు ప్రయోజనం కల్పించేలా నాలా చట్టాన్ని రద్దు చేశాం. జాయింట్ కలెక్టర్ల వద్ద మాత్రమే ఉండిపోయిన కొన్ని అధికారాలను వికేంద్రీకరించాం. గతంలో కొందరు స్వార్ధంతో, లాలూచీ రాజకీయాలతో భూములు కొట్టేసేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు మళ్లీ రీసర్వే చేసి 6688 గ్రామాల్లో గ్రామసభలు కూడా నిర్వహించాం. వివాదాలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. సబ్ డివిజన్ ఫీజు కూడా మాఫీ చేశాం. కుటుంబాల మధ్య తగాదాలతో ఆస్తుల వివాదాలు తలెత్తుతున్నాయి."అని ముఖ్యమంత్రి చెప్పారు.



## గోదావరి అందాలు... పర్యాటక ప్రాంతాలు

"పర్యాటకంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. జగ్గన్న పేట ప్రభల తీర్థాన్ని కూడా రాష్ట్ర పండుగగా ప్రకటించాం. సంక్రాంతికి కోడి పందాలు మన సంప్రదాయమే. కానీ జూదాలు వద్దు. మన వారసత్వాన్ని పరిరక్షించుకుందాం. జూదాల ద్వారా దానిని బలహీన పర్చుకోవద్దు. జగ్గన్న పేట ప్రభల ద్వారా శివుని ప్రతిరూపం. వాడపల్లి, కాత్రేని కోన, భీమవరం, నల్లజర్ల, మేదునూరు, ముమ్మిడివరం, మొగల్తూరు, పాలకొల్లు, గంగాలకురవు అగ్రహారం, పుల్లేటి కుర్రు ప్రభల ద్వారా మన సంస్కృతి పరిఢవిల్లుతోంది. ప్రకృతి, ప్రజల మధ్య ఉన్న బంధం ఈ ప్రభల ద్వారా వెలుగు చూస్తోంది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి వారసత్వాన్ని కాపాడుతున్నాం. చరిత్రలో నరకాసురుడిని వధిస్తే దీపావళి జరుపుకుంటున్నాం. నరకాసురుడి పాలన రాకూడదని.. మంచికి చెడుకి వ్యత్యాసం తెలుసుకునేలా ఈ దీపావళి చేసుకుంటున్నాం. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల్ని ఎంతో వేడుకగా నిర్వహించుకుంటున్నాం. ప్రకృతిని ఆరాధించటం మన సంప్రదాయం. గోదావరి పుష్కరాలను వరుసగా మూడో మారు సీఎంగా నిర్వహించే అదృష్టం నాకు వచ్చింది."అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.





### నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నవీన్, వసంత్, రామాంజనేయులు

జగ్గంపేట (మనసులో మాట) జనవరి 9 అమరావతి లోని జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు,జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్, గండేపల్లి క్లస్టర్ ఇంచార్జ్, మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ అడబాల రామాంజనేయులు అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం పైన,తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల పైన నారా లోకేష్, జ్యోతుల నవీన్ ను అడిగి తెలుసుకున్నారు.

# అప్రమత్తత అవసరం

- పండుగ సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళితే మీ ఆభరణాలు, విలువైన వస్తువులు జాగ్రత్త
- దొంగలకు తాళం వేసిన ఇళ్లే లక్ష్యం గా చోరీలకు పాల్పడే అవకాశం ఉంది..
- జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9 :** "పండుగ సెలవుల కోసం మీ ఇంటి నుండి బయలుదేరేటప్పుడు మీ ఆభరణాలు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచుకోండి" అని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో నేరాల నియంత్రణ, దొంగతనాల అరికట్టడమే లక్ష్యంగా పలు కీలక సూచనలు జారీ చేశారు. దొంగలు తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో (లేదా) ఇతర సురక్షితమైన ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే ఆ ఇంటిపై నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా, ఇంటి దొంగతనాలను నివారించడానికి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్హెచ్ఎంఎస్) ఉచిత సర్వీసును ప్రజలు వినియోగించుకుని తమ యొక్క విలువైన సామాగ్రిని క్షేమంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద సీసీ కెమెరాలు (సీసీటీవీ) ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరమని ఎస్పీ సూచించారు. ఇది పగలు, రాత్రి సమయాల్లో జరిగే అవాంఛనీయ సంఘటనలను గుర్తించడంలో పోలీసులకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. మీరు దూరంగా ఉన్నప్పుడు మీ ఇంటిని చూసేందుకు స్థానిక పోలీసు స్టేషన్‌లు, విశ్వసనీయ వ్యక్తులు, ఇరుగు పొరుగు వారికి మాత్రమే తెలియజేయండి అని హితవు పలికారు. మీ ప్రయాణ ప్రణాళికలను సోషల్ మీడియాలో లేదా ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. విశ్వసనీయ వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డులను మాత్రమే నియమించుకోండని కోరారు. సెలవుల సమయంలో ఇంటికి తాళాలు వేసి వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇంటిపై నిరంతర పోలీసు నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ నిఘాను పటిష్టం చేస్తామని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఇంటి పరిసరాల్లో సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ఇంటి లోపల, బయట రాత్రి వేళల్లో లైట్లు వెలిగించి ఉంచాలని సూచించారు. దాని ద్వారా ఇంట్లో వ్యక్తులు ఉన్నారనే భావన కలిగి దొంగలు దొంగతనాలకు పాల్పడకుండా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంక్రాంతి కాలంలో చోరీలు జరగకుండా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. "ప్రజల రక్షణే మా ప్రాధాన్యత". పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుంది. ప్రజలు పోలీసులతో సహకరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పండుగను సురక్షితంగా జరుపుకోవాలి." అన్ని జిల్లా ఎస్పీ డీ నరసింహ కిశోర్ సూచించారు.

# ఇక క్రీడా హబ్‌గా రాజమండ్రి

- ఖేలో ఇండియా నిధులు మంజూరు శుభపరిణామం
- మల్టీ పర్పస్ స్టేడియం నిర్మాణానికి రూ. 13.76 కోట్లు మంజూరు
- వివరాలు వెల్లడించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- అర్హులకు రూ. 9.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ





**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9:** సాంస్కృతికి రాజధానిగా విరాజిల్లుతున్న నగరం ఇక క్రీడా హబ్‌గా కూడా మారబోతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఖేలో ఇండియా నిధులతో రాజమండ్రి క్రీడా రాజధాని కి తొలి అడుగు వేయటం జరిగిందన్నారు. ఖేలో ఇండియా పథకం కింద రాజమహేంద్రవరానికి రూ. 13.76 కోట్లు నిధులు మంజూరయ్యాయని శుక్రవారం స్థానిక పుష్కరాల రేవు వద్ద ఉన్న శ్రీకన్య గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఖేలో ఇండియా పథకం కింద రాజమండ్రికి రూ. 13.76 కోట్ల నిధులు మంజూరవడం నగరానికి చారిత్రాత్మక విజయమన్నారు. కేంద్ర... రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి యువతకు, క్రీడాకారులకు ముందస్తు సంక్రాంతి కానుకగా ఈ నిధులు మంజూరు చేశాయన్నారు.

**మాట ఇచ్చాం నిలబెట్టుకున్నాం..**

రాజమండ్రిని క్రీడా రాజధానిగా మారుస్తా, మల్టీపర్పస్ స్టేడియం కట్టి చూపిస్తా అని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ఇప్పుడు అమలులోకి వస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గుర్తు చేశారు. మాట ఇస్తే నెరవేర్చడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే అసలైన పరిపాలనకు నిదర్శనం అన్నారు.

**ఎంపీ పురంధేశ్వరికి కృతజ్ఞతలు..**

ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి కృషిని ప్రత్యేకంగా చెప్పుకోవాలన్నారు. ఈ నిధులు మంజూరు కావడంలో ఎంపీ పురంధరేశ్వరి చేసిన కృషి అసాధారణమని, ఢిల్లీలో ఆమె పట్టుదలతో చేసిన ఫాలోఅప్ వల్లే ఈ ఫలితం సాధ్యమైందని ఎమ్మెల్యే వాసు వివరించారు. ప్రజలకు మనిషి కనబడకపోయినా పనులు కనిపిస్తున్నాయన్నారు. ఎంపీ పురంధరేశ్వరి నిశ్శబ్దంగా రాజమండ్రికి నిధులు తెస్తుంటే కొందరు చేసే విమర్శలు పనికిమాలినవే అని వ్యాఖ్యానించారు.

**గతంలో కొందరు రీల్స్ నాయకులను చూశాం..**

గతంలో ఉన్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌కు పార్లమెంట్‌లో రీల్స్ చేయడం, క్యాట్ వాక్ లు చేయడం, పూలు జల్లించుకోవడంపైనే శ్రద్ధ ఉండేదని, రాజమండ్రికి నిధులు తేవడంపై నిజమైన పట్టుదల కనిపించలేదని ఎమ్మెల్యే వాసు వ్యాఖ్యానించారు. రోజా, బెఎరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి వచ్చి శిలాఫలకాలు వేశాక ఒక్క ఇటుక కూడా వేయకపోవడం వైఎస్ఆర్ సీపీ పాలన వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

**జగన్ 'క్రెడిట్' రాజకీయాలపై వ్యాఖ్య..**

భోగాపురం ఎయిర్ పోర్టును తానే కట్టానని, రేపు అమరావతినీ నేనే కట్టానని చెప్పే జగన్ రెడ్డి మనస్తత్వం ప్రజలకు తెలుసని ఎమ్మెల్యే వాసు ఎద్దేవా చేశారు. క్రెడిట్ మీకే కావాలంటే తీసుకోండి, మా యువతకు ఉద్యోగాలు రావాలి, ప్రజలు బాగుండాలి అన్న లోకేష్ వ్యాఖ్యలను ఆయన ఉదహరిస్తూ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తోందని చెప్పారు.

**రీల్స్ కాదు రియాలిటీ అభివృద్ధి..**

రాజమండ్రి అభివృద్ధి రీల్స్‌లో కాదు, రియాలిటీలో చూపిస్తామనే సంకల్పంతోనే ఖేలో ఇండియా నిధులు సాధించామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పిల్ల రాజకీయాలు, పిల్ల సైకోలు చేసే చేష్టలను పట్టించుకోకుండా, కేంద్ర క్రీడా శాఖ, ఎంపీ పురంధరేశ్వరి సహకారంతో నగర అభివృద్ధి కోసం పెద్ద స్థాయిలో కృషి కొనసాగిస్తామని తెలిపారు.

**ముగ్గుల పోటీలు, ప్రజాభిమానం క్రెడిబిలిటీకి నిదర్శనం..**

రాజమండ్రిలో వారం రోజులుగా జరుగుతున్న ముగ్గుల పోటీలు ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని ఎమ్మెల్యే వాసు అన్నారు. రాజమండ్రి మహిళలను తన అక్కాచెల్లెళ్లుగా భావించి తన సరదా కోసం కాకుండా, వారి ఆనందం కోసం ఈ ముగ్గుల పోటీల నిర్వహించినట్టు తెలిపారు. ప్రైజుల కోసం కాదు, మనసులోని అభిమానాన్ని ముగ్గుల రూపంలో వ్యక్తపరిచారన్నారు. ఈ పోటీల్లోని విజేతలకు పుష్కరాల రేవులో శనివారం సాయంత్రం 5 గంటలకు బహుమతులు అందచేయడం జరుగుతుందన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...**

**సంక్రాంతి శుభాకాంక్షలు..**

మీడియా సమావేశంలో రూ. 9.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పంపిణీ చేశారు. రాజమండ్రి ప్రజలకు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, ఖేలో ఇండియా స్టేడియం ద్వారా స్థానిక యువత ప్రతిభ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి కోడి పందాలకు బరులు రెడీ



**ఎటపాక (మనసులో మాట), జనవరి 9:** సంక్రాంతి పండుగ సమీపిస్తునడంతో ఇప్పుడే మండలంలో కోడిపందాల జోరు హడావిడి మొదలైంది. ఇందుకోసం మండలంలో పోటాపోటీగా కోడిపందాలు ఆడేందుకు బరులు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష పార్టీ నేతలు కూడా మాకంటే మాకంటూ బరులు కోసం శతవిధాల పోలీసులు దగ్గర పర్మిషన్ కోసం పరుగులు పెడుతున్నారు. అయితే ఇప్పటికే జాతీయ రహదారి పక్కనే ఉన్నటువంటి చోడవరం గ్రామ సమీపంలో తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో అక్కడ బిరి ఏర్పాటు చేసేందుకు పందెం రాయుళ్లు సిద్ధమయ్యారు. పోలీసుల అనుమతి రాకముందే బరులు సిద్ధం చేసి అందుకు తగిన ఏర్పాట్లు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. డోజర్లతో నేలను చదును చేసి చుట్టూ కంచెలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.అయితే తెలంగాణ ఆంధ్ర సరిహద్దు ప్రాంతం కావడంతో తెలంగాణ నుంచి ఆంధ్ర సరిహద్దు ప్రాంతానికి పందెం రాయుళ్ళు ఎక్కువగా రానున్నారనే సమాచారంతో సరిహద్దు ప్రాంతమైన గుండాల వద్ద కూటమికి చెందిన ఓ పార్టీ నేతలు బిరిని సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా చోడవరం దగ్గర మరో బరి, సిద్ధం నల్లగుంట గ్రామం వద్ద మరో బరి సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఈ ఏడాది అధికార పార్టీ నేతల హడావిడి ఎక్కువ అవటం, మేము బరులు ఇప్పిస్తున్నామంటూ పోలీసులు దగ్గర ఒత్తిడి చేయడం పార్టీ నేతలు సందడి ఇప్పటినుంచే మొదలైంది. ఇదిలా ఉంటే కోడిపందాల బరులు వద్ద మద్యం గుండాట పేకాట తదితర ఈవెంట్లు ఏర్పాటు కోసం కూడా పోటా పోటీగా అనుమతులు కోసం ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. వీటన్నిటికీ పందెం రాయుళ్ల ఆర్గనైజింగ్ కమిటీ వెనుక అధికార పార్టీ నేతలు అండదండలు ఉండటమే కారణమని మరోపక్క ప్రతిపక్ష పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఏదేమైనాప్పటికీ సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు కోడిపందాలు సజావుగా సాగుతాయని, ఇందుకోసం కోట్లలో లావాదేవీలు జరుగుతాయంటూ ఇప్పటికే ప్రచారం సాగుతుంది. పోలీసులు మాత్రం అలాంటివి ఏమీ జరగవు అసలు పందాలే నిర్వహణను అడ్డుకుంటామంటూ చెప్పటం గమనార్హం.

# ప్రగతి లో మూడవ రోజు స్ట్రైడ్స్ 2కె26 నిర్వహణ




**గండేపల్లి (మనసులో మాట) జనవరి 9..** గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రైడ్స్ 2026 మూడవ రోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఎస్ఇ విభాగం వారి ఎప్రోజైన్ కు డావిల్ సుమలత,మాజీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డా టి శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సిఎస్సి ఎన్ సుమతి, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇఇఇ జెఎన్టియుకె లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా విచ్చేశారని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికను పెంపొందిచుకునే విధంగా పరిశోధనా దృక్పధాన్ని అలవరచుకోవడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ముఖ్య అతిధులు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు క్వాంటం కంప్యూటర్ టెక్నాలజీలను వంటి అధునాతన టెక్నాలజీలను అన్ని విభాగాల విద్యార్థులు నేర్చుకుని పోటీ సమాజంలో పెను సవాళ్లను ఎదుర్కోవడమే సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథబాబు,వైస్ ప్రెసిడెంట్ ఎమ్ సతీష్,జి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆరమిల్లి ఆధ్వర్యంలో వార్డుల్లో సంక్రాంతి సంబరాలు




**తణుకు జనవరి 9 (మనసులో మాట)..** తణుకు 10వ. సచివాలయం పరిది లోని 20వ.వార్డ్ నందు ఎమ్మెల్యే అరిమిల్లి రాధా కృష్ణ ఆదేశాలు మేరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కు ముగ్గులు పోటీలో గెలుపొందిన వార్కి 1,2, 3, 4,5స్థానాలు మిగతా 15మందికి బహుమతులు అందజేశారు. వార్డ్ ఇంచార్జి తాతపూడి మారుతీరావు, పట్టణ తెలుగుదేశం కోశాధి కారి గమినిరాము, వార్డ్ కార్యదర్శి విత్తనాల సాయి, బూత్ ఇంఛార్జ్ త్రాసులు నాని, జడ్డుహరి, బీజేపీ నాయుకురాలు కామర్సు కిరణ్మియి, సచ్చాలయం సిబ్బంది, ఆరపీలు శ్రీదేవి, శేష్ వాణి లు పోల్గని నియోజక్వర్గ స్థాయి పోటీలో ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, గాలిపటలు, ఎగర వెయడం, బోగిమాంటలు వశీటలు పోటీలు హరిదాసులు కళా పోటీలు వచ్చి తణుకు బాయ్స్ హైస్కూల్ నందు మధ్యాహ్నం 2గంటలు నుండి జరుగుతాయని మారుతీరావు రాము పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయాలు కొనసాగించాలి అని ఆయన అన్నారు.



# ఇప్పటి వరకూ ఒక లెక్క ఇక నుంచి మరొక లెక్క

- పార్టీ పట్ల నిస్వార్థ సేవే మన నిజమైన ఆస్తి
- 'తెలుగు' మహిళల అభినందన సత్కర సభలో ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9: తెలుగుదేశం పార్టీ మహిళలను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఇటీవల భవానీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని 42 డివిజన్లలో నిర్వహించిన ముగ్గుల పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఆ పోటీల్లో పారదర్శకంగా.. వివాద రహితంగా జడ్జిమెంట్ ఇచ్చిన తెలుగు మహిళలను ఈ రోజు శ్రీకన్య గ్రాండ్ లో నిర్వహించిన మీడియా సమావేశం అనంతరం శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల సాధనలో తమ అంకితభావం, నిబద్ధత, ధైర్యంతో ముందుకు సాగుతున్న మహిళా నాయకులను ఆయన ప్రశంసించారు. జడ్జిమెంట్ ఇవ్వడం కంటే, అది ఇచ్చిన తర్వాత వచ్చే విమర్శలు, పొగడ్తలు, అవమానాలు అన్నింటినీ అధిగమించి సేవ చేయడం పెద్ద విషయం అని అన్నారు. ఇలాంటి మహిళా నాయకులు మన పార్టీకి నిజమైన సంపద అని ఎమ్మెల్యే వాసు అభివర్ణించారు. ప్రతి కార్యకర్త కృషిని గుర్తించాలని, ఎవరి గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నాను అన్నారు. ఇలాంటి నిబద్ధత ఉన్నంత వరకు టీడీపీ ఒక్క రాజమండ్రి లోనే కాదు..ఎక్కడా ఓడిపోదు అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక కృతజ్ఞతలతో మహిళా నేతలను శాలువాలు కప్పి సత్కరించారు. కొంతమంది డైరెక్టర్లుగా ఉన్నారని, ఇంకొందరికి పదవులు రావాల్సి ఉందన్నారు. అందరినీ గుర్తిస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరొక లెక్క అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ సందర్భంగా వారిని ఉత్సాహ పరిచారు.

# రైతులకు రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలు పంపిణీ



**కిర్లంపూడి (మనసులో మాట) జనవరి 9..** మీ సొంత భూమి పాస్ బుక్ పై ఎవరో ఫోటో లేకుండా మీ ఫోటో తో అది కూడా రాజముద్రతో కూటమి ప్రభుత్వం రైతుకు సర్వహక్కులతో అందిస్తుందని ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా రాజముద్ర తో కూడిన పట్టా పాసు బుక్కులను రైతులకు పంపిణీ చేశారు. భూ రికార్డుల ట్యాపరింగ్ ఒకరు భూమి మరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేసుకోవడం వంటి అక్రమాలకు తావు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. అనంతరం కూటమి ఆయన మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలపై రాజకీయ నాయకులు ఫోటోలు ఉండకూడదని ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అధికార రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు ముద్రించిందని అన్నారు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ పాస్ పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి భూమి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. రైతులు పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పని లేకుండా సమీపంలోని గ్రామ వార్డు సచివాలయంలో పొందవచ్చని అన్నారు అనంతరం రైతులకు పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఎస్ ఎస్ అప్పలరాజు, ఎంపీపీ తోట రవి, వీరం రెడ్డి కాశిబాబు, కొత్త కొండబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, చదరం చంటిబాబు, సర్పంచ్ జ్యోతుల సీతామహాలక్ష్మి, జంపన రవి వర్మ, పాఠం శెట్టి మురళీకృష్ణ, మంచి కంటి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల కోటేశ్వరరావు,సూతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### జగ్గంపేటలో భారత మొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలు



జగ్గంపేట (మనసులో మాట) జనవరి 9 భారత దేశ మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలు జగ్గంపేట మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వక్ఫ్ బోర్డ్స్ మాజీ చైర్మన్ ఎస్ఏ గఫూర్ హాజరై ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి మహిళలు విద్యార్థికి కృషి చేశారని ఆమెను ఆదర్శంగా తీసుకుని పలువురు మహిళలు ఉన్నత చదువులు చదువుకుని టీచర్లుగా ఉద్యోగాలు పొందారని ఆమె సేవలను కొని ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంటు షేక్ ఆరిఫ్, షేక్ సలీమ్, ఖాజా. ఇబ్రహీం. మహబూబ్ జానీ. దాదా. బాబు, మస్జిద్ గురువు, పాల్గొన్నారు.



## 11తేది న న్యూ సెంచురీ పాఠశాల రజతోత్సవ వేడుకలు

**కాకినాడ (మనసులో మాట) జనవరి 9..** కాకినాడ నగరంలో 1999 సంవత్సరంలో ప్రారంభించిన న్యూ సెంచురీ స్కూల్ 25 సంవత్సరాల రజతోత్సవాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్నది. ఈ సందర్భంగా 11 వ తేదీ ఆదివారం రోజున న్యూ సెంచురీ స్కూల్ ఆవరణలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ వెంకట్ యం తెలిపారు. 11న స్కూల్లో జరగనున్న వేడుకలను పురస్కరించుకొని శు క్రవారం పాఠశాల ఆవరణలో విలేకరులకు వివరించారు. వెంకట్ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా 1999లో ప్రతి ఒక్కరూ చదువుతోనే ప్రయోజకులు అవుతారని దానిని గ్రహించి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో స్కూల్ ప్రారంభించినట్లు చెప్పారు. ప్రారంభించిన అనతి కాలంలోనే స్కూలు దినదిన అభివృద్ధి చెందుతూ ఎంతో మంది విద్యార్థులను వివిధ హోదాల్లో ఉద్యోగాలలో నిలబెట్టిన ఘనత న్యూ సెంచురీకే దక్కుతుందని వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్కూలు ఆవరణలో 25 ఏళ్ల క్రితం నుంచి స్కూల్లో చదివి వివిధ హోదాల్లో ఉండి విదేశాల్లో స్థిరపడి ప్రయోజకులైన విద్యార్థులు అందరూ వస్తున్నారని రావడానికి వీలుపడని వారందరికీ తాను శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు. అకాడమిక్ డైరెక్టర్ వాడపల్లి తేజస్వి మాట్లాడుతూ స్కూల్లో విద్యాబుద్ధులతో పాటుగా యోగా, స్కేటింగ్, కరాటే వంటి వాటివి నేర్పుతామని అలాగే ఫ్రెంచ్ బాషలో కూడా తర్ఫీదిస్తామన్నారు. అకడమిక్ కో- ఆర్డినేటర్ నల్లా శ్రీదేవి మాట్లాడుతూ 25 ఏళ్లుగా విలువలు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని ఇప్పుడు ఆ విద్యార్థులు వివిధ హోదాల్లో అగ్రస్థానంలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా ఆహ్వానిస్తున్నానని ఆహ్వానం అందని వారు వచ్చి స్కూల్ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని వెంకట్, తేజస్వి, శ్రీదేవిలు కోరారు.

### కాకినాడ ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఎనిమిదవ వేతన సిఫార్సును అందరికీ అమలు చేయాలని

## ఉద్యోగులు ధర్నా




**కాకినాడ (మనసులో మాట) జనవరి 9..** ఎన్ సి సి. పి.ఎ పిలుపు ననుసరించి కాకినాడ ప్రధాన తపాల కార్యాలయం మరియు బి ఎస్.ఎన్ ఎల్ ఆఫీస్ వద్ద శు క్రవారం ధర్నా జరిగినది ముఖ్యంగా 1పెన్షన్ క్లాజు రద్దు చేయాలి2)8వ పే కమిషన్ లో టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ మార్చి ఇప్పుడున్న ఓల్డ్ పెన్షనర్స్ కు బిఎస్ఎన్ఎల్ అండ్ ఎం.టి.ఎన్.ఎల్ పెన్షన్ అందరికీ వేతన సంఘం సిఫార్సులు అందరికీ అమలుపరచాలి(3)8వ వేతన సంఘం ఏరియర్స్ ని జనవరి1 తేది నుండి వర్తింప చేయాలనే డిమాండ్స్ సాధనకు ఉద్యోగులు ధర్నా చేశారు. కాకినాడ డిస్ట్రిక్ట్ ఫార్మ్ ఆఫ్ సివిల్ పెన్షనర్ అసోసియేషన్ చైర్మన్ మహేశ్వర రావు బిఎస్ఎన్ఎల్ కన్వీనర్ తురగా సూర్యారావు అండ్ ఏఐపిఆర్పిఎ కార్యదర్శి ఫైనాన్స్ కార్యదర్శి డిఎల్ఎన్ శాస్త్రి రాష్ట్రీయ సంచారనిగం బిఎస్ఎన్ఎల్ అండ్ ఆల్ ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జీవీ లక్ష్మీనారాయణ ఫైనాన్స్ కార్యదర్శి సిహెచ్ రామారావు కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమాఖ్య జనరల్ కార్యదర్శి ఎస్వీ ఎన్ ఎస్ సాయిరాం నాయకత్వం వహించారు. పోస్టల్ పెన్షనర్స్ బీఎస్ఎన్ పెన్సనర్స్ ఉద్యోగులు పాల్గొన్నారు

## మహిళలు పేదరికం లేని సమాజం కోసం విజన్ కలిగి ఉండాలి



**అయినవిల్లి (మనసులో మాట) జనవరి 9 :**మహిళలు అన్ని రంగాల్లో ముందుండి పేదరికం లేని సమాజం కోసం విజన్ కలిగి ఉండాలని డిఆర్డిఏ ఏపిఎం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం అయినవిల్లి మండలం తొత్తరమూడి మహిళా సమైక్య కార్యాలయంలో విజన్ 2మాడ్యూల్ పై శిక్షణ ఇచ్చారు. మండలంలో ఉన్న మహిళా సంఘాలు రానున్న ఐదేళ్లలో మహిళల ఆర్థికంగా ఎదగడానికి ఎదురయ్యే అడ్డంకులను అధిగమించడానికి ప్రణాళికలు తయారు చేసుకునే విధానంపై శిక్షణ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. కుటుంబం వ్యక్తిగత కళలను సహకారం చేసుకునే విధంగా మహిళలు ముందడుగు వేయాలన్నారు. వైద్యం ,విద్య ఆరోగ్యం జీవనోపాధి మహిళా వసతులు జెండర్ వ్యవసాయం పశు సంపద వంటి కార్యక్రమాలు మెరుగుపరుచుకోడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి సత్యవతి కోశాధికారి పి ప్రశాంతి సిసి వెంకటలక్ష్మి నర్సా మని అకౌంటెంట్ దుర్గ భవాని విఓఏలు పాల్గొన్నారు.

### సగర పేటలో మండల ప్రజా పరిషత్ మోడల్ స్కూల్ లో

# సంక్రాంతి సంబరాలు

### కంప్యూటర్ రూము, సర్వేపల్లి రాధాకృష్ణ భవనంలో అదనపు తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 9..** జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామపంచాయతీ లోని సగర పేట మండల ప్రజాపరిషత్ మోడల్ పాఠశాలలో పల్లెపండుగ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, హరిదాసులు, పిండి వంటలు అన్ని రకాల కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కంప్యూటర్ రూమ్, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం బ్లాకులను ఎమ్మెల్యే నెహ్రూ ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధి కృషి చేసిన పడాల వీర వెంకట సత్యనారాయణ (పి వీ మాస్టారు) ఇతర ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ పి వీ మాస్టర్ కృషితో ఈ స్కూలు ఎంతో అభివృద్ధి చెందిందని గ్రామస్తులు సహకారంతో కంప్యూటర్స్ రూమ్ ఏర్పాటు చేసుకోవడం, పాఠశాలకు కావలసిన అదనపు అంగులను నిర్వహించుకోవడం జరిగిందని ఇదేవిధంగా మండలంలోని అన్ని పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గ్రామస్తులు 50% సహకారం అందిస్తే మిగిలిన 50% జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, మురళి రాజు,పి. బాలనాగు, సర్పంచ్ చీపురుపల్లి రాఘవ, రాయుడు గోవిందు, పడాల రాంబాబు, పడాల బాలాజీ, చిత్రపు బాబు, శేఖర్ రాజు, ఎండిఓ చంద్రశేఖర్, ఎమ్మార్వో రమేష్, సిడిపిఓ పూర్ణిమ, చింతాకుల ఈశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ నాగదేవి, నక్క వెంకటేష్, ములికి శివకుమార్, గండికోట రామస్వామి, తంగెళ్ల నాగరాజు, ఎడల చిరంజీవి, నక్క పెద్ద వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9:** ఈ విద్యా సంవత్సరం నుండి ఫౌండేషన్ స్కూల్ గా రూపాంతరం చెందిన స్థానిక రాజేంద్ర నగర్ నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల (సీతారామ్ పేట)లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాల, రాజేంద్రనగర్ – 1, అంగన్ వాడీ కేంద్రం, రాజేంద్ర నగర్ – 3 అంగన్ వాడీ కేంద్రం పిల్లలు, వారి తల్లిదండ్రులతో పాటు ముఖ్య అతిథులుగా తెలుగుదేశం రాష్ట్ర నేత, 4వ వార్డు ఇన్చార్జ్ నక్కా చిట్టిబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ యు పద్మ, సూపర్వైజర్ బేబీ రాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ తమ పిల్లల్ని అంగన్వాడీ కేంద్రంలో చదివిస్తున్న తల్లిదండ్రులను అభినందిస్తూ అంగన్వాడీ విద్య పూర్తయిన వెంటనే ఒకటవ తరగతి ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే జాయిన్ చేయాలని సూచిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా రంగానికి ఉన్న తేడా ఈ సందర్భంగా ఆయన వివరించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ యు పద్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు విద్యను నేర్పే విధానాన్ని ఆమె వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ తాను తన పిల్లలని ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నానని, తన పిల్లలు డాన్స్, విద్యలోనూ అదే విధంగా క్రీడల్లోనూ కూడా మొదటి స్థానంలో నిలుస్తూ వస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నేర్చుకునే విద్య వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసిక శారీరక ఆరోగ్యంతో ఎదుగుతారని తెలిపారు. అనంతరం రాష్ట్ర టీడీపీ రాష్ట్ర నాయకుడు నక్క చిట్టిబాబు భోగి మంటను వెలిగించారు. వార్డు సభ్యులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. చివరిగా విద్యార్థులకు భోగి పండ్లు పోసి విద్యార్థులకు, అదే విధంగా ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.

## జన్మదిన వేడుకలో డాక్టర్ శేషగిరిరావు కు అభినందనలు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 9..** అరుణ హాస్పటల్ అధినేత డాక్టర్ చవ్వాకుల శేషగిరిరావు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కాకినాడ జిల్లా గ్రామీణ వైద్య నాయకులు స్నేహితులు శ్రేయోభిలాషులు గాంధీనగర్ అరుణ హాస్పిటల్ నందు కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా అధ్యక్షులు కొమ్మన తాతారావు గంగనాపల్లి గ్రామ వార్డ్ మెంబర్ తడాల వెంకటరత్నం (అబ్బు) జనసేన పార్టీ నాయకులు గ్రామీణ వైద్య నాయకులు కాజులూరు కరప మండలాల అధ్యక్షులు కే వి వి సూర్యనారాయణ మూర్తి కార్యదర్శి ఆర్ వినయ్ కుమార్ తేజస్విని ఫార్మా సూటికల్స్ కాకినాడ అధినేత కొమ్మన సతీష్ అధిక సంఖ్యలో స్నేహితులు శ్రేయోభిలాషులు మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొని శేషగిరిరావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు సీనియర్ నాయకులు కేఎస్ఎన్ బాబు మాట్లాడుతూ మారుమూల పల్లె ప్రాంతాలలో మరియు గిరిజన ప్రాంతాలలో ఎన్నో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు వైద్య సేవలు మరియు ఉచిత మందులు పంపిణీ చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచినారు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని వారికి నిండు నూరేళ్లు ఆయురారోగ్యం కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం గ్రామీణ వైద్యులు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయటానికి ఎప్పుడు తోడుగా ఉంటామని తెలిపారు.

## వీరేశ్వర స్వామిని దర్శించుకున్న పంచాయితీ రాజ్ ఉద్యోగులు



**ఐ. పోలవరం, ( మనసులో మాట) డిసెంబర్ 9..** ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ శాఖ క్షేత్ర స్థాయి పరిశీలనా బృందం శుక్రవారం మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆలయం లో ప్రత్యేక పూజలు జరిపారు. ప్రభుత్వం ఆదేశాలు మేరకు 5 జిల్లాల నుండి సుమారు 30 మంది గెజిటెడ్ అధికారుల పర్యటనలో భాగంగా విస్తరణ శిక్షణ కేంద్రం సామర్లకోట నుండి జిల్లాలో పలు ప్రఖ్యాతి ఆలయాలు సందర్శిస్తున్నట్లు టీమ్ లీడర్ రాజశ్రీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. క్షేత్ర విశిష్టత అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కరపత్రాలు, ప్రసాదం దేవస్థానం తరపున అందజేశారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి. సత్యనారాయణ ఏర్పాట్లు పరిశీలించారు.

### హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో

# ఘనంగా సంక్రాంతి సంబరాలు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 9..** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక గైగోలపాడు హై స్కూల్ లో ముగ్గుల పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మి నాగేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 200 కి పైగా చిన్నారులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ముగ్గుల పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలను ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందివ్వడం జరిగిందని, మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు, సంస్థ సర్టిఫికేట్స్ అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు మాట్లాడుతూ, ఇంత గొప్ప కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వడం చాలా ఆనందంగా ఉందని, అధిక సంఖ్యలో యువతులు, చిన్నారులు చాలా ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేయడం, ఆట పాటలతో అలరించడం గొప్ప విషయం అని, మన సంస్కృతి సాంప్రదాయాలు మరుగున పడిపోకుండా కాపాడుకోవాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన సంస్థ అధ్యక్షులు లక్ష్మి నాగేంద్ర సేవలు అభినందనీయమని కొనియాడారు. ఎక్స్ సర్వీస్మెన్ కాకినాడ ట్రై సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ రామరావు మాట్లాడుతూ, ఎంతో ఓర్పుతో సహనంతో ఇంత మంది చేత కార్యక్రమాన్ని నిర్వహించిన నాగేంద్ర ని వారి సంస్థ సభ్యులను, అదేవిధంగా న్యాయ నిర్ణేతలుగా విచ్చేసినటు వంటి చంద్రిక, స్వాతి, దీపికా, రేవతి, హేమలత, ప్రమీల,సావిత్రి సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేసి ఏ ఒక్కరినీ నిరాస పరచుకుండా దిగ్విజయంగా కార్యక్రమం నిర్వహించడం మామూలు విషయం కాదంటూ సంస్థ సభ్యులను కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు చల్లారావు మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ గారుఅట్లాడుతూ, అందరూ ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని, విజేతలను నిర్ణయించడం చాలా కష్ట తరంగా మారిందని, అందరూ అంత బాగా ముగ్గులు వేశారని అన్నారు. ఒకనాటి పూర్వ వైభవం మళ్ళీ తిరిగి చూస్తున్నట్టు అనిపిస్తుంది. సమయమే లేకుండా మొబైల్ ఫోన్ లకు అతుక్కుపోతున్న ఈరోజుల్లో ఇంత మంది యువతులు,చిన్నారులు పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు, ఎక్స్ సర్వీస్మెన్ మరియు కాకినాడ ట్రై సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ రామరావు, ప్రధానోపాధ్యాయులు చల్లారావు, ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ, సోషల్ వర్కర్ చిన్న బాబు, సంస్థ అధ్యక్షులు లక్ష్మి నాగేంద్ర, సభ్యులు చంద్రిక, స్వాతి, దీపికా, రేవతి, హేమలత, ప్రమీల,సావిత్రి తదితరులు పాల్గొనడం జరిగింది.



## శ్రీప్రజ్ఞ లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

### - విజేతలకు బహుమతి ప్రధానం చేసిన జీనుమణి బాబు

**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 09..** సంక్రాంతి సంబరాలలో భాగంగా జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థల ఆవరణలో ఛైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు జగ్గంపేట టీడీపీ మండల అధ్యక్షుడు,జేవిఆర్ గ్రూప్స్ అధినేత జీను మణిబాబు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న మన సంస్కృతి,సాంప్రదాయ పండుగలను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని,విద్యార్థులు సంక్రాంతి పండుగ ను కుటుంబ సభ్యులతో ఆనందం గా జరుపుకోవాలని ,ముగ్గుల పోటీలు నిర్వహించడం ద్వారా మహిళల్లో ఐక్యతను, సృజనాత్మకను చాటవచ్చని తెలిపారు.హరిదాసుల వేషధారణ, బోగి మంటలు,చిన్నారులకు భోగి పళ్ళు పోసి ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా ఈర్లి చిన్ని,నీలం దేవి,కొండేపూడి సుమంజలి నిలిచారు.విద్యార్థుల ముగ్గుల పోటీల్లో కొల్లు జాహ్నవి,కాకినాడ అఖిల,సుమతి బహుమతులు గెలుచుకున్నారు చిన్నారుల సాంస్కృతిక నృత్య రూపకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత, కాలేజ్ ప్రిన్సిపాల్ కె అభి, స్కూల్ ప్రిన్సిపాల్ అడపా సాయి దీప్తి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ తోట నాగలక్ష్మి, ఇంచార్జీ కొల్లా శ్రీనివాస్,పులిగ పవన్, అడపా ఆనంద్ , బాలిన అరుణ దేవి, శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మరుగుదొడ్లు వెంటనే ఏర్పాటు చేయాలి



**నిడదవోలు జనవరి 9 (మనసులో మాట)..** స్పెషల్ గ్రేడ్ నిడదవోలు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల కోసం మరుగు దొడ్లు వెంటనే ఏర్పాటు చెయ్యాలని నిడదవోలు పట్టణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు.50వేలు జనాభా 28వార్డులు ల్లో నిరంతరం పారిశుధ్యం పనులు నిర్వహిస్తున్న సుమారు 150మంది కార్మికులకు ఉద్యోగులకు మస్తర్ సమయంలో మరుగుదొడ్లు లేక ముఖ్యం గా మహిళా కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అంటూ వజ్రోత్సవాలు పేరుతో మున్సిపల్ కార్యాలయంలో మరమ్మత్తుల పేరుతో అనాలోచితంగా సిబ్బంది ఉపయోగించుకొనే మరుగు దొడ్లుకు వెళ్ళటానికి వీలు లేకుండా అడ్డంగా సెంట్రల్ జైల్ గోడ అంత కట్టి మూసివెయ్యటం అమానవీయం ఐదు సంవత్సరాల నుండి లేని ఇబ్బంది వాస్తు ఇబ్బంది ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ కమిషనర్. కౌన్సిల్ కి ఎందుకు వచ్చిందని? రాంబాబు ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు మున్సిపల్ పాలన కిందకు రారా?, వాళ్లేమైన బానిసలా అంటూ రాంబాబు ప్రశ్నించారు. అధికారం ఉందికదా అని ఇష్టం వచ్చినట్లు చేస్తే ఊరుకునేది లేదని ఎందుకు అంతరం పెంచారని పారిశుధ్య కార్మికులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ముందు చూపు లేకుండా కార్మికులకు ప్రత్యామ్నాయం చూపకుండా అడ్డుకట్టవెయ్యటం అమానవీయం అని రాంబాబు విమర్శించారు. ఎందుకు అడ్డు గోడ నిర్మించారో పాలక పక్షం సమాధానంచెప్పాలని డిమాండ్ చేశారు వెంటనే మరుగు దొడ్లు నిర్మించకపోతే పనులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తామని రాంబాబు హెచ్చరించారు.

## సంక్రాంతి ఆనందాలు ప్రతి ఇంటికి చేరాలి

### - ప్రిన్సిపాల్ డా. డి సునీత



**ఏలేశ్వరం( మనసులో మాట) జనవర్ 9..** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో సంక్రాంతి సంబరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. సునీత అద్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో భోగి మంటలు వేసి ఈ సందర్భంగా ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. రంగోలి, గాలి పటాలు, సాంప్రదాయ వస్త్రధారణ, పిండివంటల తయారీ ముగ్గులు మొదలలైన పోటీలు నిర్వహించి విజేతలకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణమంత సంక్రాంతి ఆటపాటలతో విద్యార్ధులు సందడి చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ డా. డి . సునీత విద్యార్డులను ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రాంతి అనేది మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే మహత్తర పండుగని అన్నారు . రైతుల కష్టానికి ఫలితం దక్కే ఈ పండుగ మన జీవితాల్లో ఆనందం, సౌభాగ్యం, ఐక్యతను నింపుతుందని . భోగి, సంక్రాంతి, కనుమల ద్వారా కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడే తత్వం, నైతిక విలువలను అలవర్చుకొని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని కోరారు . అందరికీ ఆరోగ్యం, శాంతి, సంతోషం, అభివృద్ధిని ప్రసాదించాలని ఈ సంక్రాంతి దేవుని ఆశీస్సులతో నిండివుండాలని కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు , విద్యార్థులకు , సిబ్బందికి , తల్లిదండ్రులకు మరియు ప్రజలందరికీ హృదయ పూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. వేంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ అధ్యాపకులు వి రామరావు , కె. సురేష్. డా. శివప్రసాద్. వీరభద్ర రావు డా. ఎస్కే మదీనా, శ్రీలక్ష్మి,డా. కె బంగార్రాజు,మేరి రొసిలిన, పుష్పా , సతీశ్ మరియు అధ్యాపకేత సిబ్బంది సత్యనారాయణ , ధర్మ రాజు , దివ్య,రామలక్ష్మి కమల, కళావతి , పెద్ద సంఖ్యలో విద్యార్ధిని విద్యార్డులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర ప్రజా దర్బార్**

**కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ)**

కాకినాడ (మనసులో మాట) జనవరి 9 కాకినాడ రూరల్ నియోజకవర్గం కొవ్వాడ సెంటర్‌లో ఉన్నా ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమం కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీ రథసారథి నారా లోకేష్ బాబు కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ప్రతి వారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కటకంశెట్టి ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇల్లు పట్టాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పెన్షన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, సీఎంఆర్ఎఫ్, చంద్రన్న బీమా తదితర సమస్యల పరిష్కారం కోసం మొత్తం 124 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, కొవ్వాడ గ్రామ సర్పంచ్ కోటిపల్లి ఉమా, జనసేన వీర మహిళ శాంతి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కౌజు నెహ్రు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు దూల సత్యనారాయణ, దంగేటి రమణ, చెరుకూరి వెంకట్రావు, మరల నరేష్, పసల సురేష్, ఆవాల వెంకట్రావు, గుడాల లోవరాజు, రాయుడు రమణ, నురుకుర్తి శ్రీను, రుతల రవి, బొడ్డు అప్పారావు, కాదా చిన్న, నక్క శ్రీను, జనసేన నాయకులు వేమగిరి రవి కిరణ్, గాడపాటి రాజా, పిల్లి వీరభద్రరావు, దాసరి దొరబాబు, మందరపు చిట్టిబాబు, బాబురావు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ లోఅంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు



ఐ .పోలవరం,( మనసులో మాట) డిసెంబర్ 9. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని చదువులో సరస్వతి నిలయంగా ప్రఖ్యాతగాంచిన మురమళ్ళ శాంతినికేతన్ హై స్కూల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. సంక్రాంతి ప్రభలు.... గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు నామ సంకీర్తనలు..... గ్రామీణ ప్రాంత కోడిపందాలు...... ఉట్టి కొట్టడం..... విద్యార్థుల కేరింతలు...విద్యార్థులు డాన్సులు జోష్ నింపాయి... ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది క్రమం తప్పకుండా సంస్కృతి, సాంప్రదాయాలను శాంతినికేతన్ విద్యార్థులు ప్రదర్శించారు. ఇంకొక అడుగు ముందుకు వేసి చదువుకున్న సరస్వతి నిలయమైన శాంతినికేతనలో దేశభక్తి, త్యాగనిరతి, అమరులైన వారికి జోహార్లు అర్పించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే మిగతా విద్యాసంస్థల కంటే దీటుగా వారం రోజులు ముందే సంక్రాంతి సందడి మురమళ్ళ శాంతినికేతన్ హైస్కూల్లో అంగరంగ వైభవంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగినవి. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు జరుపుకుంటారు. ఈ ఉత్సవాలకు ప్రవాస భారతీయురాలు శ్రీమతి మోర్త శిరోమణి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. సంక్రాంతి భోగి మకర సంక్రాంతి కనుమ పండుగ గురించి వివరించారు. తన చిన్ననాటి మధుర స్మృతులను తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని మంచి ఉద్యోగాలు పొంది విద్య నేర్చుకున్న శాంతినికేతన్ హై స్కూల్ కు పుట్టిన గడ్డకు పెంచిన తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మరో విశిష్ట అతిథి డాక్టర్ జంధ్యాల సీతారామారావు పాల్గొని చదువుతోపాటు సంస్కారం, వినయం, క్రీడలు, సంస్కృతి సాంప్రదాయాల గురించి తెలియజేశారు. ఈ వేడుకల్లో రకరకాల రంగవల్లులు,ఎడ్లబండ్ల విన్యాసం,కర్రసాము, భోగి పళ్ళు, కోడి పందాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు పాటలు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ప్రభల విన్యాసాలు మొదలైనవి కనులకు విందుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ హై స్కూల్ అధినేతలు గోకవరపు వెంకట రాజు (పెదబాబు) ఆయన సతీమణి శ్రీమతి వీరభద్ర కుమారి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జంధ్యాల ఎల్లారి విజయలక్ష్మి సీతారామారావు, హెడ్మాస్టర్ రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ముగ్గుల పోటీలు...

**అలరించిన విద్యార్థినుల నృత్యాలు అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు దివ్యాంగుల కేంద్రంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు**





తాళ్లరేవు (మనసులో మాట), జనవరి 09: సంక్రాంతి పండుగ సందర్భంగా పలుచోట్ల నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో కళాశాల చైర్మన్ దున్నా జనార్ధనరావు, కరస్పాండెంట్ ప్రగల్లపాటి కనకరాజులు భోగిమంట వెలిగించి శుక్రవారం సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. చిన్నారులకు భోగిపళ్లు వేసారు. విద్యార్థినులు తయారు చేసిన వంటల ప్రదర్శనను తిలకించి ఆయా వంటకాలను రుచిచూసారు. సాంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంట చుట్టూ సంక్రాంతి పాటలకు నృత్యాలు చేసారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసేందుకే ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా రంగవల్లులు, ఫుడ్ ఫెస్టివల్ లో గెలుపొందిన విజేతలకు విప్రో కంపెనీ ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, విజ్ఞపు చలపతిరావులు సంతూర్ కిట్లను అందజేసారు. ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏఓ కొమ్మూరి నాగరత్నమాల, శ్రీకాంత్, గుండు సీత, తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధంగా సీతారామపురంలోని రిలయన్స్ ధీరూబాయి అంబానీ దివ్యాంగుల కేంద్రంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఇంఛార్జ్ ఎంజె గోపాలరావు ఆధ్వర్యంలో దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగవల్లులు, బోగిమంటలు, నృత్యాలలో గెలుపొందిన విజేతలకు వాసవీక్లబ్ ప్రతినిధులు లావణ్య, సీత తదితరులు బహుమతులు అందజేసారు.

**దళిత కవి కుసుమ ధర్మన్న విగ్రహాన్ని**

# గోదావరి గట్టున ఏర్పాటు చేయాలి

**- కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షుడు, మాజీ ఎంపీ హర్షకుమార్**






రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9: తొలి తెలుగు దళిత కవి కుసుమ ధర్మన్న నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని గోదావరి గట్టున ఏర్పాటు చేయాలని కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షుడు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ డిమాండు చేశారు. స్థానిక రాజీవ్‌గాంధీ కళాశాలలోని సమావేశపు హాలులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ కుసుమ ధర్మన్న 1900 సంవత్సరంలో పుట్టి తెలుగు దళిత కవిగా సమాజంలో అణగారిన వర్గాల తరపున తన గళం, కలంతో పోరాడారన్నారు. స్థానిక కోర్లమ్మ పేటలో ఆయన జన్మించారని, ఆ ప్రాంతానికి ధర్మన్న పేరు పెట్టాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. గాంధీ మహాత్ముడు, బీఆర్ అంబేద్కర్ వంటి మహనీయులను రాజమండ్రి తీసుకువచ్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. దళితులకు దేవాలయాలలోకి ప్రవేశం లేని కాలంలో దళితులు దేవాలయ ప్రవేశం చేసేలాగా పోరాటాలు నడిపారన్నారు. మాకొద్దీ నల్లదొరతనం అంటూ నినదించి, నల్లదొరల పెత్తనాన్ని ఎదిరించారన్నారు. దళితులను దేవాలయ ప్రవేశం చేయించారన్న కక్షతో ప్రసాదంలో విషం పెట్టడం కారణంగా కుసుమ ధర్మన్న మరణించారన్నారు. మాకొద్దీ నల్ల దొరతనం, అసుర పురాణం, మద్యపాన నిషేధం, అంటరానితనం వంటి అనేక పుస్తకాలను రచించారని, విద్యుతోనే అభివృద్ధి అని నమ్మి పిఠాపురం రాజావారితో అనేక హరిజన హాస్టల్స్‌ను ఏర్పాటు చేయించారన్నారు. అటువంటి మహనీయ వ్యక్తిని నేటి తరం స్మరించుకునే విధంగా ఆయన పేరును ఆయన నివసించిన ప్రాంతానికి పెట్టాలని, గోదావరి గట్టున విగ్రహం ఏర్పాటుచేయాలని కోరారు. కుసుమ ధర్మన్న మనుమరాలు కుసుమ రాధా మాట్లాడుతూ గోదావరి గట్టున ఎందరో సాహితీ వేత్తలు, కళాకారులు విగ్రహాలు ఉన్నాయని, వాటి చెంతన ధర్మన్న విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. నాటి అనాగరికతపై పోరాడిన ధర్మన్నను నేటి తరం స్మరించుకునే విధంగా ఆయన స్మృతి చిహ్నంగా విగ్రహం ఏర్పాటు చేయాలని హర్షకుమార్ తండ్రి రాజ్‌కుమార్ కోరారు. విలేకరుల సమావేశంలో కుసుమ బెట్టి పాల్గొన్నారు.

# ఆదిత్య లో అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు



గండేపల్లి.(మనసులో మాట) జనవరి 9.. గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ లో అభినయ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదిత్య విద్యార్థుల రంగవల్లులు,భోగిమంటలు,గాలిపటాలు పందెం కోళ్ళ ఆటపాటలతో సాగిన సంక్రాంతి సంబరాలు ఆదిత్య యూనివర్సిటీ ప్రాంగణంలో మరింత శోభను సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా డా. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి యొక్క విశిష్టత అది మన తెలుగు వారికి ఎందుకు ప్రత్యేకమో విద్యార్థులకు వివరించారు. అందరికీ ఈ సంక్రాంతి ఆనందాల్ని పంచాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి సంబరాలు లో భోగి మంట, కోడి పుంజులు, ఎండ్లబండి, హరిదాసు, బొమ్మల కొలువు, సంప్రదాయ పిండివంటలతో విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్,తదితర కార్యక్రమాలతో ప్రాంగణంలో సంక్రాంతి శోభ ఉట్టిపడింది. ఉయ్యాల జంపాల అంటూ వనితలు ఊగుతూ ఆటపాటలతో గడిపిన ఆనంద క్షణాలు రంగవల్లులు విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ఆటపాటలతో నృత్యాలతో, కోలాటాలతో సాగిన కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా సాగాయి. అనంతరం రంగవల్లులు డాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డా.తెలుగు నీలిమ యాంకరింగ్ కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. ఎం.బి.శ్రీనివాస్,ప్రో. వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ,డా. ఆదిరెడ్డి రమేష్,డా. రవి తంగజం, రిజిస్ట్రార్ డా. జి.సురేష్,డీన్ లు డా. డి. కిషోర్, ప్రో. వి. సత్యనారాయణ వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్‌తో బాధితులకు భరోసా...

**సుమారు రూ.10 లక్షల చెక్కుల పంపిణీ - మాజీ ఎమ్మెల్యే పిల్లి**



కాకినాడ (మనసులో మాట) జనవరి 9.. ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 8 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన సుమారు రూ.10 లక్షల విలువైన చెక్కులను కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాకినాడ రూరల్, కరప మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు తమ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరిశీలన అనంతరం అర్హులైన 8 మందికి సుమారు రూ.10 లక్షల మేర ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకొని పనిచేస్తున్నారని, ముఖ్యంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు చేయూతనిచ్చే విషయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.లబ్ధిదారులు తమ కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మట్టి నమూనా సేకరణ, పరీక్ష విధానాలపై విద్యార్థులకు అవగాహన




జగ్గంపేట (మనసులో మాట) జనవరి 9.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపిక చేసిన పలు స్కూల్స్ మరియు ఉన్నత పాఠశాలల్లో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో మట్టి నమూనా సేకరణ మరియు పరీక్ష విధానాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట సాంఘిక సంక్షేమ పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆత్మ బి.టి.యం. నీలి బాబురావు మట్టి నమూనా సేకరణ మరియు పరీక్ష విధానాలపై అవగాహన కల్పించారు.ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంటలు దిగుబడులు బాగా రావాలంటే ఖచ్చితంగా భూసార పరీక్ష చేయించి సమతుల్య పోషకాలు ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం సేకరించిన మట్టి నమూనా వివరాలను మొబైల్ యాప్ లో ఆన్లైన్ చేసే విధానమును విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ జి శ్రీనివాస్ పాఠశాల హెచ్ ఏం సైన్స్ టీచర్, ఏఈవో మౌళి ,వి ఏ ఏ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు ఇతర టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు

ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 09: సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టి పడేవిధంగా సంక్రాంతి సంబరాలు శుక్రవారం ముమ్మిడివరం శ్రీకృష్ణ దేవరాయ మహిళ జూనియర్ కళాశాల, రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, ఆట పాటలతో అలరించారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో సంతూర్ కాస్మొటిక్ విజయ లక్ష్మీ ఏజన్సీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంప్రదాయ బద్ధంగా కోలాటం నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. తీన్మారు,హరిదాసు సంకీర్తనలు ఆకట్టుకున్నాయి., అనంతరం బోగి మంటలు వేసి ప్రభను ఊరేగించారు. కార్యక్రంలో కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపల్ గంధం శ్రీరామ మూర్తి,జగతా సురేష్,గణేశుల సత్యనారాయణ, సంతూర్ కంపెనీ ప్రతినిధులు ఎ.ఎస్.ఎమ్. కె వెంకటేశ్వరరావు, జె.ఎస్.ఓ. టి.వి.సూర్య నారాయణ, ఐ.ఎస్.ఆర్ కె .ఆనంద కుమార్, డీలర్ ఎన్.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## పల్లెల్లో పెద్ద పండగ వాతావరణం



ఐ. పోలవరం, ( మనసులో మాట) డిసెంబర్ 9.. పల్లెల్లో పెద్ద పండగ వాతావరణం ముందే మొదలైంది. జనవరి వచ్చిందంటే చాలు పట్టణ ప్రజలంతా పల్లెలకు దారితీస్తారు. ఇప్పటికే దాదాపుగా పట్టణ ప్రాంతాలు ఖాళీ అయ్యాయి. ఇకపోతే రానున్న భోగి, సంక్రాంతి, కనుమ పడగలకు పల్లెలు ముస్తాబయ్యాయి. పిల్లాపాపాలతో ఊరంతా సందడి నెలకొంది. చిన్నారులకు భోగి పళ్ళు పోసి పడగ చేస్తున్నారు. పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని వేడుకొంటున్నారు. మురమళ్ల మాణిక్యాంబ నగర్ లో శుక్రవారం పండుగ వాతావరణం కనిపించింది. పిల్లలకు భోగి పళ్ళు పోశారు. గొబ్బెమ్మలు పెట్టి ప్రత్యేక పూజలు చిన్నారులచే చేయించారు. గొబ్బెమ్మలు పాటలు పాడి అలరించారు. సంస్కృతి సంప్రదాయాల గురించి పిల్లకు వివరించారు.

## బొబ్బిలంక హైస్కూల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9: సీతానగరం మండలం బొబ్బిలంక హై స్కూల్ లో సంక్రాంతి సంబరాలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భోగి మంటను అంటించి మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోలిన కృష్ణ సంబరాలను ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులు హరిదాసు వేషధారణ, బుడబుక్కల వారి వేషధారణ, గంగిరెద్దుల వేషధారణ, గొబ్బెమ్మలతో రంగవల్లులు, కోలాటం, తెలుగింటి వేషధారణతో పాఠశాల ప్రాంగణమంతా సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మేరీ మాత, రామకృష్ణ, రామచంద్ర మూర్తి, మహమ్మద్ లాల్ రేష్మ, ఎం పాప రత్నం, వీ సుబ్బలక్ష్మి, సింగారావు తదితరులు పాల్గొన్నారు.

## హార్వెస్ట్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు..



పిఠాపురం, ( మనసులో మాట) జనవరి 9: పిఠాపురం పట్టణంలోని హార్వెస్ట్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో సంక్రాంతి సాంప్రదయాలు ఉట్టిపడేలా భోగి మంటలు వేశారు. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు హరిదాసు వేషధారణ , కిన్నెరసాని, సోదిగత్తె, వంటి వేషధారణలలో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్లు సత్యమోహన్ రెడ్డి, సత్యానంద రెడ్డి లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంక్రాంతి రైతన్నలు జరుపుకునే పండగ అని ప్రతి ఒక్కరికి ఆహారం దొరుకుతుంది అంటే అది రైతుల కృషెనని విద్యార్థులంతా సాంస్కృతి సాంప్రదాయాలకు విలువనిస్తూ సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించారు విద్యార్థులకు కరస్పాండెంట్ల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు పాఠశాల ప్రిన్సిపల్ అనిల్ రవీంద్ర విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు పండుగలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



## వివేకానందలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

### ప్రకృతిని, రైతుని గౌరవించుకొనే పండుగే సంక్రాంతి - ఒమ్మి రఘురామ్

**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 9..** జగ్గంపేట శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించుకొని వేడుకలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ అన్ని పండుగల కన్నా సంక్రాంతి పండుగకు విశిష్ట ప్రాధాన్యత ఉంది అన్నారు. ఈ పండుగ రైతులను, ప్రకృతిని గౌరవించే పండుగ అని, భూమాతకు ధన్యవాదాలు తెలిపే పండుగ అని, సూర్యునికి నమస్కరించుకొనే పండుగ అని అన్నారు. సూర్యుడు ధనస్సు రాశి నుండి మకర రాశి లోనికి ప్రవేశించే కాలం కాబట్టి మకర సంక్రాంతి అని వివరించారు.పండుగ సందర్భంగా జగ్గంపేట పరిసర ప్రాంత ప్రజలకు, తల్లిదండ్రులకు,విద్యార్థినీ విద్యార్థులకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.విద్యా సంస్థ ప్రాంగణంలో పిల్లలతో కలసి భోగీ మంట వేసి మంట చుట్టూ నృత్యాలు చేసి సంబరాలు జరిపారు. పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా స్కూల్ ని అలంకరించారు. గాలిపటాలు ఎగురవేసి కేరింతలు కొట్టారు. హరిదాసు వేషధారణలో 8వ తరగతి విద్యార్థిని లియా ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. హరిదాసు సంకీర్తనాలతో విద్యా సంస్థ ప్రాంగణం మారుమ్రోగింది. పందెం కోళ్ళ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఒమ్మి లక్ష్మి తేజస్వీ,హెడ్ మాస్టర్ పాలిన్ కురియన్,సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లి బిడ్డక్షేమం.. బలమైన ఆహారంతోనే సాధ్యం..

### - మాగులూరి



పల్నాడు, జనవరి 9,(మనసులో మాట): గర్భిణీలకు బలమైన ఆహారం అందించడం ద్వారా పుట్టబోయే బిడ్డ తల్లి క్షేమంగా ఉంటారని 75 తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వలిగొండ రెడ్డి అన్నారు. శుక్రవారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారాన్ని అందించారు. పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించారు. గత ఐదు సంవత్సరాలుగా మాగులూరి ఫౌండేషన్ సేవలు రాష్ట్రం నలుమూలలా విస్తరించాయి. ప్రవాసాంధులు మాగులూరి భాను ప్రకాష్ తన కష్టార్జితంతో కొంత సమాజ సేవ చేద్దామనే ఉద్దేశంతో ఈ సేవ కార్యక్రమాలు చేపట్టారని పలువురు నాయకులు ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి సమాజ సేవకు పాటుపడాలని భాను ప్రకాష్ కాంక్షించారు.

## భావి తరాల కోసమే సంస్కృతి సంప్రదాయాలు



**పెద్దాపురం (మనసులో మాట) జనవరి 10;** భావితరాల కోసం సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గౌడ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ కోరారు. సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ పాఠశాలలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా నిర్వహించారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం, ప్రకృతి పరిరక్షణ కోసం, ప్రాచీన కాలం నుండి భోగి మంటలు, సంక్రాంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని సంక్రాంతి విశిష్టతను హెచ్ఎం సాయిరామకృష్ణ వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్ బలుసు వాసు అధ్యక్షతన భోగిమంటలు, విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక వేడుకలు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పేరుతో నిర్వహించే నాలుగు రోజుల పండగలో ప్రకృతికి, మానవ సమాజానికి ఉన్న అవినామా భావ విశిష్టతను హెచ్ఎం సాయిరామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని,, జ్యోతి శివకుమార్, సుమ శివకుమార్, హరినాథ్,నిర్మల, సుధారాణి ,పద్మావతి, బ్రహ్మానందం, ఉనిషా బేగం, భవిత, దుర్గా, యాదిద్య, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# జేఏసీ నిరసన శిబిరం వద్ద ఉద్రిక్తత

### పార్థసారథి దుందుడుకు చర్యపై పోలీసులకు ఫిర్యాదు - కవ్వింపు చర్యలకు దిగాడని జేఏసీ ఆరోపణ





రాజమహేంద్రవరం, జనవరి 9:వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ నిరసన శిబిరం వద్ద శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. రాజమండ్రి ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు శుక్రవారం కూడా కొనసాగించారు. అయితే ఒక మాస పత్రికకు చెందిన ఎడిటర్ కుడిపూడి పార్థసారథి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న దీక్షా శిబిరంలోని పాత్రికేయులను ఉద్దేశిస్తు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఆగ్రహంతో చూపుడు వేలు చూపిస్తూ రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడని, అలాగే శిబిరం వద్ద కుర్చీని లాగేసి, టేంట్ కర్రను విసురుగా జరిపి..తమపై దూకుడుగా వ్యవహరిస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేసినట్టు జేఏసీ చైర్మన్ చేబోలు రాజు, కన్వీనర్ డీ అబ్రహం లింకన్ తెలిపారు. ఇదంతా పోలీసులు చూస్తుండగానే జరిగిందని, నిరసనలో కూర్చున్న సభ్యులు సంయమనం పాటించడం వల్ల పరిస్థితి సద్దుమణిగిందని చెప్పారు. తొలి రోజు రిలే దీక్షలు జరగకుండా ఈ పార్థసారథి ప్రెస్ క్లబ్ ముఖ ద్వారం వద్ద తినుబండారాల తోపుడు బండిని అడ్డంగా పెట్టించి అడ్డుకోవడానికి యత్నించాడని జేఏసీ ప్రతినిధులు, సభ్యులు తెలిపారు. నిత్యం ఏదో విధంగా వివాదానికి అతను కాలు దువ్వుతున్నాడని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై రెచ్చగొట్టుడు చర్యలకు పాల్పడుతున్నాడని వారు తెలిపారు. పార్థసారథి దూకుడుగా వ్యవహరించిన తీరుపై వీడియో సాక్ష్యాధారాలతో పోలీసు ఉన్నతాధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్టు జేఏసీ చైర్మన్ సీహెచ్ రాజు, కన్వీనర్ డీ అబ్రహం లింకన్ తెలిపారు. ఈ సంఘటన తరువాత జేఏసీ నిరసన శిబిరంలో వర్కింగ్ జర్నలిస్టులు "పార్థసారథి డౌన్ డౌన్.." అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. ఇతని స్వార్థం వల్లే ప్రెస్ క్లబ్ భ్రష్టుపట్టిందని ధ్వజమెత్తారు. స్వయం ప్రకటిత అధ్యక్షుడిగా నిబంధనలకు విరుద్ధంగా, ప్రెస్ క్లబ్ బైలాకు వ్యతిరేకంగా ఏళ్ళ తరబడి పెత్తనం చెలాయిస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రెస్ క్లబ్ ను తన అడ్డాగా చేసుకుని అక్రమార్జనకు పాల్పడుతున్నాడని వారు ఆరోపించారు. కాగా శుక్రవారం జేఏసీ నిరసన శిబిరం వద్ద చోటు చేసుకున్న ఘటన పట్ల ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, జేడీఆర్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో తమ డిమాండ్ల సాధనపై నిరసన వ్యక్తం చేసే హక్కు ఎవరికైనా ఉంటుందని, ఆందోళన చేస్తున్న పాత్రికేయ సోదరులపై రెచ్చగొట్టేలా ఎవరు పాల్పడినా సహించేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

**రెండవ రోజూ కొనసాగిన జేఏసీ రిలే దీక్షలు..**

ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికలు జరగాలని, అప్పటి వరకూ క్లబ్ ను అధికారులు తమ ఆధీనంలోకి తీసుకోవాలని, గత ఆరేడేళ్ళ జమా ఖర్చుల నివేదికలను అధికారులు సత్వరమే స్వాధీనం చేసుకుని పరిశీలించాలని, అర్హులైన పాత్రికేయులు అందరికీ సభ్యులుగా జేర్చుకోవాలని డిమాండు చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండవ రోజుకు చేరాయి. ఈ ఆందోళనకు నగరంలోని పలు సామాజిక సేవా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, నగర ప్రముఖులు తమ సంఘీభావాన్ని తెలుపుతున్నారు. రెండవ రోజు రిలే దీక్షలో పాత్రికేయులు కుడేల్లి రత్నకిషోర్, తోటకూర పురుషోత్తం, జీ గిరీష్ కుమార్ గుప్తా, రమేష్, పిచ్చుక మహేష్ పాల్గొన్నారు. రెండవ రోజు జేఏసీ రిలే దీక్షా శిబిరాన్ని దివాన్ చెరువు తెలుగుదేశం నాయకురాలు, మానవ హక్కుల సంఘం, జిల్లా అధ్యక్షురాలు ఖండవల్లి లక్ష్మి ప్రారంభించారు. దీక్ష చేస్తున్న పాత్రికేయులకు పూలమాలలు వేసి తన మద్దతు ప్రకటించారు. నగర ప్రముఖుడు, సీసీసీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ పంతం కొండలరావు, సీనియర్ జర్నలిస్ట్ వైవీ సత్యనారాయణ, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, రాజమండ్రి అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పిడెంగొయ్యి మాజీ సర్పంచ్, రాజమండ్రి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రొక్కం నాగేశ్వరరావు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వం నిర్ణయం ప్రకారం సభ్యత్వాలు ఇవ్వాలని, ప్రెస్ క్లబ్ ప్రక్షాళనకు కలెక్టర్, జేసీ, ఆర్డీవో, ఐ అండ్ పీఆర్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపించాలని కోరారు. వ్యవస్థకు ప్రధానమైన ఫోర్త్ ఎస్టేట్ యొక్క హక్కులను కాలరాస్తుంటే, సామాన్యుల పరిస్థితి ఏంటనే ప్రశ్న అందరిలోనూ కలుగుతోందన్నారు. ఈ విషయంపై అధికారులు చొరవ చూపించి సమగ్ర విచారణ జరిపించి, త్వరితగతిన న్యాయం చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు డీఏ లింకన్, సీహెచ్ రాజు, పీ రామమూర్తి, వీ రవికుమార్, పీవీ వెంకటేష్, టీ పురుషోత్తం రాజు, ఎస్ కే యాకూబ్, వై నరేష్, కే రత్న కిషోర్, పి మహేష్, ఎం సాయిరాం, డీఏ విశాలాక్షి, ఎస్ఎస్ రాఘవేంద్ర, ఎం సత్యనారాయణ, ఎంవీఎస్ రమేష్, పీ సాయికుమార్, ఎం రామమూర్తి శర్మ (రాంబాబు), కే నాగరాజ్, కే లక్ష్మి, నజీర్, పీ సత్యనారాయణ, ఏ సునీత తదితరులు పాల్గొన్నారు.





## జగ్గన్న తోట ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగగా

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన

**అమలాపురం (మనసులో మాట) జనవరి 9:** సంక్రాంతి పండుగ అంటే మతాలకతీతంగా అన్ని మతస్తుల వారు ఎంతో ఘనంగా ఇంటిల్లిపాదీ పిల్లాపాపలతో నూతన వస్త్రాలు వేసుకుని ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ. సంక్రాంతి మూడు రోజులు జరిగే వేడుకల్లో ప్రభలతీర్థం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి వద్ద జగ్గన్న తోటలో నిర్వహించే ప్రభలతీర్థం పండుగకు కోనసీమకే తలమానికమైన పండుగగా పేరుప్రఖ్యాతలు ఉన్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పండుగకు రాష్ట్ర పండుగగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం పీ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అమలాపురం ఎంపి గంటి హరీష్ బాలయోగి సమక్షంలో సీఎం ప్రకటన చేశారు. ఈ సందర్భంగా పి గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.




# విద్యా వికాసమే సమాజ అభివృద్ధికి పునాది

### - మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి



**రామచంద్రపురం (మనసులోమాట) జనవరి 09..** విద్యా వికాసమే సమాజ అభివృద్ధికి పునాది అన్న నమ్మకంతో తన సర్వస్వాన్ని విద్యార్థుల భవిష్యత్తుకు అంకితం చేసిన మహానుభావుడు కృత్తివెంటి పేర్రాజు పంతులు అని మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంలు కొనియాడారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు 17వ సంస్మరణ దినోత్సవం సభ శుక్రవారం కృత్తివెంటి విద్యా ట్రస్ట్ బోర్డు, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాష్టారు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి తదితరులు పూలమలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య కోసం 96 ఎకరాల భూమిని దానం చేసి చరిత్ర సృష్టించిన ఆ మహనీయుని సంస్మరణ సభను ఘనంగా నిర్వహించడం ఆనందకరమన్నారు. స్వార్థరహితంగా సమాజ హితాన్ని కాంక్షించి చేసిన ఆయన త్యాగం తరతరాలకు ఆదర్శమన్నారు. నేటి తరానికి విద్య ఎంత అవసరమో గుర్తించి, ఆ దిశగా పేర్రాజు పంతులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సిరిగినీడి దుర్గాప్రసాద్, శివరామకష్ణ, బండి స్వామి, నరాల సురేష్, అంపోలు సత్యనారాయణ, కొండపల్లి రవికుమార్, తదితరులు ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు, ట్రస్ట్ లో పనిచేస్తున్న ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ స్టాలిన్, సెక్రటరీ కొవ్వూరి తాతారెడ్డి, ట్రస్ట్ బోర్డు ఈవో సిహెచ్ సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగ శ్రీనివాస్, ఎంఈఓ పి వీర రాఘవరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ చిన్నబ్బాయి, కౌన్సిలర్ కేతా సుజాత,విద్యావేత్త జీవి రావు, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గణేష్ శర్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నారపురెడ్డి బలరాం, వినోద్ చౌదరి, చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, అడ్డూరి వర్మ, నరాల సురేష్, పడాల సూరిబాబు, అంపోలు సత్యనారాయణ, గెద్దం శ్రీనివాస్, కనకాల వెంకటేశ్వరరావు, గన్నమణి చక్రవర్తి , పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ మహనీయుని విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు.



## అంతరించిపోతున్న కళలకు జీవం పోయడమే

## పీఠికాపుర సంక్రాంతి సంబరాలు

# లక్ష్యం...

### - మంత్రి కందుల దుర్గేష్

పిఠాపురం/కాకినాడ (మనసులో మాట )జనవరి 9అంతరించిపోతున్న ప్రాచీన కళలను కాపాడటానికి చేతి వృత్తులను ప్రోత్సహించి మన సాంస్కృతిక వైభవాన్ని పునర్జీవింపజేయడానికే పీఠికాపుర సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. పిఠాపురం నియోజకవర్గం ఓ.బి.ఎస్. మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైన ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో కలిసి మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, నాదెండ్ల మనోహర్, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఈ సంబరాల్లో తోలుబొమ్మలాట, తప్పెటగుళ్ళు, హరికథ, బుర్రకథ, జముకులాట వంటి అరుదైన కళారూపాలను ప్రదర్శించడం ద్వారా మన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నామన్నారు. కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాల స్టాళ్లను ఏర్పాటు చేసి హస్తకళాకారులకు అండగా నిలిచామని తెలిపారు. ప్రపంచ రాజకీయ చరిత్రలో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో జనసేనను గెలిపించి, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు జనసేనాని పవన్ కళ్యాణ్ చేసిన త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. పంచాయతీరాజ్ మంత్రిగా ఒకే రోజు రికార్డు స్థాయిలో గ్రామసభలు నిర్వహించడం, 'పల్లె పండుగ' ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం చేపట్టడం విప్లవాత్మకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన జల్ జీవన్ మిషన్ నిధులను వినియోగించి ఉభయ గోదావరి ప్రకాశం జిల్లాల తాగునీటి కష్టాలను తీర్చేందుకు అమరజీవి జలధర వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు నిడదవోలు నియోజకవర్గం లోని పెరవలి వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చే వేతనాన్ని పిఠాపురంలోని అనాథ పిల్లల సంక్షేమానికి కేటాయించడం పవన్ కళ్యాణ్ సేవా నిరతికి నిదర్శనమని మంత్రి కొనియాడారు. ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో పరిపాలన దక్షుడైన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి సూచనలు దిశానిర్దేశం చేస్తున్నాయని పర్యావరణం మరియు ఎకో టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పేదరికం లేని సమాజం కోసం అందరూ భాగస్వాములు కావాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.పేదవాడి కంట కన్నీరు రాకుండా, పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలని, పేదవాడికి అండగా ఉండాలన్న ఏకైక లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చిన మహా నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. రాజకీయ అధికారమంటే పరపతి ఉన్న వారికి కాదు పేదవారికి చేయూతనివ్వాలని పార్టీని స్థాపించి, పది సంవత్సరాలు మొక్కవోనని ధైర్యంతో పార్టీని నడిపించారు...నడిపిస్తున్నారు అన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో జనసేన శ్రేణులు తలెత్తుకొని నిలబడుతున్నామంటే అందుకు కారణం జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్ అని, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అని అన్నారు. నాడు నియంతృత్వ పాలనను అంత మొందించాలని ఆలోచన చేయకపోయి ఉంటే, కూటమి ఏర్పాటు చేయకపోయి ఉంటే నేడు ప్రజాస్వామ్య పాలన సాధ్యమయ్యేది కాదన్నారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా పయనింపజేయాలన్న ఆలోచనతో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అందరం బలం అందించాలని కోరారు. చేసే ప్రతి కార్యక్రమం ముందుకు తీసుకెళ్లడానికి అందరి సహకారం అవసరమన్నారు. అంతకుముందు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. మంత్రి కందుల దుర్గేష్ స్పీచ్ తో సభా ప్రాంగణమంతా చప్పట్ల తో మారు మోగిపోయింది.





## ఆకట్టుకున్న ఆర్ట్స్ క్రాఫ్ట్ సైన్స్ ఎగ్జిబిషన్



**రామచంద్రపురం (మనసులోమాట) జనవరి 09..** పట్టణంలోని వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు శుక్రవారం ఏర్పాటు చేసిన అర్ట్స్, క్రాఫ్ట్ సైన్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్ కార్యదర్శి, కరస్పాండెంట వి వి రమణ, ప్రిన్సిపాల్ వివిఎస్‌జే లక్ష్మీభాయిల ఆధ్వర్యంలో ఒకటవ తరగతి నుంచి 10వతరగతి వరకు గల విద్యార్థినీ విద్యార్దులు ప్రదర్శనలు వారి నైపుణ్యాన్ని తెలియజేశాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రమణ మాట్లాడుతూ ,చిన్నారు స్వతహాగా తయారు చేసిన ప్రాజెక్టులు వారి సృజనాత్మకతకు అద్దంపట్టాయన్నారు. విద్యార్దులు తయారు చేసిన ప్రదర్శనలు ఆకృతులు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక దశ నుంచి విద్యార్దులు సృజనాత్మకతను వెతికి తీసేందుకు ప్రతీ ఏటా ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శిస్తున్నట్లు రమణ అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్దులు పాల్గొన్నారు.



## దళితులను విస్మరించిన జగన్మోహన్ రెడ్డి

- దళితుల పట్ల వివక్ష చూపిన వైసీపీ ప్రభుత్వం
- డాక్టర్ సుధాకర్ కుటుంబాన్ని ఆదుకున్న కూటమి ప్రభుత్వం
- రూ. కోటి సాయంతో పాటు కుమారుడికి ఉద్యోగం ఇచ్చిన కూటమి
- తణుకులో విలేకరుల సమావేశంలో దళిత సంఘాల నాయకులు

**తణుకు జనవరి 9(మనసులో మాట)..** దళితులను విస్మరించి వారి పట్ల వివక్ష చూపుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిందని తణుకు మార్కెట్ కమిటీ చైర్మన్ కొండేటి శివ తీవ్రంగా విమర్శించారు. కోవిడ్ సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను హింసించి, ఆయన ఆత్మహత్యకు దారితీసిన ఘటన వైసీపీ ప్రభుత్వ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. శుక్రవారం స్థానిక కూటమి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా అమలు అవుతున్నాయని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయానికి గురైన డాక్టర్ సుధాకర్ కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రూ. కోటి ఆర్థిక సాయంతో పాటు సుధాకర్ కుమారుడికి డిప్యూటీ తాసిల్దార్ ఉద్యోగం ఇచ్చి ఆదుకుందని గుర్తు చేశారు. ఇది దళితుల పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. అంతేకాకుండా దళితుల అభ్యున్నతికి ఉపయోగపడే అంబేద్కర్ పేరు మీద అమలులో ఉన్న విదేశీ విద్యా పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేయడం దళిత వ్యతిరేక విధానానికి పరాకాష్ట అని విమర్శించారు. దళితులను ఉద్ధరిస్తానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి పాలనలోనే దళితులు అత్యధికంగా అన్యాయానికి గురయ్యారని ఆరోపించారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు, ఇరగవరం మాజీ జడ్పిటిసి సభ్యులు చుక్కా సాయిబాబు మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన తప్పిదాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టిందన్నారు. వైసీపీ అరాచక పాలన కారణంగా అనేక దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడైన డాక్టర్ సుధాకర్ ఆత్మహత్యకు కారణమైన అప్పటి ప్రభుత్వ తీరును ప్రజలు మరిచిపోరని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వివిధ దళిత సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూట్స్ స్కూల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు




తణుకు జనవరి 9 (మనసులో మాట) తణుకు పట్టణంలోని రూట్స్ స్కూల్ ఆఫ్ ఎఫెన్సియల్ ఫ్యాకల్టీస్ లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వీనుల విందుగా జరిగినట్లు సంస్థ ప్రిన్సిపల్ ఎల్. కె. త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో పుష్పాలతో అద్భుతంగా అలంకరించారు చిట్టి పొట్టి చిన్నారులు అందరూ సంప్రదాయ వస్త్రాలు ధరించి ముగ్గులలో గొబ్బెమ్మలు అలంకరించి గుబ్బిల్లో గొబ్బిల్లో అంటూ పలు కీర్తనలను ఆలపించారు. వివిధ వ్యాసాధారణలతో విద్యార్థిని విద్యార్థులు చూపర్ల అలరించారు. చిన్నారులకు భోగి పళ్ళు ఉత్సవాన్ని నిర్వహించి మన సాంప్రదాయ పిండి వంటలతో మరియు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి అద్భుతమైన అలంకరణలతో చూపరులను ఆకట్టుకున్నారు. కనుమరుగవుతున్న సంస్కృతి సంప్రదాయాలను పండుగ శోభను నేటి తరానికి తెలియజేయడం కోసం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించామని ఇటువంటి సంబరాలను ప్రోత్సహించడం ద్వారా పిల్లలకు పండుగ విశిష్టత తెలియజేసి నట్లు అవుతుందని.. పెద్దలందరికీ బాధ్యత అంటూ స్కూల్ డైరెక్టర్ బి. విద్యాకాంత్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పలు సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సమస్త డైరెక్టర్ ఎల్. కె. త్రిపాఠి, బి. విద్యాకాంత్, ఎన్.సుధాకర్ వర్మ మరియు ప్రైమరీ ప్రిన్సిపల్ టి.సంధ్య, డి. పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# జూదాలకి  ఆట

- ▸▸ కోడి పందేలు బరుల్లో పేకాట, గుండాటలు
- ▸▸ అనధికార ఆటలు... ఆదాయ వనరులు
- ▸▸ జూదాలపై ఉక్కు పాదం మోపుతామంటున్నా పోలీసులు
- ▸▸ ఈసారి గెలుపేవరిది??





ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 09:సంక్రాంతి జూద క్రీడకు సర్వం సన్నద్ధమైంది. కోడి పందేల బరుల్లో ప్రత్యేకంగా పేకాట శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తూ ముందుగానే శిబిరాలను ఖరారు చేసి విక్రయించడానికి వీలుగా అడ్వాన్సులు తీసుకుంటున్నారు. చిన్నపాటి బరుల్లో లక్షతో మొదలై భారీ బరుల్లో కోటిన్నర వరకు ధరకు జూదక్రీడలను ముందుగానే విక్రయిస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం లో పదుల సంఖ్యలో కోడిపందాల బరుల్లో భారీగా పేకాట శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా వంద కోట్లపైన కోడిపందేలు జరిగే అవకాశం ఉండగా.. దానికి రెట్టింపు స్థాయిలో జూదక్రీడలు ఉండటం విశేషం. ఉమ్మడి తూర్పు గోదావరి లో కోడి పందేల బరులు సిద్ధమవుతు న్నాయి. మినీ స్టేడియాలను తలపించేలా అట్టహాసంగా ఏర్పాట్లు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ప్రారంభమయ్యాయి. ప్రధానంగా ముమ్మిడివరం, ఐ. పోలవరం, కాట్రేనికోనలలో అత్యధికంగా కోడిపందేల బరులు ఏర్పాటవు తుండగా తాళ్లరేవు మురముళ్ల, రాజుపాలెం లో భారీగా ఏర్పాటు చేస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం లో అన్ని మండలాల్లో ఉన్న గ్రామాల్లో చిన్నపాటి బరి నుంచి రూ.30 లక్షల వరకు పందేలు నిర్వహించే స్థాయిలో బరులు ఏర్పాటు చేస్తున్నారు. సంప్రదాయ కోడి పందేల ముసుగులో కత్తులు కట్టి నిషేధిత కోడిపందాలు యథేచ్ఛగా ఒకవైపు నిర్వహించడానికి వీలుగా ఏర్పాటు చేస్తుంటే మరోవైపు పూర్తిగా నిషేధమైన జూదక్రీడలను భారీగా కొనసాగించేలా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

**ముందస్తుగానే అమ్మకాలు:**

పేకాటలో కోత ముక్క, లోన బయట, గుండాట శిబిరాలను ప్రతి బరిలో వేర్వేరుగా ఏర్పాటు చేస్తుంటారు. ముందస్తుగానే బరి రద్దీ, స్థాయి ఏర్పాటైన ప్రదేశాన్ని బట్టి ధరలను నిర్ణయిస్తుంటారు. భారీ బరుల్లో మూడు కలిపి రూ.5 లక్షలు నుంచి రూ.50 లక్షల ధరకు విక్రయిస్తుంటారు. వీటిలో నిర్వాహకులకు గుండాటలో అత్యధిక లాభాలు వస్తుంటాయి. ముమ్మిడివరం లో రాజుపాలెం ఐ. పోలవరం లో మురముళ్ల కాట్రేనికోన లో గెద్దనాపల్లి ఇలా ప్రధాన ప్రాంతాల్లో రూ.10 లక్షల నుండి రూ.50 లక్షలు స్థాయి పందేలు నిర్వహించే చోట అత్యధిక ధరకు పేకాట శిబిరాలు విక్రయిస్తున్నారు. ముమ్మిడివరం మండలం లో బరిలో గుండాటకు రూ.10 లక్షలు, పేకాటకు రూ.5 లక్షలు, కోడి పందేలకు కు రూ.30-50 లక్షలు అడ్వాన్సులు తీసుకున్నట్లు సమాచారం.

**కోడి పందేల నిర్వాహకులకు జూద క్రీడలే ప్రధాన ఆదాయం:**

జిల్లాలు, నియోజకవర్గం,మండలాల్లో... ఉదాహరణకు... కోటి రూపాయలు పందేలు జరిగే బరిలో మూడు రోజుల మీద 30 పందేలు నిర్వహిస్తే రూ.30 కోట్లు కోడి పందేలు జరిగితే అదే శిబిరంలో జూదక్రీడలు రూ.30 నుంచి రూ.40 కోట్ల స్థాయిలో జరుగుతుంటాయి. వాటిని ముందుగానే విక్రయించి సుమారు రూ.కోటి మేర నిర్వాహకులు వసూలు చేస్తారు. ప్రతి కోడి పందెంలో కోటికి రూ.10 లక్షల చొప్పున మెయింటెనెన్స్‌కు వసూలు చేస్తుంటారు. అతిథులకు భోజనాలు, బరి ఏర్పాట్లు, నిర్వహణ ఇలా అన్ని ఖర్చులు తీసి మిగిలింది నిర్వాహకుడి ఖాతాలో వేసుకుంటారు. ప్రస్తుతం జిల్లాలో అమలాపురం తో పాటు 16 మండలాల్లో అత్యధిక ధరకు పేకాట శిబిరాలు అమ్ముడైనట్లు సమాచారం.

## కపిలేశ్వరపురం లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు..



**కపిలేశ్వరపురం (మనసులో మాట) జనవరి 9..** సంస్కృతి ఉట్టి పడేలా సంక్రాతి సంబరాలు జరిపారని గ్రామ పెద్ద లంకే కామేశ్వరరా వు అన్నారు. స్థానిక శ్రీ వివేకానంద స్కూల్ ఆవరణలో శుక్రవారం ఘనంగా సంక్రాతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి వారి తల్లిదండ్రులు సమక్షంలో భోగి మంటలు వెలిగించి, చుట్టూ సంగీత పాటలు, జానపద గీతాలాలపిస్తూ భోగి మంటల్లో గోవు పిడకలు వేసారు. హరిదాసుల సంకీర్తనలతో సాంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థుల కోలాట నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలు, గొబ్బిల్లు, తెలుగువారి సంస్కృతి భావితరాలకు గుర్తుండేలా సాంప్రదాయ వస్త్రధారణ లో విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వారి పండుగల విశిష్టత ను గుర్చి గుత్తి నాగేశ్వరావు మాట్లాడారు. భారతీయ జీవన విధానం లో ప్రకృతి లో సంభవించే మార్పులకు అనుగుణంగా పండుగలు నిర్వహించడం అనాది గా ఆనవాయితి గావస్తోందని అందుకు అనుగుణంగా చిన్నారి విద్యార్థులు చేసిన సంప్రదాయక నృత్యాలు, లఘు నాటికలు సంస్కృతి కి ఉట్టి పడేలావుందని వారిని, వారి తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం సంక్రాతి సంబరాల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శ్రీ సర్వారాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాయుధ్యుడు వంగా శ్రీనివాస్ ఆధ్వర్యం లోనూ ఘనంగా సంక్రాతి సంబరాలు జరిగాయి.

## పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకం

### - కుయ్యేరు తెదేపా గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం లో నారాయణమూర్తి



**కాజులూరు మనసులో మాట జనవరి 9..** రాజకీయ పార్టీల బలోపేతానికి గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసే కమిటీలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని గ్రామమే దేశానికి పునాది అనే సత్యాన్ని దృష్టిలో పెట్టుకుని, గ్రామ స్థాయి నుంచే పార్టీని బలంగా నిర్మించాల్సిన అవసరం ఉందని తెదేపా నాయకుడు నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం కుయ్యేరు గ్రామంలో నిర్వహించిన తెదేపా గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారాయణమూర్తి ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం పార్టీ నిర్వహించారు. అధ్యక్షుడిగా నందికోళ్ల అన్నవరం సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ, గ్రామ కమిటీలే పార్టీకి వెన్నెముకలాంటివని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని పార్టీ నాయకత్వానికి చేరవేయడంలో గ్రామ కమిటీ సభ్యుల పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. గ్రామంలో ప్రతి ఇంటితో అనుబంధం పెంచుకుంటూ, పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని సూచించారు. తెదేపా పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేసిందని నారాయణమూర్తి గుర్తు చేశారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని తెలిపారు. గ్రామ కమిటీలు చురుకుగా పనిచేస్తేనే ప్రజల్లో పార్టీపై నమ్మకం మరింత పెరుగుతుందని అన్నారు. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన గ్రామ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెదేపా చేపట్టే కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తే పార్టీ విజయాలు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎన్నడు లేని విధంగా నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు నిర్మిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో తిదిప మండల ఉపాధ్యక్షుడు మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ తెదేపా నాయకులు నందికోళ్ల రాము ,పిల్లి సుబ్రహ్మణ్యం, క్లస్టర్ ఇంచార్జ్ వనం వీరబ్రహ్మం,దడాల సత్తిరాజు ,దడాల పాదాల రాజు, మహేష్, నందికోళ్ల జగ్గయ్య ,సత్తి సూర్యం కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏలూరులో ఘనంగా లూయీ బ్రెయిలీ జన్మదిన వేడుకలు



**ఏలూరు, జనవరి, 9(మనసులో మాట)..** దృష్టి లోపం గల వారికి ప్రత్యేక "బ్రెయిలీ" లిపి ప్రధాత సర్ లూయీ బ్రెయిలీ 217వ జన్మదిన వేడుకలు ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమమునకు సంయుక్త కలక్టర్ డా.. ఎం. జె.అభిషేక్ గౌడ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కార్యక్రమమునకు ఏలూరు జిల్లా లోని దృష్టి లోపం కలిగిన దివ్యాంగులు దాదాపు 300 మంది ఈ వేడుకలకు హాజరు అగుట జరిగినది. సదరు కార్యక్రమము నందు దృష్టి లోపం కలిగిన దివ్యాంగులచే కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమము నందు 20 మంది దృష్టి లోపం కలిగిన దివ్యాంగులకు వారి సేవలకు గుర్తింపుగా సన్మానము చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. సదరు కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల మరియు వయో వృద్దుల సంక్షేమ శాఖ ఏడి రం కుమార్, ఎజజూా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.రవీంద్రబాబు , జి.డి.వి.ఎస్. వీర భద్ర రావు, గిడియన్, కుందేటి జయరాజ్ వివిధ సంఘాల వారు మరియు స్వచ్ఛంద సేవా సంస్థల తరఫున పరివర్తన్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెయిలీ క్యాలెండర్ ని జేసి ఆవిష్కరించారు.





### గొల్లలగుంట ప్రజా వేదికలో

## గ్రీవెన్స్ నిర్వహణ

**జగ్గంపేట (మనసులో మాట) జనవరి 9..** ప్రజా వేదికకు వచ్చే ప్రతి వినతికి పరిష్కారం చూపే బాధ్యత ప్రభుత్వానిదని జగ్గంపేట ఎమ్మెల్యే టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామంలో శుక్రవారం ప్రజా వేదిక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ కు ఇర్రిపాక క్లస్టర్ లో ఉన్న గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న వారి వారి సమస్యలపై పలు వినతులు అందజేశారు. అందులో సామాజిక ప్రజా సంబంధ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కొందరు తమ గ్రామాలలో రహదారులు నిర్మించాలని మరికొందరు డ్రైన్లు కావాలని, సామాజిక పెన్షన్లు మంజూరు చేయాలని వినతులు సమర్పించారు. వివిధ సమస్యలపై మొత్తం 133 వినతులు అందాయి. అనంతరం జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మరింత చేరువ ఉండి సమస్యల పరిష్కరించాలనిగా ఉద్దేశంతో మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న ప్రజావేదికకు ప్రజలు భారీ ఎత్తున హాజరవుతున్నారని చెప్పారు. ఈసారి క్లస్టర్ల పరిధిలో ప్రజాదర్బార్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు ప్రజలు ఇంత భారీ ఎత్తున ప్రజావేదిక హాజరవుతున్నారంటే సమస్యలు అంత ఎక్కువగా ఉన్నాయన్నదే దానికి అర్థం అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, మురళి రాజు,పి. బాలనాగు, సర్పంచ్ చీపురుపల్లి రాఘవ, రాయుడు గోవిందు, పడాల రాంబాబు, పడాల బాలాజీ, చిత్రపు బాబు, శేఖర్ రాజు, అల్లూరి కృష్ణంరాజు, చింతాకుల ఈశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ నాగదేవి, నక్క వెంకటేష్, ములికి శివకుమార్, గండికోట రామస్వామి, తంగెళ్ల నాగరాజు, ఎడల చిరంజీవి, నక్క పెద్ద వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు

## గెద్దనాపల్లిలో పల్లె పండుగ 2.0

### కోటి 85 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
### రాజముద్ర తో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ



కిర్లంపూడి (మనసులోమాట) జనవరి 9 కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై కోటి 85 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశేషంగా కృషి చేస్తున్నారని అందులో భాగంగా గెద్దనాపల్లి గ్రామంలో కోటి 85 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైన్లు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని అన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటున్న కుటమి ప్రభుత్వం మీ భూమి మీ హక్కు అనే కార్యక్రమం తీసుకుని రైతులకు అన్ని రకాలుగా ఉపయోగపడే పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని గతంలో వైయస్ జగన్ ఫోటోలు వేసుకుని, పథకాలు వేసుకుని ప్రజలను మభ్య పెట్టాలని చూసారని ఈరోజు మీ పాస్ పుస్తకం పై మీ ఫోటో మీ భూమి వివరాలు క్యూఆర్ కోడ్ తో సహా ముద్రించి ఇస్తున్నామని జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎస్వీఎస్ అప్పలరాజు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, వీరం రెడ్డి కాశి బాబు, తోట గాంధీ, భూపాలపట్నం ప్రసాద్, చదరం చంటిబాబు, నీలం శ్రీను, తూము కుమార్, బోదిరెడ్ల సుబ్బారావు, గండే కాశి, బీశెట్టి సూరిబాబు, పాఠం శెట్టి రవి, కుంచె తాతాజీ, కుర్ల చిన్నబాబు, గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, జ్యోతుల రాంబాబు, కాంటా శ్రీను, గోడే దొరబాబు, బీశెట్టి సూరిబాబు, గుడాల చిట్టిబాబు, డి ఈఇ ఉమాశంకర్, జేఈ నారాయణమూర్తి, ఎండిఓ హరికృష్ణ, ఎమ్మార్వో చిరంజీవి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## సామర్లకోటలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్



**పెద్దాపురం (మనసులో మాట) జనవరి 10;** సామర్లకోట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రజా దర్బార్ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప నియోజకవర్గంలోని పెద్దాపురం సామర్లకోటలో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పింఛన్లు, రేషన్ కార్డులు, రోడ్లు, ఇళ్ల స్థలాలు, విద్యుత్ సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే చినరాజప్పకు వినతి పత్రాలు అందించారు. ప్రజా సమస్యలపై అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చిన రాజప్ప ఆదేశించారు. గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, క్లస్టర్ కన్వీనర్ అడబాల కుమారస్వామి, నూని రామారావు, గుమ్మెల్ల రామకృష్ణ, గోల్టి సత్యనారాయణ, నిడదవోలు వీర్రాజు, పడాల వీరబాబు, కౌన్సిలర్ బలుసు వాసు, అరుణ్ వంశీ, మహిళా నేత బొందల రామలక్ష్మి తదిత నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజా దర్బార్ చేపట్టినట్లు ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఎస్సీ కులాలు వారికి సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి అవకాశాలు

# ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్సీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఋణాలను సద్వినియోగం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
- ఎస్సీ, ఎస్టీ కులాలు వారికి ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్లను అమలు చేసి, వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా అధికారులు మరింత కృషి చెయ్యాలి
- యస్సి,ఎస్టీ అట్రాసిటీ యాక్టు తమనుతాము రక్షించు కోవడానికే గాని, అమాయకులను శిక్షించుటకు కాదు.
- ఏ జిల్లాకు వెళ్ళినా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ఏలూరు జిల్లాలో ఫిర్యాదులు తక్కువగా వచ్చాయని ఎంతో సంతృప్తి కలిగిందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ని అభినందించిన ఏపీ ఎస్సి కమిషన్ చైర్మన్ కె.యస్.జవహర్






ఏలూరు, జనవరి 09 (మనసులో మాట).. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలో వివిధ శాఖలు ద్వారా షెడ్యూల్డ్ కులాల వారికి అమలు చేస్తున్న సబ్సిడీ బ్యాంకు ఋణాలు, వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రగతిపై, గృహనిర్మాణం, పరిశ్రమలు విద్య, వైద్య ఆరోగ్యం, రోడ్లు భవనాలు, పోలీసు, సాంఘిక సంక్షేమం, గ్రామీణ అభివృద్ధి, తదితర కార్యక్రమాలు శాఖలు వారీగా మండలాలు వారీగా ఏపి యస్సి కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లాకలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ఏపి ఎస్సీ కమిషన్ కార్యదర్శి చిన్న రాముడు, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షెడ్యుల్డ్ కులాల కమీషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్ళినా ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ఎస్సీ,ఎస్టీ ఫిర్యాదులు పరిష్కారంలో ఏలూరు జిల్లా ముందు ఉందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి కి అభినందలు తెలుపు తున్నామని అన్నారు.ఎస్సీ వర్గాలకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి ఋణాలను సద్వినియోగం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా యువత ముందుకు అడుగులు వెయ్యాలని, ఇందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎస్సీ,ఎస్టీ కులాలు వారికి ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్లను అమలు చేసి, వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. యస్సి, ఎస్టీ అట్రాసిటీ యాక్టు తమకుతాము రక్షించు కోవడానికే గాని, అమాయకులను శిక్షించుటకు కాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, చట్టానికి లోబడి విధులు నిర్వహించాలని అన్నారు. విధుల నిర్వహణలో ఎవరి ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధకతో అధికార యంత్రాంగం పనిచేసి ఎస్సీ వర్గాలు అభ్యున్నతికి పాటు పడాలన్నారు. మన దగ్గరకు వచ్చిన వారిని చిరునవ్వుతో పలకరిస్తే సగం సమస్య తీరిపోతుందని, ఫిర్యాదు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే మిగతా సగం సమస్య తీరుతుందని అన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కమిషన్ తగు చర్యలు తీసుకోవడానికి వెనుకాడదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మంచి పోషకాహారం అందించాలన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఆరోగ్యం పట్ల వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎస్సీ కులాలకు చెందిన వారి భూములను అన్యాక్రాంతం చేసేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చెయ్యాలని కోరారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాలలో చదువుకునే విద్యార్థులకు అన్ని రకాలు సదుపాయాలు కల్పించాలని, లోటుపాట్లు ఉంటే సరిదిద్దాలని అన్నారు. ప్రభుత్వ వసతిగృహాలను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, యువత ప్రక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నేను రాష్ట్రంలో వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నానని, భవిష్యత్తులో కూడా చేస్తానని, లోటు పాట్లు ఉన్నచోట సరిదిద్దానని ఈ సందర్భంగా తెలిపారు. యువత పారిశ్రామిక రంగంలో అడుగుపెట్టేలా ప్రోత్సహించి, మరి కొంతమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జిల్లాలో మంచి జిల్లా కలెక్టరు, మంచి జిల్లా యంత్రాంగంతో పాటు మంచి యూత్ అధికారులు ఉన్నారన్నారు.ఎస్సీ వర్గాలు అభ్యున్నతికి ఆదర్శ జిల్లాగా ఏలూరు జిల్లా ఉండాలని కోరారు.జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎస్సి,ఎస్టీ అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు కుటుంబాలకు రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఏలూరు జిల్లా గిరిజన ప్రాంతాలలో జాబు మేళాలు నిర్వహించి ఎస్సీ,ఎస్టీ యువతీ, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో ఎస్సీ వర్గాలు యువతీ,యువకులకు పరిశ్రమల స్థాపనకు అన్నిరకాలుగా సహకారం అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు నుండి ఏటువంటి వినతులు వచ్చినను వెంటనే జిల్లా యంత్రాంగం స్పందిస్తుందని తెలిపారు.జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ,ఎస్టీ వర్గాలు నుండి పోలీసు స్టేషనులో ఎటువంటి ఫిర్యాదు వచ్చినను ముందుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, క్షేత్రస్థాయిలో ఒకటికి నాలుగు సార్లు పరిశీలన చేసి వారికి అన్ని విధాలుగా ఫ్రెండ్లీ పోలీసు సహకారం అందిస్తున్నామని అన్నారు. పోలీసు శాఖలో అన్ని రకాలు ఉద్యోగాలు కల్పనలో ఎస్సీ రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ,ఎస్టీ గ్రామాలలో మత్తుపదార్థాలు, అక్రమ మద్యం, చెడు వ్యసనాలకు లోను కాకుండా యువత మంచిమార్గంలో నడిచేలా పోలీసు శాఖ తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సమావేశంలో ఏపి ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు దాసరి ఆంజనేయులు, యస్సి కమిషన్ సభ్యులు రావాడ సీతారామ్, డా.పి.గౌతమ్, మేకల భిక్షం( దాసు), ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు యం. అచ్యుత అంబరీష్, యం.వి. రమణ, జిల్లా వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రాజముద్ర తో ఉన్న పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

పల్నాడు, జనవరి 9,(మనసులో మాట): రాజముద్ర తో ఉన్న పాస్ పుస్తకాలను రైతులకు పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రజలు పంటపొలాలకు వెళ్లేందుకు ఆటంకంగా ఉన్న డొంకరొడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. 33వ రోజు ప్రజల వద్దకు ప్రవీణ్ 100రోజులు 100 గ్రామాలు కార్యక్రమాన్ని పెదకూరపాడు మండలం కన్నెగండ్ల గ్రామంలో నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమస్యలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని సూచించారు. రాజ ముద్రతో రైతులకు కొత్తగా మంజూరైన పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామస్థులతో కలిసి భోజనం చేశారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు,విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలన్నారు. గ్రామ నాయకులతో సమావేశమై కలిసి కట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని,గ్రామంలోని కార్యకర్తల ఇళ్లలో జరిగిన కార్యక్రమాల నేపథ్యంలో వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య తలెత్తినా వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెదకూరపాడు మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య,75 తాళ్లూరు పి ఎ సి ఎస్ చైర్మన్ ఏటుకూరి రత్నం, తహశీల్దార్,ఎంపిడిఓ,మండల,గ్రామ అధికారులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంధాలయ శాఖ చైర్మెన్ గా నాగరాజు



ఏలూరు, జనవరి 9 (మనసులో మాట).. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా గ్రంథాలయ సంస్థనకు శుక్రవారం ఏలూరు చైర్మన్ గా నియమితులైన ఉండి జనసేన నియోజకవర్గం ఇన్ ఛార్జ్ గౌ. జుత్తుగ నాగరాజు చైర్మన్ వారిని ముందుగాజిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి ఎమ్. శేఖర్ బాబు మరియు గ్రంథాలయసిబ్బంది ఘనంగా స్వాగతించారు. తదుపరి బాధ్యతలు స్వీకరించారు.అనంతరం జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందితో ముచ్చటించారు. అనంతరం కార్యదర్శివారిని చైర్మన్ ఎవరికి ఎటువంటి సమస్యలున్న పరిష్కరిస్తానని ఎలాంటి సమస్యఉన్న మంత్రులదృష్టికితీసుకునివెళ్ళి సమస్యలను లేకుండా చేస్తాననిహామీఇచ్చారు. నూతనభవనం, సెస్ బకాయిలు,ఉద్యోగుల సమస్యలు, శాలరీగ్రాంట్, ఇతర విషయాలు అన్నియు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ వారిని ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఏలూరుజనసేన ఇంచార్జి ఆర్టీసిరీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ. నారాయణరావు, జిల్లాలోపనిచేయుచూన్న గ్రంథాలయఅధికారులు, జన సేనపార్టీనాయకులు, మీడియాప్రతినిధులు, ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంసిబ్బంది, కార్యాలయంసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాల్లో కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు



అనపర్తి (మనసులో మాట) జనవరి 9: శ్రీ శారదా సంగీత కళా సమితి అనపర్తి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 27వ శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం కర్ణాటక రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ సభ్యులు, నాట్యాచార్య డాక్టర్ వసంత్ కిరణ్ శిష్య బృందం, బెంగుళూరు శాస్త్రీయ కూచిపూడి మరియు భరత నాట్య నృత్య ప్రదర్శనలు వైభవంగా చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా డావ వసంత్ కిరణ్ శిష్యులు సంగీత గీతాలకు అనుగుణంగా శాస్త్రీయ కూచిపూడి మరియు భరత నాట్య నృత్య ప్రదర్శనలతో సంగీత నృత్య ప్రియులను విశేషంగా అలరించారు. నట్టువాంగం విద్వాన్ డావ వసంత్ కిరణ్ నిర్వహించగా, విదుషి గుత్తుల అరుణ గాత్రంతో, విద్వాన్ మహదాసు శ్యామ్ నీలాద్రి వాయులీనంపై, విద్వాన్ మహదాసు ఏడుకొండలు మృదంగంపై, సహకరించి నృత్యప్రదర్శనను సుసంపన్నం చేసారు. ఈ కార్యక్రమం అనపర్తి పౌల్ట్రీస్, ఫౌండర్ పరమేశు బయోటెక్ లిమిటెడ్. అధిపతి తేతల ఉపేంద్రరెడ్డి సౌజన్యంతో నిర్వహించుకోవడం జరిగింది. శ్రీ తేతల ఉపేంద్రరెడ్డి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో నేటి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానంతరం నాట్యాచార్య డావ వసంత్ కిరణ్ శిష్యబృందాన్ని, సహకార వాయిద్యకారులను తేతల ఉపేంద్రరెడ్డి సత్కరించి జ్ఞాపికలు అందజేసారు. ఈ కార్యక్రమానికి సంగీత, నృత్య ప్రియులు అశేషంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తమలంపూడి చిన ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకట మునీశ్వర్ రెడ్డి, కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి (సక్కు), మారెళ్ళ శ్రీకృష్ణ ఫణీంద్ర, కర్రి వెంకటరామకృష్ణారెడ్డి, కర్రి రామారెడ్డి, పాలి ఆంజనేయులు తదితర సమితి సభ్యులు పాల్గొన్నారు.

## కాపవరం ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



అనపర్తి, మనసులో మాట జనవరి 9.. బిక్కవోలు మండల కాపవరం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి గోపాల కృష్ణారావు భోగి మంటను వెలిగించి, విద్యార్థుల చేతుల మీదుగా భోగి పిడకలను వేయించి సంక్రాంతి ప్రారంభించారు. విద్యార్థులకు రంగవల్లుల, సాంప్రదాయ దుస్తుల అలంకరణ మరియు సైకిల్ తొక్కే పోటీలు నిర్వహించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు కోలాట నృత్యాలను సాంప్రదాయ రీతులతో చేస్తూ భోగి మంట చుట్టూ తిరుగుతూ తీన్ మార్ లతో కోలాహాలంగా ఆనంద సంతోషాలతో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. చివరగా పోటీలో గెలుపొంది న విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.వీరరాఘవరెడ్డి, టి.వి.ఎస్.ఎన్ రెడ్డి,వై.బి.యస్.ఆచార్యులు, యస్.రవికుమార్, సి.హెచ్ కోమలి , కె.రవిభాస్కర రెడ్డి, డి.లోవకుమారి, సి.హెచ్.చైతన్య, డి రవిబాబు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## శ్రీ ప్రకాశ్ సినర్జీ పాఠశాల వేడుకలకు భారీ ఏర్పాట్లు

పెద్దాపురం, (మనసులో మాట) జనవరి 9; నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పెద్దాపురంలోని శ్రీ ప్రకాష్ సీనర్జీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు చైర్మన్ విజయ్ ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల వేడుకలకు మార్గదర్శి చిట్ ఫండ్స్ ఎండి శైలజాకిరణ్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి డాక్టర్ సూర్య యశ్వంతరావు, శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేశవరావు, తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని విజయ ప్రకాష్ తెలిపారు. శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల18వ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని విజయప్రకాష్ కోరారు.

### ఆత్రేయపురం ఉత్సవాన్ని

# విజయవంతం చేయాలి

### కోనసీమ లో జాతీయ స్థాయిలో సంక్రాంతి సంబరాలు - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట (మనసు లోమాట) జనవరి 9.. కోనసీమ ప్రాంతంలో జాతీయస్థాయిలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటనున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా, శోభాయమానంగా మూడురోజుల పాటు పండుగ వాతావరణం సంక్రాంతికి మూడు రోజుల ముందు, ఆత్రేయపురం ఉత్సవం పేరిట సంక్రాంతి సంబరాలు ప్రారంభమవుతున్నాయని అన్నారు. గత ఏడాది రాష్ట్రస్థాయి డ్రాగన్ పడవల పోటీలు ఎంతో పేరు, గౌరవాన్ని తీసుకువచ్చాయని, అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జాతీయస్థాయిలో పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం టూరిజం శాఖ సహకారం, దాతల సహకారం, జిల్లా యంత్రాంగం సహకారంతో కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. అనేక ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడానికి ఉవ్విళ్లూరుతున్నారన్నారు. గత ఏడాది మీడియా ఎంతో సహాయసహకారాలు అందించి ఈ ఉత్సవానికి కీర్తిప్రతిష్టలు తెచ్చారో ఈ సంవత్సరం సైతం అంతే సహకారం అందించాలని కోరారు. మీడియాలో ప్రసిద్ధ పత్రికలు, ఛానళ్లలో ఈ కార్యక్రమం గురించి ప్రచారం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.లొల్ల లాకుల ప్రాంతాన్ని టూరిజం హబ్ తీర్చిదిద్దడానికి కృషి జరుగుతుందన్నారు. ఫుడ్ ఫెస్టివల్, డ్వాక్రా ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ పిల్లలకు, మహిళలకు వినోదభరిత కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆత్రేయపురం సెంటర్ కేంద్రంగా తాడిపూడి వారధి నుంచి డ్రాగన్ పడవల పోటీలు, ఈత పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చురుకుగా పూర్తవుతున్నాయని తెలిపారు. జనవరి 11వ తేదీ ఈతల పోటీలు, ముగ్గుల పోటీలు, 12,13వ తేదీల్లో డ్రాగన్ పడవల పోటీలు, 13వ తేదీ గాలిపటాల పోటీలు జరగనున్నట్లు తెలిపారు.డ్రాగన్ పడవల పోటీల్లో పాలుపంచుకునేందుకు 25 టీమ్లు ఆంధ్ర, కేరళ ఇతర రాష్ట్రాల నుంచి 250మంది ఆ పోటీల్లో పాలుపంచుకోబోతున్నారని తెలిపారు. ఈత పోటీల్లో పాల్గొనేందుకు 200మంది జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి నమోదు చేసుకున్నారని తెలిపారు. 300మంది ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు, 100మంది గాలిపటాల పోటీల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సినీ ఆర్కెస్ట్రా, నారీ,నారీ నడుమ మురారి లాంఛింగ్ కార్యక్రమానికి ప్రసిద్ధ సినీనటుడు శర్వానంద్ రానున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 7గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని టూరిజం రంగంలో ముందుకు తీసుకువెళ్లాలని కృషి చేస్తున్నట్లు, వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని కొలవడానికి లక్షలాదిగా తరలివస్తున్నారని " టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కోనసీమ అందాలు కేరళను తలపించే విధంగా ఉన్నాయని, పడవల పోటీలు బొబ్బర్లంక లొల్ల లాకుల ప్రధానకాలువలో నిర్వహించవచ్చన్న రీతిలో పర్యాటకులను ఆకర్షించడం జరిగిందన్నారు. అన్ని రకాల శాఖలు, ప్రభుత్వ యంత్రాంగం ఈ కార్యక్రమంపై దృష్టిసారించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఆర్డీవో పి శ్రీకర్, టూరిజం అధికారి, మండల అదికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. శ్రేయా మీడియా సహాయసహకారాలు అందిస్తున్నారని, కమిటీ అధ్యక్షుడు తాడిపూడి బాబు, రామకృష్ణంరాజు, సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ అసోసియేషన్ తరపున వెత్సా అనిల్, స్టేట్ అసోసియేషన్, స్పోర్ట్స్ అసోసియేషన్ కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమం గురించి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేయడం జరిగిందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లు కోసం పూడి రామకృష్ణంరాజు మాజీ ఎంపీపీ పివిస్ రాజు తాసిల్దార్ ఆర్ డి శ్రీరామచంద్రమూర్తి, ఎంపీడీవో రామన్, ప్రజలు పాల్గొన్నారు.

# సంక్రాంతి వేడుకల్లో కానరాని ఎంపీ

- ▶▶ పిఠాపురం రాజకీయ విషయాల్లో అధిక జోక్యంతో పవన్ సముదాయించారంటు గుసగుసలు
- ▶▶ వ్యక్తిగత పనుల నిమిత్తం అందుబాటులో లేరా?
- ▶▶ కారణం ఏమైనా ఎంపీ పాల్గొనకపోవడం పట్ల రాజకీయ వర్గాలలో చర్చ

**పిఠాపురం (మనసులో మాట) జనవరి 9:** పిఠాపురం నియోజకవర్గంలో 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం' పేరిట మూడు రోజుల పాటు నిర్వహించనున్న సంక్రాంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. స్థానిక ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం ఈ వేడుకలతో జనసంద్రమైంది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో పవన్ కళ్యాణ్ స్వయంగా పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.ఎంపీ గైర్హాజరీపై చర్చోపచర్చలు:అయితే, సొంత నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్న ఇంతటి భారీ కార్యక్రమంలో కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ కనిపించకపోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. సాధారణంగా ఉప ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక ఎంపీ ప్రోటోకాల్ ప్రకారం పాల్గొనాల్సి ఉంటుంది. కానీ, ఈ వేడుకలకు ఆయన దూరం కావడం పలు అనుమానాలకు తావిస్తుంది.. ఎంపీ గైరాజరకు కారణం ఇదేనా?రాజకీయ విశ్లేషకుల సమాచారం



ప్రకారం.. పిఠాపురం నియోజకవర్గ అంతర్గత రాజకీయాల్లో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మితిమీరిన జోక్యం చేసుకోవడం పట్ల పవన్ కళ్యాణ్ తీవ్ర అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుల నియామకాలు ఇతర పార్టీ పదవుల విషయంలో ను, పార్టీ అంతర్గత వ్యవహారాల్లోనూ, పవన్ కళ్యాణ్ పెట్టిన ఆంక్షలను లెక్కచేయకుండా ఎంపీ తనదైన శైలిలో వ్యవహరించడం జనసేనానిని ఆగ్రహానికి గురిచేసిందని టాక్.పలుమార్లు హెచ్చరించి నప్పటికీ, ఎంపీ తీరులో మార్పు రాకపోవడంతోనే పవన్ ఆయన పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారని, అందుకే ఈ ఉత్సవాలకు ఎంపీని దూరం పెట్టడం లేదా ఆయనే స్వయంగా దూరంగా ఉండటం జరిగిందని పార్టీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పిఠాపురంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నా, నేతల మధ్య ఈ 'కోల్డ్ వార్' మాత్రం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది... ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పిఠాపురంలో ఏ వేడుకలు జరిగిన ముఖ్యఅతిథిగా పాల్గొనేవారు, ఎంత పెద్ద కార్యక్రమంలో పాల్గొనక పోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తున్నాయి..

# సంక్రాంతి పండుగ మన భారతీయ సంస్కృతి

- కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి
- కొత్తూరు డిక్కో గృహాల్లో ఘనంగా మన ఇల్లు మన సంక్రాంతి సంబరాలు

రామచంద్రపురం (మనసులోమాట) జనవరి 9:భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అత్యంత ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు అన్నారు. రామచంద్రపురం కొత్తూరులోని టిడ్కో గృహ సముదాయంలో జరిగిన మన ఇల్లు మన సంక్రాంతి సంబరాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకునే సంక్రాంతి పండుగ సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర ప్రేమను పెంపొందిస్తుందని అయన అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ అనే మూడు రోజుల పండుగలు మన గ్రామీణ జీవనశైలిని, పశుసంపద



ప్రాధాన్యతను గుర్తుచేస్తాయని తెలిపారు. మన సాంప్రదాయాలు, ఆచారాలు, సంస్కతిని కాపాడుకుంటూ పండుగలను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని వాసంశెట్టి సత్యం ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ నేటి యువత మన సంప్రదాయాల విలువను అర్థం చేసుకుని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శ్రేయస్సు నింపాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి ముఖ్య అతిధులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సంబరాల్లో మున్సిపల్ కమిషనర్ రాజు, సి ఎల్ టి సి బిందు మాధవి, ఏఈ వివేక్, కూటమి పార్టీ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కొండేపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పేరిట దళిత నాయకులపై నిర్బంధమా?

## - ప్రభుత్వంపై వైసీపీ నేత గండేపల్లి బాబీ ఆగ్రహం..

**పిఠాపురం (మనసులో మాట) జనవరి 9:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంక్రాంతి వేడుకల కోసం పిఠాపురం వస్తుంటే, ముందస్తుగా వైసీపీ నాయకులను, ముఖ్యంగా దళిత నేతలను అరెస్టు చేయడం అత్యంత దారుణమని వైసీపీ రాష్ట్ర నాయకుడు గండేపల్లి బాబి తీవ్రంగా ఖండించారు. గొల్లప్రోలు పోలీస్ స్టేషన్లో గల వైసీపీ నాయకులను పరామర్శించి అనంతరం మీడియాతో మాట్లాడా శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడటం విడ్డూరంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడాదిన్నర క్రితం పిఠాపురంలో పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో గెలుపొందారని, కానీ ప్రస్తుతం ఆయన గ్రాఫ్ ఎంత దారుణంగా



పడిపోయిందో ఈ అరెస్టులే నిదర్శనమని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గ ప్రజల మధ్యకు రావాలంటే దళిత నాయకులను, వైసీపీ కార్యకర్తలను నిర్బంధించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. "సంవత్సరానికి ఒకటి రెండుసార్లు పిఠాపురం వచ్చే పవన్ కళ్యాణ్, ఇలా బలప్రయోగంతో పర్యటనలు చేయడం సరికాదు. ప్రజలను, నాయకులను నిర్బంధించి పరిపాలన చేయాలని చూస్తే, మిగిలిన మూడున్నర ఏళ్ల కాలం తర్వాత మీరు పిఠాపురంలో అడుగుపెట్టలేని పరిస్థితి వస్తుంది" అని బాబి హెచ్చరించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన మండిపడ్డారు. పర్యటనల పేరిట భయోత్పాతం సృష్టించడం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పలువురు పాల్గొన్నారు.

# బంగారు వడ్డానం పై అభ్యంతరాలు తెలియజేయండి

**కాజులూరు మనసులో మాట జనవరి 9..** బంగారు వడ్డానంపై అభ్యంతరాలు తెలియజేయాలని తాహాసిల్దార్ జి .రవీంద్రనాథ్ ఠాగూర్ తెలిపారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక ప్రకటన తెలుపుతూ 2008 సంవత్సరంలో ఆర్యవటం గ్రామంలో చెరువు పనులు చేస్తుండగా 119 గ్రాములు సంబంధించి బంగారు వడ్డానం దొరకడంతో ఆ సమయంలో ఆ వడ్డాణం గొల్లపాలెం పోలీస్ స్టేషన్లో అందించారు. నాటి నుండి వడ్డానం పోయిందని ఎవరు ఫిర్యాదు చేయకపోవడంతో అది కోర్టు పరిధిలోకి వెళ్ళింది. అయితే ఆ వడ్డానంపై 15 రోజుల్లోపు ఎవరిదైనా పోయినట్లు తెలిపినట్లైతే పూర్వపరాలు పరిశీలించి వారికి ఇవ్వడం జరుగుతుందని అటుపిమ్మట ఎవరు అభ్యంతరాలు తెలపనట్లైతే ఆ వడ్డానాన్ని వేలం వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే అప్పారావుకి ఘన నివాళి



రామచంద్రపురం (మనసులోమాట) జనవరి 9.. మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పిల్లి అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని రామచంద్రపురం మండలంలోని వెంకటాయపాలెంలో అప్పారావు విగ్రహానికి పలువురు నేతలు ఘనంగా నివాలులర్పించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, పలు వురు కూటమి నాయకులతో కలిసి శుక్రవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అప్పారావు చేసిన సేవలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. సమాజానికి, ప్రజలకు చేసిన సేవలను స్మరణకు తెచ్చుకుని ఆయన కు నివాళులు అర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. లోకంలో మనం చేసిన మంచి పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని, మనము ఈ లోకంలో లేకున్నా మనల్ని గుర్తు చేసుకొని నివాళు లర్పించడం గొప్ప కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పెంకే సాంబశివరావు, రెడ్డి సురేష్,దంగేటి గౌరీ శంకర్ , కంచుమర్తి బాబురావు, టేకు మూడీ సత్యనారాయణ, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలి

- గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్‌లకు చెల్లించని బిల్లులు మంజూరు చేయకుంటే ఆత్మహత్యలే శరణ్యం
- సబ్కా జిల్లా అధ్యక్షుడు ధర్మాజీ, రాష్ట్ర కారదర్శి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 9 :** గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కాంట్రాక్టర్‌లకు ఒక్క బిల్లు కూడా చెల్లించలేదని, పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డర్స్ అండ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) జిల్లా అధ్యక్షుడు మద్దాల ధర్మాజీ, రాష్ట్ర కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మాజీ, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనిచేసిన దానికి బిల్లులు చెల్లించకపోవడంతో గత ఏడేళ్ళగా బిల్లులు పెండింగ్‌లో ఉండటం వలన రాష్ట్రంలోని కాంట్రాక్టర్లు ఆర్థికంగా చాలా నష్టపోయారన్నారు. గత ప్రభుత్వం బకాయిలు పడినప్పటికీ ఈ ప్రభుత్వంలో పనులు చేయడం జరిగిందన్నారు. తాము కూడా మెటీరియల్‌ను అరువుకు తీసుకుంటామని, లేబర్‌కు కూలీ సొమ్ములు బకాయిలు పడ్డామని, వడ్డీలకు తెచ్చిన సొమ్ములకు వడ్డీలు చెల్లించే పరిస్థితి ఉందన్నారు. ఈ పండుగకు అయినా రూ.2కోట్ల లోపు బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తే కాంట్రాక్టర్లు కష్టాల నుండి బయటపడతారన్నారు. కాంట్రాక్టర్లు అప్పులు పాలెం, ఒత్తిడి తట్టుకోలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది కాంట్రాక్టు పనులు చేయడం మానేసి వలస కూలీలుగా మారిపోయిన దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే కొంత కాలానికి 'కాంట్రాక్టరు అనే వాడు ఉండే వాడు..' అనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ముఖమంత్రి చంద్రబాబు నాయుడు కాంట్రాక్టర్ల సమస్యలపై స్పందించడం జరిగిందని, వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు గత 30 ఏళ్ళుగా సంపాదించుకున్నదంతా పోగుట్టుకున్నా రని చెబుతూ, కూటమి ప్రభుత్వం వస్తే బకాయిలు అన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై కాంట్రాక్టర్లు అంతా ఎంతగానో ఆశపెట్టుకుని గెలిపించుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాంట్రాక్టర్లకు తక్షణం రూ.1000 కోట్లు విడుదల చేసి, ఈ పండుగనా డెఎనా వారి జీవితాల్లో ఆనందం తీసుకురావాలని కోరారు. తమకు బిల్లులు చెల్లిస్తే జీఎస్టీ ప్రభుత్వానికి వస్తుందని, లేబరుకు వేతనాలు చెల్లిస్తే వారు కూడా పండుగపూట ఆనందంగా ఉంటారన్నారు. వ్యాపారం కూడా రీసైకిల్ అవుతుందన్నారు. పెండింగ్ బిల్లులు రాకపోవడంతో చాలా మంది కాంట్రాక్టర్లు బ్యాంకులు వద్ద ఎన్‌పీఏగా అయిపోయారని, ప్రైవేట్ వ్యక్తులు వద్ద కూడా అప్పు పుట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క బిల్లులు రానప్పటికీ జీఎస్టీ అధికారుల నుండి జీఎస్టీ చెల్లించాలని నోటీసులు రావడంతో కాంట్రాక్టర్లను మరింత ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మంజూరు అయిన పనులు స్టేటస్‌లో కన్పించకపోవడం వల కూడా కాంట్రాక్టర్లకు బ్యాంకుల నుండి రుణాలు మంజూరు కావడం లేదని, ఆ సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ.10 వేల కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంట్రాక్టర్లు వేములపల్లి శ్రీనివాసరావు, నంది విజయకుమార్‌బాబు, సీహెచ్ సురేష్‌బాబు, పులి రాంబాబు, బీ అప్పారావు, మార్గాని రామచంద్రరావు, కొరుప్రోలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అనపర్తి గ్రామ దేవత వీరులమ్మ అమ్మవారి హరితాభిషేకమునకు

# పోటెత్తిన మహిళా భక్తులు



**అనపర్తి (మనసులో మాట) జనవరి 9:** అనపర్తిలో కొలువై ఉన్న శ్రీ వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో, హరిద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 1008 మంది మహిళలు, వీరుళ్లమ్మ అమ్మవారి జాతర తీర్థ మహోత్సవాల్లో భాగంగా, శుక్రవారం ఉదయం అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు ఆలయ కమిటీ సభ్యులు తాంబూళం, ప్రసాదం అందజేశారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# పిఠాపురంలో సంక్రాంతి శోభ

## మూడు రోజుల వేడుకకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

















## ఎన్టీఆర్ జిల్లాలో పరిటాల శ్రీరామ్ కు

# జన నీరాజనం

- ▸▸ జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు హాజరైన శ్రీరామ్
- ▸▸ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), నెట్టెం రఘురామ్ తో కలిసి విగ్రహావిష్కరణ
- ▸▸ హెలికాప్టర్ తో పూల వర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్న నేతలు
- ▸▸ కార్లు, బైక్ ర్యాలీలతో సందడి వాతావరణం
- ▸▸ శ్రీరామ్ కు అడుగడుగునా ఘన స్వాగతం, పూల వర్షం
- ▸▸ ఎన్టీఆర్ అమ్ములపొదిలో నుంచి వచ్చిన బ్రహ్మాస్త్రం పరిటాల రవి.. శ్రీరామ్
- ▸▸ యువగళం పాదయాత్ర కాదని.. అది ఒక తిరుగుబాటు అన్న శ్రీరామ్



**ఎన్టీఆర్ జిల్లా జనవరి 9 (మనసులో మాట)..** పర్యటనలో ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కు అభిమానులు నీరాజనాలు పలికారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో వత్సవాయి మండలం దబ్బాకుపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ముందుగా శ్రీరామ్ కు చిలకల్లు టోల్గేట్ దగ్గర నుంచే భారీ స్వాగతాలు కనిపించాయి. కార్లు, ద్విచక్ర వాహనాల ర్యాలీతో భారీ జన సందోహం కనిపించింది. జగ్గయ్యపేటలో పాటిబండ్ల ప్రభాకర్ నివాసంలో అభిమానులు, శ్రేయోభిలాషులు, మహిళలతో సమావేశమై అక్కడే అల్పాహారం చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) నివాసానికి వెళ్లగా. వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు ఆయన వెంట తరలివచ్చారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబసభ్యులు శ్రీరామ్ కు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే రాజగోపాల్ (తాతయ్య), నెట్టెం రఘురామ్ తో కలసి టి.డి.జనార్ధన్ స్వగ్రామం లింగాలకు వెళ్లారు. అక్కడ ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మక్కపేటలో కూడా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ముందుకు సాగారు. విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిలోని చిల్లకల్లు సెంటర్ లో వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేయగా. అక్కడ అభిమానులు హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. ర్యాలీ మొదలైనప్పటి నుంచి వేలాది మంది శ్రీరామ్ వెంట కదిలారు. ఎక్కడ చూసినా జై ఎన్టీఆర్, జై చంద్రబాబు, జై లోకేష్, జై పరిటాల, జై శ్రీరామ్ అన్న నినాదాలు వినిపించాయి. ఆ తర్వాత భారీగా తరలివచ్చిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడ హెలికాప్టర్ తో పూల వర్షం కురిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరామ్ మాట్లాడుతూ జగ్గయ్య పేటలో మీరు చూపించిన అభిమానాన్ని జీవితాంతం గుర్తు పెట్టుకుంటానని అన్నారు. రాష్ట్ర భవిష్యత్ లో, యువత భవిష్యత్ లో మార్పుకు నాంది పలికిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఆరోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల నుంచి పుట్టిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. శ్రీరాముడు అయోధ్య నుంచి అరణ్యంలోకి వచ్చాకనే దేవుడయ్యాడన్నారు. దేవుడు ఎలా ఉంటారో తెలియని వారికి తన సినిమాల ద్వారా ఎన్టీఆర్ చూపించారన్నారు. అలాగే ఆయన ప్రజల్లోకి వచ్చి నిజమైన దేవుడయ్యారన్నారు. ఆయన ప్రజా జీవితంలోకి రాగానే.. ఎన్నో ఆటంకాలు సృష్టించారన్నారు. కుల్లు, కుతంత్రాలు తెలియని వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఆ లక్షణాలు బాలక్రిష్ణ రూపంలో కనిపిస్తుందన్నారు. ఎన్నో మాటలు, నిందలు పడ్డారని అయినా ఏ సమస్య వచ్చినా అనుభవంగా భావించి ముందుకెళ్లారని అన్నారు. నందమూరి తారకరామరావు అమ్ములపొదిలో అనుభవాలు మాత్రమే ఉంటాయనుకుంటే పొరపాటని. అందులో పరిటాల రవి లాంటి బ్రహ్మాస్త్రాలు కూడా ఉన్నాయన్నారు. పరిటాల రవికి రాజకీయ భిక్ష పెట్టడమే కాదు. ప్రాణ భిక్ష కూడా పెట్టారన్నారు. పరిటాల రవి ఎన్టీఆర్ ను తన తండ్రిగా భావించి.. చివరి వరకు నిలబడ్డారన్నారు. ఆ రోజు పరిటాల రవి ప్రాణం కాపాడి మా కుటుంబానికి మాత్రమే మేలు చేయలేదని. ప్రజల కోసం మా ప్రాంతాన్నే కాపాడారన్నారు. పరిటాల రవికి ప్రాణం పోసి. అనంతపురం జిల్లాను కాపాడుకున్నారన్నారు. పేదవాడికి కష్టం ఉందంటే వినిపించే పేరు ఎన్టీఆర్ అన్నారు. ఆరోజు రాష్ట్రంలో ప్రజల్లో ఉన్న రక్తానికి వేడి తగ్గిన సమయంలో ఎన్టీఆర్ ఒక ఉత్తేజాన్ని నింపారన్నారు. 1983 జనవరి 9వ తేది రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని పారద్రోలిన రోజన్నారు. ఆ రోజు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా సంతకం చేసి. ఉమ్మడి రాష్ట్ర దిశ, దశను మార్చారన్నారు. ఆ తర్వాత గత ఐదేళ్లలో అప్పటి పరిస్థితులు కనిపించాయన్నారు. రాష్ట్రంలో జరిగిన అరాచకపాలన చూసి మమ్మల్ని కాపాడే వారు లేరా అని భయపడుతూ, ఆందోళనతో ప్రజలు బ్రతికారన్నారు. ఇలాంటి సమయంలో ప్రజల నుంచి వచ్చిన నాయకుడే నారా లోకేష్ అన్నారు. యువగళం అనేది పాదయాత్ర కాదు. అది ఒక తిరుగుబాటు అన్నారు. ఎన్టీఆర్ ఆ రోజు ప్రజల రక్తంలో ఎలా వేడి పుట్టించారో.. అలాగే యువగళంతో లోకేష్ ప్రజల్ని ముందుకొచ్చేలా చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి వైపు నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మరోసారి గత పరిస్థితులు రాకుండా నారా లోకేష్ నాయకత్వంలో మనం ముందుకు నడుద్దామని శ్రీరామ్ పిలుపునిచ్చారు.



## శ్రీవాణి చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ లో

# సంక్రాంతి సంబరాలు

**పలమనేరు జనవరి 9 (మనసులో మాట) :** పలమనేరు పట్టణం దండపల్లి రోడ్డులో ఉండు శ్రీవాణి చిల్డ్రన్స్ అకాడమీ స్కూల్ లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయని స్కూల్ కరస్పాండెంట్ కె.కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ వేడుకలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా వారి యొక్క వేషధారణను అందరిని ఆకట్టుకునే విధంగా ఉన్నది. ఇందులో చిన్నారులు అందరు కలిసి భోగి మంటలు వేసి మన తెలుగు సాంప్రదాయాన్ని గుర్తు తెచ్చుకున్నారు. అదేవిధంగా చిన్నారుల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ... మధు,శ్రీ వాణి కాలేజీ అనుబంధ సంస్థ అయిన శ్రీవాణి చిల్డ్రన్స్ అకాడమీ స్థాపించి ఒక సంవత్సరం రోజులు వస్తున్నది. ఈ సందర్భంలో విద్యార్థులకు చదువుతోపాటు మన తెలుగు సాంప్రదాయాలు ఏ విధంగా ఉంటాయి. అనేది వారికి తెలియజేయాలని ఉద్దేశంతో ఈ సంక్రాంతి సంబరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, స్కూల్ వైస్ ప్రిన్సిపల్ గోవింద్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన అప్పిశెట్టివాసులు



**పలమనేరు జనవరి 9 (మనసులో మాట):** గంగవరం మండలం మామడుగు పంచాయతీ అప్పిశెట్టిపల్లి గ్రామస్తులు పలమనేరు శాసన సభ్యుల అమరనాథ్ రెడ్డిని శుక్రవారం కలిసి సన్మానించారు. అప్పిశెట్టిపల్లెకు రోడ్డును మంజూరు చేసి నిర్మాణం జరగడంపై గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని ఎమ్మెల్యే నిలబెట్టుకున్నారని వారు పేర్కొన్నారు. గ్రామానికి మరోవైపు ఉన్న రోడ్డును సైతం వేయిస్తే గ్రామస్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వారు ఆయన్ను కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన జిల్లా అధికారులతో మాట్లాడి గ్రామస్థులు అడిగిన రోడ్డు నిర్మాణం వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల టీడీపీ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, హరిబాబు, మంజునాథ్ లతో పాటు గ్రామస్థులు ముత్యాల రెడ్డి,జగదీశ్ రెడ్డి,నవీన్, రామ్మూర్తి, రామకృష్ణ, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మదర్ తెరిసా కళాశాలలో

# 55 మంది విద్యార్థులు రక్తదానం




**పలమనేరు జనవరి 9 (మనసులో మాట) :** పట్టణ సమీపంలోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం తరపున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలమనేరు ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో చిత్తూరు ప్రభుత్వాసుపత్రి లోని బ్లడ్ బ్యాంక్ కు మొత్తం 55 మంది విద్యార్థులు రక్తదానం చేశారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం. రవీంద్రబాబు తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగము విద్యార్థులకు రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొత్తం 55 మంది విద్యార్థులు అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం రవీంద్రబాబు తో పాటు చైర్మన్ ఎం. ఆర్ సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కిషోర్, ప్రభుత్వ డాక్టర్లు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులపై

# అన్యాయం

- ప్రభుత్వ ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలి
- బీఎస్పీ ఇన్‌చార్జ్ సాకే వినయ్ కుమార్ డిమాండ్

**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** ధర్మవరం నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులపై జరుగుతున్న అన్యాయాన్ని వెంటనే సరిదిద్దుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తచెరువులోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సూర్యనారాయణ, ధర్మవరం లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి నరేష్‌కు బీఎస్పీ తరఫున వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సాకే విజయ్, సాకే హరి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ, బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరం, ముదిగుబ్బ మండలాల్లో గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు రోజూ వీధులు ఊడ్చడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం, చెత్త సేకరణ వంటి పూర్తి స్థాయి శారీరక పనులు చేస్తున్నప్పటికీ వారికి కేవలం రూ.6,000 మాత్రమే వేతనంగా చెల్లించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ. నెం.57 (తేదీ 13-02-2024), కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ మిషన్ మార్గదర్శకాలు, సంబంధిత సర్క్యులర్లు స్పష్టంగా ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకపోవడం విచారకరమని తెలిపారు. పారిశుధ్య కార్మికులను 'గ్రీన్ అంబాసిడర్లు'గా పేరు మార్చి వేతనాలు తగ్గించడం జరుగుతోందని, గ్రీన్ అంబాసిడర్లు కేవలం అవగాహన కార్యక్రమాలకు మాత్రమే పరిమితమై ఉండాలని, వారితో శారీరక పారిశుధ్య పనులు చేయించకూడదని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. అయినప్పటికీ అదే పనులు చేయించడం ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘనతో పాటు కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులంతా ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాకుండా సామాజిక వివక్ష కింద కూడా వస్తుందని బీఎస్పీ నేతలు స్పష్టం చేశారు. ఇప్పటికే ఎంపీడీవోలకు వినతిపత్రాలు సమర్పించినా చర్యలు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కావున లేబర్ కమిషన్ అధికారులు తక్షణమే స్పందించి నాలుగు మండలాల ఎంపీడీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పారిశుధ్య పనులు చేస్తున్న వారిని కార్మికులుగానే గుర్తించి, ప్రభుత్వ ఉత్తర్వులు మరియు సర్క్యులర్ల ప్రకారం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సాకే వినయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ధర్మవరంలో కార్పొరేట్ దూకుడు

## స్థానిక ఆప్టికల్ వ్యాపారుల జీవనోపాధికి ముప్పు - అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం



**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** ధర్మవరంలో 'లెన్స్‌కార్ట్' వంటి కార్పొరేట్ సంస్థల అనియంత్రిత విస్తరణతో స్థానిక ఆప్టికల్ వ్యాపారుల జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని ధర్మవరం ఆప్టికల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శ్రీ సత్యసాయి జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు కొత్తచెరువులో వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపాటి సురేష్ చౌదరి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవనోపాధి హక్కు ఉందని గుర్తుచేశారు. కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్య ధోరణుల వల్ల ధర్మవరంలోని సుమారు 200 కుటుంబాలు, ప్రత్యక్షంగాపరోక్షంగా ఆధారపడిన 1,500 మంది కార్మికుల జీవనం ప్రమాదంలో పడుతోందని తెలిపారు. ఆప్టికల్ షాపుల్లో పనిచేస్తున్న కార్మికులంతా అసంఘటిత రంగానికి చెందినవారని, అసంఘటిత కార్మికుల సామాజిక భద్రత చట్టం2008 ప్రకారం వారి సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రారంభంలో తక్కువ ధరల ఆఫర్లతో స్థానిక వ్యాపారాలను దెబ్బతీసి, అనంతరం ఏకస్వామ్యాన్ని నెలకొల్పే కార్పొరేట్ విధానం ఆరోగ్యకరమైన మార్కెట్‌కు విరుద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి బహుజన్ సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే వినయ్ కుమార్ హాజరై మద్దతు తెలిపారు. స్థానిక కార్మికుల ఉపాధిని దెబ్బతీసే కార్పొరేట్ శక్తులపై రాజీలేని పోరాటం చేస్తామని, లేబర్ డిపార్ట్‌మెంట్ తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆప్టికల్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక వ్యాపారులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 37వరోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించిన ఎం.వి.ఐ. మధుసూదన్




**పలమనేరు జనవరి 9( మనసులో మాట):** పట్టణ సమీపంలోని ఆర్. టి. ఓ కార్యాలయంలో 37వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు రహదారి భద్రత ప్రచారంలో భాగంగా శుక్రవారం శిక్షణతో భద్రత సాంకేతికత ద్వారా పరివర్తన కార్యక్రమంలో పాల్గొన్న మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, గంగవరం సి.ఐ ప్రసాద్ స్కూల్ బస్సు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు, పలు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ రాష్ డ్రైవింగ్ వలన కలిగే అనర్ధాలను వివరించారు. డ్రైవర్లకు కంటి చూపు పై అవగాహన కల్పిస్తూ డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు సుమారు 150మంది హాజరైనారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండలం సిఐ ప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ఆర్టీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన ప్రజా సంకల్ప యాత్ర వేడుకలు



**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు "శ్రీ వై యస్.జగన్మోహన్ రెడ్డి " ప్రజాసంకల్పయాత్ర నేటితో(9వ తారీకు) ఏడు(7)సంవత్సరాలు పూర్తి అయిన సందర్బంగా ధర్మవరం పట్టణంలో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ "యస్ సి-యస్ టి సెల్ నాయకుల ఆధ్వర్యంలో "కేక్ కట్ చేసి" ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్బంగా నాయకులు మాట్లాడుతు త్వరలో ప్రారంభిస్తున్న "ప్రజాసంకల్పయాత్ర" దిగ్విజయంగా కొనసాగాలని, 2029లొ ధర్మవరం నియోజకవర్గానికి "కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి " యం యల్ ఎ గా గెలిపించుకొంటామనీ, ఆంధ్రప్రదేశ్ కి ముఖ్యమంత్రిగా వై యస్. జగన్మోహన్ రెడ్డి నుచేసుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తామనితెలిపారు. ఈ కార్యక్రమంలొ దేవరకొండ రమేష్, యం.చౌడప్ప, కునుతూరు గోపాల్,సుభాన్ బాషా, లింగారెడ్డి, నామాల రామాంజినేయులు, గరుడంపల్లి కిష్టయ్య,. నాయక్, వెంకటేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# టీటీడీలో సంచలనం.!

## జంగా కృష్ణమూర్తి గుడ్ బై..!

**తిరుమల, జనవరి 9 (మనసులో మాట)..** ఏపీలో పల్నాడు జిల్లా టీడీపీ నేత జంగా కృష్ణమూర్తి ఇవాళ అనూహ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను టీటీడీకి పంపుతున్నట్లు మరో లేఖ విడుదల చేశారు. ఇందులో తన రాజీనామాకు గల కారణాల్ని కూడా ఆయన వివరించారు. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు పార్టీతో పాటు ప్రభుత్వంలోనూ తీవ్ర కలకలం రేపుతోంది. రెండు రోజులుగా ఆంధ్రజ్యోతి పత్రికలో తనపై వచ్చిన తప్పుడు కథనాలకు మనస్తాపం చెంది టీటీడీ బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు టీడీపీ నేత జంగా కృష్ణమూర్తి లేఖలో తెలిపారు. గతంలో తనకు కేటాయించిన బాలాజీనగర్ ప్లాట్ నంబర్ 2 ఇప్పటికీ ఖాళీగా ఉందని, దాన్ని తిరిగి కేటాయించాల్సిందిగా సీఎం చంద్రబాబును కోరినట్లు జంగా తెలిపారు. దీంతో చంద్రబాబు బోర్డుకు దీన్ని పంపారని, బోర్డు కూడా దీన్ని ఆమోదించి తీర్మానం చేసినట్లు వెల్లడించారు. చాశ్రీంశీ =ఘుం "టికెట్ల జారీలో ఋణ భారీ మార్పులు: నో ఆఫ్‌లైన్..!!" కానీ వాస్తవాన్ని అవాస్తవంగా ప్రచారం చేస్తూ తనపై తప్పుడు కథనాలు రాస్తున్నారని జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. నిన్నటి కేబినెట్ భేటీలో వాస్తవాలు తెలుసుకోకుండా బోర్డు నిర్ణయాన్ని రద్దు చేయాలని నిర్ణయించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. దీనిపైనే ఆయన మనస్తాపం చెంది పదవి వదులుకుంటున్నట్లు పరోక్షంగా జంగా చెప్పుకొచ్చారు. శ్రీవారి సేవ చేసుకునే అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు, టీటీడీకి రుణపడి ఉంటానన్నారు. అలాగే స్వామివారికి సేవ చేసుకునే అవకాశం కోల్పోతున్నందుకు శ్రీవారికి క్షమాపణలు కోరారు.

### తిరుమల మద్యం బాటిళ్ల వ్యవహారంలో

## అనూహ్య పరిణామాలు




**తిరుమల, జనవరి 9 (మనసులో మాట)..** తిరుమలలో మద్యం బాటిళ్ల వ్యవహారం టీటీడీ పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడిపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. దీనికి కారణం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా, ఓ మీడియా ప్రతినిధి అరెస్ట్ అయిన తర్వాత పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. దీనిపై వైఎస్ఆర్సీపీ ఎదురుదాడికి దిగింది. బీఆర్ నాయుడుకు సవాల్ విసిరింది. సీసీటీవీకి సంబంధించిన పూర్తి ఫుటేజీని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. మద్యం బాటిళ్లను తీసుకువచ్చి ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో హల్చల్ చేసిన వైసీపీ సోషల్ మీడియా, సాక్షి ప్రతినిధి అరెస్టయ్యాడని, తిరుమలలో భక్తుల మనోభావాలను గాయపరిచేలా వ్యవహరించారని, టీటీడీ, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో భూమన కరుణాకర్ రెడ్డి తన ప్రైవేట్ సైన్యంతో నిత్యం అసత్య ప్రచారాలు చేశాడని బీఆర్ నాయుడు ఆరోపించిన విషయం తెలిసిందే. ఇటీవల టీటీడీలో జరిగిన ఘటనలో కరుణాకర్ రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ చేపట్టాలని పోలీసులను కోరుతున్నానని అన్నారు. చాశ్రీంశీ =ఘుం "టికెట్ల జారీలో ఋణ భారీ మార్పులు: నో ఆఫ్‌లైన్..!!" బీఆర్ నాయుడు చేసిన ఈ విమర్శలకు తాజాగా భూమన స్పందించారు. బీఆర్ నాయుడు నిజంగానే భక్తిపరుడే అయితే మొత్తం సీసీ కెమెరా ఫుటేజ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఒకవేళ నిజంగానే మద్యం బాటిళ్లను వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా అక్కడ పెట్టివుంటే- టీటీడీ భద్రత ఏమైందని ప్రశ్నించారు. అలిపిరి వద్ద ఉన్న చెక్ పోస్ట్, టోల్ గేట్, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని దాటుకుని మద్యం బాటిళ్లు తిరుమల కొండపైకి చేరేంత వరకూ చూస్తూ ఎలా ఉన్నారని, ఎందుకు పట్టుకోలేకపోయారని నిలదీశారు. తిరుమల నిఘా వ్యవస్థ కూడా ఏమైందని భూమన ప్రశ్నించారు. నిఘా వ్యవస్థ నిద్రపోతోండటం వల్లే పవిత్రమైన తిరుమల కొండమీద ఎటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. బీఆర్ నాయుడుకు చెందిన ప్రైవేట్ సైన్యం, దళారీ సేన తిరుమల కొండపై రాజ్యమేలుతోందని, వాళ్లే అక్కడ తాగి పడేసి ఉండవచ్చని భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు. కొండపై బీఆర్ నాయుడి అరాచకాలకు అంతెక్కడుందని అన్నారు. ఛానల్ కు అడ్వర్టయిజ్మెంట్లు ఇచ్చే వారికి దర్శనాలు చేయిస్తోన్నాడని, వారందరూ తాగి పడేసి ఉండొచ్చని భూమన ధ్వజమెత్తారు.

### కోడిపందాలు నిర్వహిస్తే

# కఠిన చర్యలు తప్పవు

### - డి.ఎస్.పి హేమంత్ కుమార్



**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి అని డి.ఎస్.పి హేమంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా కోడిపందాలు, టెంకాయ ఆటలు తదితర జూదాలు నిర్వహించిన పాల్గొన్న ప్రోత్సహించిన అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఆటోల ద్వారా మైకు ప్రచారం నిర్వహిస్తూ, రాబోవు సంక్రాంతి పండుగను సందర్భంగా ప్రజలకు కోడి పందాలు, టెంకాయ ఆట వంటి జూదల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కోడి పందాలు టెంకాయ ఆటలు వంటి వాటికి దూరంగా ఉండాలని కోడిపందాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే అటువంటి వారిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కోడిపందాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా, శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి..

### - శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ నామా ప్రసాద్



**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** ప్రతి ఒక్కరూ సేవా భవాని అలవర్చుకోవాలని, తద్వారా ఎంతో తృప్తి సంతోషము లభిస్తుందని శ్రీ సత్య సాయి సేవ సమితి - గాంధీ నగర్ కన్వీనర్ నామాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, సహాయకులకు 380 మందికి భోజనపు ప్యాకెట్లను వాటర్ ప్యాకెట్స్ లను వైద్యులు సిస్టర్ల చేతుల మీదుగా అందజేశారు. ప్రత్యేకంగా గర్భిణీ స్త్రీలకు స్వీట్లు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సేవాదాతగా శ్రీ సత్య సాయి సేవ సమితి వారు నిర్వహించడం జరిగింది. అనంతరం కన్వీనర్ నామా ప్రసాద్ మాట్లాడుతూ దాతల సహాయ సహకారంతోనే గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఎన్ని సంవత్సరాలుగా దాతలు చేస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకొని వారికి కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరెడ్డెంట్ తిపేంద్రనాయక్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవ సమితి వారు చేస్తున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయని, అంతేకాకుండా దాతలు కూడా ముందుకు రావాలని తెలిపారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రి తరఫున సేవాసమితి వరకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు




**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** పట్టణంలోని యశోద పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరెస్పాండెంట్ మల్లికార్జున హాజరై, పలు విషయాలను మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనేది రైతులందరూ ఆనందంతో ఆనందంగా జరుపుకుంటారని, భోగి మంటలు అనేవి మనలో ఉన్న అహంకారాన్ని వదిలి సూర్యుడిలా వెలుగును ప్రసాదించాలని వారు తెలిపారు. అకాడమీ డైరెక్టర్ పృధ్వీరాజ్ పిల్లలందరికీ భోగి పండ్లు వేసి అందరినీ ఆశీర్వదించారు. పాఠశాల హెడ్మాస్టర్ అనూప్ కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి అనేది రైతులు ముఖ్యంగా మూడవ రోజున తమ పశువులకు, భూమికి కృతజ్ఞతగా వాటిని పూజించే రోజు అని తెలిపారు. ఇన్చార్జ్ హెడ్మాస్టర్ ఝాన్సీ మాట్లాడుతూ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు పల్లెటూరి వాతావరణంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం పండుగ ప్రాముఖ్యతను తెలిపారు. తదుపరి విద్యార్థులు అందరూ కూడా లక్ష్మీదేవి పూజను పూజించడం విద్యార్థుల ప్రసంగాలు నాటకాలు భోగిమంటలు ఎద్దుల బండ్లు, విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చేనేత కార్మికులకు ఇచ్చిన

# హామీలు వెంటనే అమలు చేయాలి

### - సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్



**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలోని కదిరి గేట్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం సమీపంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీవోలు సుబ్బానాయుడు, శీను నాయక్, చేతివృత్తుదారుల రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తదితరులు పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ చేనేత కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. ప్రజలను మభ్యపెడుతూ కాలయాపన చేయడమే తప్ప చేనేత రంగానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం పనిచేయడం లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ సరైన స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆగస్టు 7వ తేదీ చేనేత దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేతన్న భరోసా పథకం కింద ప్రతి చేనేత కార్మికుడికి రూ. 25,000, చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత సబ్సిడీ విద్యుత్, అలాగే చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, పట్టణ నాయకులు శ్రీధర్, నల్లగుండ్ల శివ, చెన్నంపల్లి శ్రీనివాసులు, రాజా, కొండ, మల్లికార్జున, సోమందపల్లి నారాయణస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా సమైక్య నాయకులు లలితమ్మ, లింగమ్మ సహా పలువురు చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



### శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో

## సంక్రాంతి ముగ్గుల పోటీలు

**ధర్మవరం జనవరి 9 (మనసులో మాట)..** పట్టణంలోనిఎల్. పి. సర్కిల్ లోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచి విద్యార్థినులు రంగురంగుల హరివిల్లులతో శోభాయమానంగా ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి మన తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా బసవన్న,హరిదాసు, గొబ్బెమ్మలు,పతంగులు,పాలపొంగులు,ఎడ్లబండ్లు,పంటకోతలు,చెరకు,గుమ్మడి,రేగు పండ్లు ప్రతిబింబించేలా సుందరంగా ముగ్గులను వేసి, ఒకరికి ఒకరు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జి. మల్లికార్జున మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, కట్టుబొట్లను మరిచిపోకుండా మన పండుగలను వాటి మూలలను భావి తరాలకు తెలియజేయాలన్నా రూ. ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని విద్యార్థినులను దీవించారు.ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు , పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గంగమ్మ గుడి చైర్మన్ మురుగేష్ ఆధ్వర్యంలో

## అన్నదాన కార్యక్రమం



**పలమనేరు జనవరి 9 ( మనసులో మాట):** పట్టణ సమీపంలోని గంట ఊరు కాలనీ లో తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద ఆలయ చైర్మన్ మురుగేష్ ఆధ్వర్యంలో అత్యంత వైభవముగా పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాలనీలో ఉన్న ప్రజలు ఓం శక్తి మాలలు ధరించి గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం స్వీకరించారు. ప్రతి పౌర్ణమికి 5000 మందికి భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆలయ చైర్మన్ ఇప్పటికే రెండు కోట్లకు పైగా ఆలయాన్ని సుందరీ కారణంగా విద్యుత్ దీపాలంకరణలతో ఏర్పాటు చేయడం జరిగింది. కాలనీలోని ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకు వెళితే అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరించడం జరుగుతుంది. ఇప్పటికే ప్రజలకు గంగమ్మ గుడి ఆలయ చైర్మన్ మురుగేష్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

# టీటీడీ లో కొత్త కొలువులు

### ఖాళీల భర్తీ - అర్హతలు, ప్రమోషన్లు..!!



**తిరుమల, జనవరి 9 ( మనసులో మాట):** టీటీడీలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న ఖాళీల భర్తీకి రంగం సిద్ధం అవుతోంది. ఉద్యోగ నియమకాలతో పాటుగా ప్రమోషన్ల పైన నిర్ణయంతీసుకున్నారు. బర్డ్ ఆసుపత్రి, ఎస్వీ గోశాల, వైద్యవిభాగం, ఆలయ కైంకర్యాల విధుల్లో కీలక మార్పులు చేస్తూ తాజాగా టీటీడీ బోర్డు ఆమోదం తెలిపింది. తుది ఆమోదం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అక్కడి నుంచి అనుమతి రాగానే టీటీడీలో ఉద్యోగ నియామకాల పైన నిర్ణయం ప్రకటించనున్నారు. టీటీడీలో ఖాళీల భర్తీకి నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ప్రతిపాదనలు సిద్ధం చేసారు. ఎస్వీ గోసంరక్షణ శాలలో అసిస్టెంట్ డైరెక్టర్ (2), గోశాల మేనేజర్ (2), డైరీ సూపర్ వైజర్ (6), డైరీ అసిస్టెంట్ (2) చొప్పున మొత్తం 12 పోస్టులను సృష్టించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ఉద్యోగాల కోసం పాలిటెక్నిక్ లో అనిమల్ హస్బెండరీ లేదా తత్సమాన అర్హతతో పాటు వెటర్నరీ అసిస్టెంట్‌గా 5 ఏళ్ల అనుభవం తప్పనిసరిగా పేర్కొన్నారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం వైద్య విభాగంలో 30 ఏళ్లుగా ఒకే హోదాలో పని చేస్తున్న సిబ్బంది విషయం లోనూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రమోషన్ ఛానల్ లేక స్తబ్దుగా ఉన్న పలు పోస్టులను అప్ గ్రేడ్ చేస్తూ నిర్ణయించారు. ఆధునిక ఎంఆర్ఐ, డిజిటల్ మమోగ్రఫీ వంటి పరికరాల నిర్వహణ కోసం ఉన్న రేడియోగ్రాఫర్ పోస్టును చీఫ్ రేడియోగ్రాఫర్ గా పెంచారు. ఫిజియోథెరపిస్ట్ పోస్టు కూడా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.తిరుమలకు ప్లాన్ చేసుకున్నారా, భక్తులకు ఋణ కీలక సూచన..!! కాగా, తాళ్లపాక కైంకర్యపరుడు, మణ్యం దార్ పోస్టుల నియామక నిబంధనలను ఖరారు చేశారు. ఈ పోస్టులకు తమకు వంశపారంపర్య హక్కు కల్పించాలంటూ వచ్చిన విజ్ఞప్తులను బోర్డు అంగీక రించలేదు. ఈ పోస్టుకు తాళ్లపాక సంకీర్తనల్లో ప్రావీణ్యం సర్టిఫికెట్ ఉండాలి. 40 ఏళ్లు మించకూడదని స్పష్టం చేసారు. మణ్యం దార్ పోస్టుకు 8వ తరగతి పాసై, బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలి. వీటితో పాటుగా బర్డ్ ఆసుపత్రిలో రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఆర్థోపెడిక్స్ లేదా అనస్థీషియాలో పీజీ డిగ్రీ లేదా డిప్లొమా అర్హతను నిర్ణయించారు. శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో ప్రొడక్షన్ సూపర్‌వైజర్ పోస్టుకు బీఏఎంఎస్ లేదా బి.ఫార్మసీ (ఆయుర్వేద) డిగ్రీతో పాటు రెండేళ్ల అనుభవం ఉండాలని సవరణ చేసారు. వీటికి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ప్రక్రియ ప్రారంభించనున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శనివారం 10 జనవరి 2026


# గోట్ బ్లడ్ మాఫియా వ్యవహారం

## మేక రక్తం సేకరిస్తున్న మటన్ షాపుపై కేసు నమోదు



**మేడ్చల్, జనవరి 9:** జంతువుల నుంచి రక్తం సేకరణ వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ వాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూగజీవుల నుంచి రక్తం తీసేందుకు ఎలాంటి అనుమతి పొందలేదని పోలీసులు గుర్తించారు. సోను మటన్ అండ్ చికెన్ షాప్‌పై కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ వ్యవహారంపై వెటర్నరీ అధికారులు ఇచ్చిన నివేదికను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. కాగా.. సోను మటన్ షాప్‌లో జీవించి ఉన్న మేక నుంచి రక్తం సేకరించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నెల 4న నాగారంలోని సోను మటన్ షాపుపై కీసర పోలీసులు దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం లభించింది. మేకల నుంచి రక్తాన్ని సేకరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్‌కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎలాంటి వైద్య ప్రమాణాలూ పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.




# ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బలు

## పోలీస్ అధికారులకు లొంగిపోయిన మరో 63మంది

**రాయ్‌పూర్, జనవరి 9:** ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులు తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులు ఎదుట 63 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 18 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ కడ్తీ.. తన భార్యతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న ఆయుధాలను పోలీసులకు మావోయిస్టులు అప్పగించారు. లొంగిపోయిన మొత్తం మావోయిస్టులపై రూ. కోటి రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన లోన్ వర్రాటు (ఇంటికి తిరిగి రండి) ప్రచారంలో భాగంగా వీరంతా లొంగిపోయి నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను శాశ్వతంగా నిర్మూలిస్తామని కేంద్ర ప్రకటించింది. అందుకోసం ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో దాదాపుగా మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. చివరకు ఛత్తీస్‌గఢ్‌లో వారి ప్రభావం కొంత మేర ఉంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా మావోయిస్టుల ఎరివేతకు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దాంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుని.. వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే వేలాది మంది మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఇలా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన రివార్డులను అందజేస్తోంది. అదీకాక.. మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవడం ద్వారా దేశాభివృద్ధిలో భాగం కావాలంటూ ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వం చేపట్టిన కూంబింగ్‌లో పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్‌కాగా.. కీలక నేతలు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు.

# సర్వే ఆఫ్ ఇండియా 'కాఫీ టేబుల్ బుక్' ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 10 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణ రావు హైదరాబాద్‌లో సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన ప్రతిష్ఠాత్మక 'కాఫీ టేబుల్ బుక్'ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గ్రంథం భారతదేశ కార్టోగ్రాఫిక్, శాస్త్రీయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్యానికి ఈ ప్రచురణ తోడ్పడుతుందని తెలిపారు. జియోడెటిక్ ఆస్తుల నమోదు, జియోస్పేషియల్ విజ్ఞానం ప్రణాళిక, భూ పరిపాలన, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది కీలకమని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణ డైరెక్టర్ బి.సి. పరిడా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# వివాదాలు కాదు పరిష్కారం ముఖ్యం

- జలవివాదాలతో రాజకీయ ప్రయోజనం కోరుకోం
- సమస్యలను మనమే కలిసి పరిష్కరించుకుందాం
- ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ సూచన
- కృష్ణా జలాలపై ఏపీతో చర్చలకే ప్రాధాన్యం
- రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవం

## ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులకు అడ్డం పడకండి



**హైదరాబాద్, జనవరి 9 (మనసులో మాట):** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించు కోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరిం చుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేది కగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదన్నారు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళ నాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముం దుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వే స్తుందని సీఎం హామీ ఇచ్చారు. ఈ మేరకు కృష్ణా నది జల వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొం దాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, రాజకీయాలకు అతీతంగా సమస్యల పరిష్కారం కోసం అందరూ సహకరిం చాలని పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తూ.. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అను మతులకు అడ్డంకులు పెట్టవద్దని కోరారు. అడ్డంకుల వల్ల కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం లేదని, రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తా ము వివాదం కోరుకోవడం లేదని.. పరిష్కారమే కోరుకుం టున్నామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాలు కా దని.. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఆలోచిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టీకరించారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ అనిల్ కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్ రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- 2047 లక్ష్యంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- క్యూర్-ప్యూర్-రేర్‌తో డెవలప్‌మెంట్ మోడల్
- గ్లోబల్ ఫ్యూచర్ సిటీగా హైదరాబాద్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 9:** హైదరాబాద్ నగరం నేడు ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడుతోందంటే అది గత మూడు దశాబ్దాల నిరంతర శ్రమ ఫలితమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. జర్మన్ టెక్నాలజీతో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఐవీ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఇటువంటి తయారీ యూనిట్లు రావడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం క్యూర్ , ప్యూర్ , రేర్ అనే మూడు విభాగాలుగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు సీఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే తెలంగాణ పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం వాటా తెలంగాణదేనని, ఫార్మా రంగంలో ప్రపంచమే మన వైపు చూసేలా ఎదుగుతున్నామని గర్వంగా చెప్పారు. ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూల మైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే అని సీఎం అన్నారు. రాజకీయ వివాదాల కంటే సమస్యల పరిష్కారానికే తాము ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని, అడ్డంకుల వల్ల కేంద్ర నిధులు రాక రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలన్నా, నీటి సమస్యలు తీరాలన్నా ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల సహకారం అవసరమని, అందుకే తాము వివాదాల కంటే సామరస్యపూర్వక చర్చలకే మొగ్గు చూపుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల , రైతుల ప్రయోజనాల కోసమే తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు సీఎం తెలిపారు. రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌లోని 'ఫ్యూచర్ సిటీ'లో నివసిస్తున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా నగరాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతూ తెలంగాణను గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చడమే తమ సంకల్పమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# డీజీపీ శివధర్‌కి హైకోర్టులో ఊరట

## నియామకంపై సవాల్ పిటిషన్ కొట్టివేత



**హైదరాబాద్, జనవరి 9 :** తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించారంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి.మధన్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే విధించడానికి నిరాకరించింది.రెగ్యులర్ ప్రాసెస్‌ను 4 వారాల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఖఉంఇ) ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

# నటుడు నవదీప్‌కు హైకోర్టులో ఊరట



## డ్రగ్స్ కేసును కొట్టేసిన తెలంగాణుని న్యాయస్థానం

**హైదరాబాద్, జనవరి 9 :** టాలీవుడ్ యంగ్ హీరో నవదీప్‌నకు హైకోర్టులో భారీ ఉపశమనం కలిగింది. అతడిపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణా న్యాయస్థానం కొట్టివేసింది. నవదీప్ వద్ద డ్రగ్స్ ఉన్నట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదనే ఆయన తరఫు న్యాయవాది వెంకట సిద్దార్థ్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ కేసును కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. దీంతో ఈ యంగ్ హీరోకు పూర్తిస్థాయిలో ఉపశమనం లభించినట్లైంది. కొద్ది నెలల క్రితం.. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో హీరో నవదీప్ పేరు వినిపించడంతో ఆయన డ్రగ్స్ తీసుకున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. అందులో భాగంగా.. గుడిమల్కాపూర్‌లో నమోదైన కేసులో ఎఫ్ఐఆర్‌లో అతడి పేరు నమోదైంది. ఈ ఆరోపణలపై నవదీప్ ఘాటుగా స్పందించారు. తనకు, డ్రగ్స్‌కు ఎలాంటి సంబంధం లేదని అతను వాపోయాడు. ఈ నేపథ్యంలోనే తనను అరెస్ట్ చేయొద్దంటూ అతను గతంలో తెలంగాణా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ పిటిషన్ను విచారించిన న్యాయస్థానం.. అరెస్ట్ చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఈ కేసుపై మరోసారి విచారణ చేపట్టింది న్యాయస్థానం. నవదీప్ పేరును కేవలం ఎఫ్ఐఆర్‌లోనే చేర్చారని.. అతను డ్రగ్స్ తీసుకున్నట్టు ఆధారాలేవీ లేవని స్పష్టం కావడంతో ఈ కేసును కొట్టివేసింది.



# మిర్యాలగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో ముగ్గురు మృతి

**నల్లగొండ, జనవరి 9:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరుకు టైల్స్ తరలిస్తున్న డీసీఎం, సిమెంట్ ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటనలోని మృతులంతా బీహార్ వాసులుగా గుర్తించారు. వీరిలో బీరు బాయ్ (30), సంతోష్ (30), సూరజ్ (18) ఉన్నారు. డీసీఎంలో ఉన్న టైల్స్ కూలీల మీద పడటంతో ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.టైల్స్‌ను హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్రేన్ సహాయంతో రహదారిపై నుంచి లారీని, డీసీఎంను తొలగించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేస్తున్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మిర్యాలగూడలోని ఈ రహదారిపై ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా వెళ్లాలని పోలీసులు సూచించారు. పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# హిమాచల్‌లో ఘోర ప్రమాదం

## లోయలో పడ్డ ప్రైవేట్ బస్సు..8మంది దుర్మరణం



**సిమ్లా,జనవరి 9 :** హిమాచల్‌ప్రదేశ్‌లోని సిర్మౌర్ జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేటు బస్సు లోయలో పడి 8 మంది ప్రయాణికులు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుప్వి నుంచి సిమ్లాకు బస్సు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 30 నుంచి 35 మంది ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం హరిపుర్ధార్ ఏరియాలోని ఇరుకైన రహదారిపై వెళ్తుండగా బస్సు అదుపుతప్పి లోయలో పడింది. సహాయక కార్యక్రమాలు చేపట్టినట్టు సిర్మూర్ ఎస్పీ నిశ్చింత్ సింగ్ నెగి తెలిపారు. తొలుత ప్రమాద స్థలికి చేరుకున్న స్థానికులు అత్యవసర సహాయక బృందాలు అక్కడికి చేరుకోకముందే సహాయక చర్యలు చేపట్టారు. పలువురు క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. మరికొందరికి సీరియస్‌గా ఉ ండటంతో హెయర్ మెడికల్ సెంటర్లకు తరలిస్తున్నట్టు నిశ్చింత్ సింగ్ చెప్పారు. ఓ‌ాగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి సుఖేందర్ సింగ్ సుఖు విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకు చర్యలు



**హైదరాబాద్, జనవరి 9:** మహిళలు, చిన్నారుల భద్రత కోసం సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఈ వారం పలు విస్తృత చర్యలు చేపట్టామని డీసీపీ సృజన కరణం తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు చేసి 215 మంది పిల్లలను, అంటే 200 మంది బాలురను మరియు 15 మంది బాలికలను విజయవంతంగా రక్షించగలిగారు . సైబరాబాద్ షీ టీం బృందాలు ఈ వారంలో మొత్తం 127 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 59 మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిలో 63 ఖ।బిబా కేసులు నమోదు కాగా, మిగిలిన వారికి కౌన్సెలింగ్ చేశారు. అదేవిధంగా, మహిళల నుండి అందిన 17 ఫిర్యాదులను షీ టీం బృందాలు స్వీకరించాయన్నారు. భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ సమస్యలును పరిష్కరించే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు కేంద్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా 31 కుటుంబాలను తిరిగి కలిపి, వారి కుటుంబాల్లో వెలుగులను నింపారు. సైబరాబాద్ పరిధిలో వివిధ ప్రాంతాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మహిళలను వేధించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, మహిళలను నిరంతరం వెంబడించడం, భిక్షాటన, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మొత్తం 6,615 మందికి అవగాహన కల్పించామన్నారు. అలాగే మహిళల హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, నేరాల నివారణ కోసం 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించామన్నారు.

# ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

- ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్, జనవరి 9:** మౌలానా ఆజాద్ నేషనల్ ఉ ర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములను తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

# సీనియర్ జర్నలిస్టు ఫజల్ మృతి



**హైదరాబాద్, జనవరి 9:** సీనియర్ జర్నలిస్టు ఫజల్ రహ్మాన్ మొహమ్మద్(65) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో కుటుంబసభ్యులు, సన్నిహితులు, సహచరులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దిశ తదితర పత్రికల్లో వివిధ హోదాల్లో దాదాపు 38 సంవత్సరాలకు పైగా పని చేసిన ఆయన, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'ప్రతిపక్షం' దినపత్రికను నిర్వహిస్తున్నారు. ఫజల్ హఠాత్తుగా క్యాన్సర్ కాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో ఏపీయుడబ్ల్యూజేకి, ప్రత్యేక రాష్ట్రంలో టీయూడబ్ల్యూజే సంఘాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం అని తెలిపింది. వారం రోజుల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఫజల్ కు మెరుగైన చికిత్స అందేలా ఎంతో కృషి చేసినప్పటికీ ఫలితం దక్కలేదని టీయూడబ్ల్యూజే పేర్కొంది. గత కొంతకాలంగా ఆర్థిక కష్టాలను అనుభవిస్తున్న ఫజల్ రహ్మాన్ కుటుంబానికి టీయూడబ్ల్యూజే అండగా నిలిచి, ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తుందని తెలిపింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బొడిగె బసవపున్నయ్య సైతం ఫజుల్ రహ్మాన్ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రాంనారాయణ, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కరీంనగర్‌అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె చంద్రశేఖర్‌తో పాటు వివిధ పత్రికల ఎడిటర్లు, సీనియర్‌రిపోర్టర్లు ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, ఫజల్ రెహ్మాన్ స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్. వృత్తి రీత్యా ఆయన హైదరాబాద్ లో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

# ఏఐ టెక్నాలజీతో డీసిల్టింగ్ పనులు.. జలమండలి కొత్త ప్రయోగం

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్
- శాటిలైట్, జీఐఎస్ పరిజ్ఞానంతో పనిచేసేలా రూపకల్పన
- అడ్డంకులను ముందుగానే పసిగట్టే ఏఐ విధానం

**హైదరాబాద్, జనవరి 9 (మనసులోమాట)**

ల: మానవ రహిత పారిశుద్ధ్య పనుల్లో ఇప్పటికే రోబోటిక్ విధానంతో ప్రతిభ చూపిన జలమండలి, తాజాగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత టెక్నాలజీతో డీసిల్టింగ్ పనులను నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఓ అండ్ ఎం డివిజన్ 2 పరిధిలో ఈ కొత్త విధానాన్ని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాటిలైట్, జీఐఎస్ పరిజ్ఞానంతో పనిచేసే ఈ టెక్నాలజీ ద్వారా మ్యాన్ హోల్ వద్ద మనుషుల అవసరం లేకుండా ఆటోమేటిక్ పొజిషనింగ్ తో డీసిల్టింగ్ పనులు వేగంగా పూర్తి చేయవచ్చని వివరించారు.

### టెక్నాలజీ ప్రత్యేకతలు ఇవే

నిలువుగా ఉండే మ్యాన్‌హోల్స్‌తో పాటు అడ్డంగా ఉన్న పైప్‌లైన్లను శుభ్రం చేసే సెల్ఫ్ డిటెక్టివ్ రోబోటిక్ వ్యవస్థలు ఇందులో ఉన్నాయి. మ్యాన్ హోల్ లో అడ్డంకులు ఏర్పడే ముందే వాటిని అంచనా వేసి నివారించే ఏఐ ఆధారిత ప్రిడిక్షన్, ప్రివెంటివ్ అవకాశం ఉంటుంది. శాటిలైట్ మరియు జీఐఎస్ సమన్వయంతో అండర్‌గ్రౌండ్ సీవరేజ్ వ్యవస్థకు లైవ్ డిజిటల్ మ్యాప్ అనుసంధానం చేస్తారు. నగరవ్యాప్తంగా పారిశుధ్య కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు, ట్రాక్ చేయడానికి రియల్ టైమ్ డ్యాష్‌బోర్డ్లు అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమంలో జలమండలి ఆపరేషన్ డైరెక్టర్ వినోద్ భార్గవ, సీజీఎం నాగేందర్, జీఎం శ్యాం సుందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన ఆవిష్కరణలే లక్ష్యం కావాలి

- యంత్రాలతో పోటీ పడటం విద్య పరమార్థం కాదు: గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- బిట్స్ పిలానీలో ఘనంగా ప్రారంభమైన 'గ్లోబల్ మీట్'
- ఏఐ యుగంలోనూ మానవ విలువలే కీలకమని ఉద్ఘాటన



**మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 10 (మనసులోమాట):**

ప్రపంచ స్థాయి విద్య దిశగా భారత్ చేస్తున్న ప్రయాణంలో బిట్స్ పిలానీ అగ్రగామిగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'బిట్సా గ్లోబల్ మీట్-2026' (బీజీఎం 26) ఆరో ఎడిషన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గవర్నర్‌కు స్వాగతం పలికారు.

### ఏఐకి మానవత్వమే ముఖ్యం

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. నేడు కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, ఆటోమేషన్ రంగాలు విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తున్నాయని తెలిపారు. ఏఐ సమాచారాన్ని విశ్లేషించగలదు కానీ, మానవ విచక్షణ, నైతికత, సృజనాత్మకత, కరుణకు అది ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. విద్య లక్ష్యం యంత్రాలతో పోటీ పడటం కాకుండా, సమాజ హితానికి సాంకేతికతను వినియోగించేలా మానవ విలువలను బలోపేతం చేయడమేనని హితవు పలికారు.

### పూర్వ విద్యార్థులే ప్రాణవాయువు

విశ్వవిద్యాలయాలకు పూర్వ విద్యార్థుల సంఘాలే ప్రాణవాయువు లాంటివని గవర్నర్ అభివర్ణించారు. మీ విజయాలు భారతీయ విలువలతో కూడిన ఆవిష్కరణలకు ప్రేరణగా నిలుస్తున్నాయని, యువతకు మార్గదర్శకులుగా ఉంటూ దేశ స్వయం సమృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'విద్యా దదాతి వినయం..' అనే సూక్తిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ మాట్లాడుతూ సాంకేతికత, నాణ్యమైన విద్య ఆవశ్యకతను వివరించారు. ఈ వేడుకల్లో బిట్స్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.రామగోపాల్ రావు, బీజీఎం ఛైర్‌పర్సన్ అనిత సాకూరు, ఇన్వెస్టర్ కన్వల్ రేఖి, సీఈవో మయూర్ పట్నాలా తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన 'ఖవ్వాలీ' సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- 15వ వార్డులో బోర్లు, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి-విఠల్ సొంత నిధులతో పనులు.. ఎమ్మెల్యే అభినందన
- సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధం: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, జనవరి 09 (మనసులోమాట):**

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. సంగారెడ్డి పట్టణంలోని 15వ వార్డులో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. స్థానిక మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి ఉ విఠల్ తమ సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న మూడు బోర్లు, అలాగే నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. పదవులతో సంబంధం లేకుండా ప్రజా సేవలో ముందుండాలని సూచించారు. వార్డు ప్రజల తాగునీటి ఇబ్బందులను గమనించి సొంత నిధులతో బోర్లు వేయించడం, రోడ్డు నిర్మాణానికి సహకరించడం పట్ల మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి ఉ విఠల్ దంపతులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు సమకూరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వార్డు వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పూర్తి స్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్కే రషీద్, జీవీ శ్రీనివాస్, ఎర్రా కృష్ణయ్య, వడ్డేపల్లి శ్రవణ్ కుమార్, కొత్తపల్లి నాని, జలందర్, గొల్ల బాలరాజ్, పవన్, మామిడి చంద్రమల్లి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట కొత్త సీపీగా సాధన రష్మీ బాధ్యతల స్వీకరణ

**శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత**

**కలెక్టర్ హైమావతిని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ**

**హైదరాబాద్ ఎస్బీ జాయింట్ సీపీగా వెళ్లిన మాజీ సీపీ విజయ్ కుమార్**



**మనసులోమాట-సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా నూతన కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా (సీపీ) సాధన రష్మీ మెరుమాళ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె, గతంలో హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా విధులు నిర్వహించారు. బదిలీపై సిద్దిపేట జిల్లాకు వచ్చిన ఆమె, కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి, శాంతి భద్రతల పరిరక్షణే తన తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీ సాధన రష్మీ, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో జిల్లా కలెక్టర్ కె. హైమావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు జిల్లాలోని పరిస్థితులపై చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లు, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కాసేపు చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీపీ సాధన రష్మీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు నేరాల నియంత్రణపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యంగా సిద్దిపేటలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి శాంతి భద్రతలు కీలకమని, పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేస్తామని కలెక్టర్ హైమావతి తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ సీపీగా పనిచేసిన విజయ్ కుమార్, హైదరాబాద్ ఎస్బీ (స్పెషల్ బ్రాంచ్) జాయింట్ సీపీగా బదిలీ అయ్యారు. జిల్లాలో ఆయన అందించిన సేవలను అధికారులు ఈ సందర్భంగా కొనియాడారు.

# పాఠశాలలో భోజనం భేష్

**రుచి, నాణ్యతపై కలెక్టర్ సంతృప్తి**

**చిన్నకోడూరు మండలం అనంతసాగర్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**

**మెనూ తప్పనిసరిగా పాటించాలి.. అడ్మిషన్లు పెంచాలి**

**ఉపాధ్యాయులకు, సిబ్బందికి కలెక్టర్ హైమావతి ఆదేశాలు**



**మనసులోమాట-సిద్దిపేట**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించకూడదని జిల్లా కలెక్టర్ కె. హైమావతి స్పష్టం చేశారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామంలోని జెడ్పీ (గ్రా) ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డించే అన్నం, సాంబారు, చిక్కుడుకాయ కూర, కోడిగుడ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచి, పరిమాణం బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి.. 'భోజనం సరిపోతుందా? రుచిగా ఉంటోందా?' అని ఆరా తీశారు. అనంతరం ప్రిన్సిపల్, ఫుడ్ చెకింగ్ టీచర్, వంట సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన 'కామన్ డైట్ మెనూ'ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా సరుకులు వాడుతూ, రుచికరంగా వంట చేయాలన్నారు. పాఠశాల సమయాల్లో విద్యార్థులు బయటికి వెళ్లకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. అదే ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ సందర్శించారు. పిల్లలు ఆసక్తిగా వినేలా బోధన ఉండాలని, తద్వారా పాఠశాలలో అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇక్కడ కూడా మెనూ ప్రకారమే భోజనం అందించాలని ఆదేశించారు.



# యువతే సాంకేతిక భవిష్యత్తుకు మార్గదర్శకులు

## ఐఐటీలో 'ఎలాన్ & ఎన్‌విజన్' షురూ

**మానవ విలువలతో కూడిన ఆవిష్కరణలు అవసరం: మంత్రి శ్రీధర్ బాబు**

**మనసులోమాట- సంగారెడ్డి**

తెలంగాణ రాష్ట్రం యువతకు అంకితమైన రాష్ట్రమని, దేశ సాంకేతిక భవిష్యత్తుకు యువతే మార్గదర్శకులని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక సాంకేతికఉసాంస్కృతిక ఉత్సవం 'ఎలాన్ & ఎన్‌విజన్-2026' శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సాంకేతిక పురోగతి వేగంగా సాగుతున్న ఈ తరుణంలో మానవ విలువలు, సామాజిక బాధ్యతలను విస్మరించకూడదని మంత్రి హితవు పలికారు. 17వ ఎడిషన్‌గా జరుగుతున్న ఈ ఉత్సవంలో యువత, స్టార్టప్‌లు, పరిశ్రమలు ఒకే వేదికపైకి రావడం ఆనందకరమన్నారు. ఐఐటీ హైదరాబాద్ అభివృద్ధి చేసిన 'స్వయంచాలక నావిగేషన్ వాహనాలు' వంటి ఆధునిక ఆవిష్కరణలు దేశాన్ని సాంకేతికంగా ముందుకు నడిపిస్తున్నాయని ప్రశంసించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాన్వేషకులుగానే మిగిలిపోకుండా, కొత్త ఆలోచనలతో ఆవిష్కర్తలుగా మారి సమాజానికి కొత్త దారులు చూపాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్ బి.ఎస్. మూర్తి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ.. ఎలాన్ & ఎన్‌విజన్ వేదిక ఐఐటీ హైదరాబాద్ ఆత్మస్వరూపాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. తరగతి గదులను దాటి ఆలోచించేందుకు, విభిన్న విభాగాల మధ్య సహకారం పెంపొందించేందుకు ఈ ఉత్సవం దోహదపడుతుందన్నారు. "మానవాళి కోసం సాంకేతిక ఆవిష్కరణలు" అనే తమ లక్ష్యానికి ఈ వేదిక నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ ఏడాది ఉత్సవాలను "ది లాస్ట్ రోనిన్" థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ధైర్యం, స్వతంత్రత, అచంచల సంకల్పం వంటి విలువలను ఈ థీమ్ ప్రతిబింబిస్తుందని, ఇది భవిష్యత్ ఆవిష్కర్తలకు ప్రేరణగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు టెక్ పోటీలు ప్రారంభోత్సవంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కూచిపూడి నృత్య బృందం చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా రోబోటిక్స్, హ్యాకథాన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, జనరేటివ్ ఏఐ, సైబర్ భద్రత అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ప్రముఖ బాలీవుడ్ గాయకుడు మోహిత్ చౌహాన్ సంగీత విభావరి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అలాగే ప్రణవ్ శర్మ, అనూజ్ రెహాన్, డీజే తాషా, డెక్కన్ ప్రాజెక్ట్ బ్యాండ్ ప్రదర్శనలు అలరించనున్నాయి.

**నేడు 'ఎన్‌విజన్ ఎక్స్' సమ్మిట్**

శనివారం (జనవరి 10న) "ఎన్‌విజన్ ఎక్స్ ఉ టెక్ సమ్మిట్"ను నిర్వహించనున్నారు. "సుస్థిరత మరియు స్వచ్ఛ శక్తి" అనే అంశంపై నిపుణులు, యువ సాంకేతిక నిపుణులు ఇందులో చర్చించనున్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు హేయం

**సభ్యసమాజం సిగ్గుపడేలా ఘటనలు: పాస్టర్ తిమోతి జయరాజు**

**క్రైస్తవ సంఘాల పక్షాన తీవ్ర ఖండన**

**కరీంనగర్, జనవరి 09 (మనసులోమాట):**

బంగ్లాదేశ్‌లో హిందూ సోదర, సోదరీమణులపై జరుగుతున్న దాడులను ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాస్టర్ల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం కరీంనగర్‌లో సంఘం అధ్యక్షుడు పాస్టర్ తిమోతి జయరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవ సంఘాల పక్షాన ఆయన ఈ ఘటనలపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిమోతి జయరాజు మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో మానవత్వం మంటగలిసేలా, సభ్యసమాజం సిగ్గుపడే రీతిలో దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కనీసం మహిళలని కూడా చూడకుండా, ఒక పథకం ప్రకారం హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం దారుణమని పేర్కొన్నారు. పొరుగు దేశంలో నివసిస్తున్న హిందూ సోదరుల రక్షణ పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బంగ్లాదేశ్ ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఈ దాడులను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని, అక్కడి హిందువులకు భద్రత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# చిమ్మాపూర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..

**సర్పంచ్ కృష్ణ గౌడ్**

**సొంత నిధులతో పంచాయతీకి బోరు**



**సంగారెడ్డి, జనవరి 09 (మనసులోమాట):**

కంది మండలంలోని చిమ్మాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్ స్పష్టం చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయ అవసరాల నిమిత్తం, నీటి సమస్య తలెత్తకుండా తన సొంత నిధులతో బోరు వేయించినట్లు తెలిపారు. తన చొరవతో కార్యాలయానికి నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. ప్రజా అవసరాలే పరమావధిగా పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవాన్ని త్వరలోనే అట్టహాసంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ గౌడ్ వెల్లడించారు.

# కాశీపూర్ సర్పంచ్‌కు వీరశైవ సమాజం ఘన సన్మానం

**గ్రామ అభివృద్ధికి చేస్తున్న కృషికి ప్రశంసలు**

**శాలువాతో సత్కరించిన జిల్లా అధ్యక్షులు, సభ్యులు**



**సంగారెడ్డి, జనవరి 09 (మనసులోమాట):**

గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు సమాజం నుంచి మద్దతు లభిస్తోంది. కంది మండలంలోని కాశీపూర్ గ్రామ సర్పంచ్ షాపురం కృష్ణ గౌడ్‌ను వీరశైవ సమాజం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ ప్రగతి కోసం సర్పంచ్ కృష్ణ గౌడ్ చేస్తున్న కృషిని వీరశైవ సమాజం సభ్యులు ఈ సందర్భంగా ప్రశంసించారు. రానున్న రోజుల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో తమ సమాజం తరపున ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సర్పంచ్‌కు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు, గౌరవ సలహాదారులు మరెల్లి అడవప్ప, వెన్నెచకేశ్వర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల్లో సర్పంచ్ సతీమణికి 'బెస్ట్ అవార్డ్'

**మంత్రి పొన్నం, సీపీ సాధన రష్మీ చేతుల మీదుగా పురస్కారం**



**కోహెడ, జనవరి 09 (మనసులోమాట):**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో కోహెడ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన వారు సత్తా చాటారు. ఆరేపల్లి గ్రామ సర్పంచ్ చిట్యాల బాబురాజు సతీమణి చిట్యాల సుభద్ర తన కళా నైపుణ్యంతో అందరి మన్ననలు పొందారు. గ్రామ స్థాయిలో జరిగిన పోటీల్లో మొదటి బహుమతి, కోహెడ మండల స్థాయిలో మూడవ బహుమతి సాధించిన ఆమె.. తాజాగా హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయిలో 'బెస్ట్ అవార్డు'ను కైవసం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్ సాధన రష్మీ మెరుమాళ్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సుభద్రను మంత్రి, సీపీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# దుండిగల్‌లో పడకేసిన పారిశుధ్యం

**దోమల బెడద, దుమ్ము ధూళితో ప్రజల అవస్థలు**

**తక్షణమే చర్యలు తీసుకోవాలి: పీసరి కృష్ణారెడ్డి**



**కుత్బుల్లాపూర్, జనవరి 09 (మనసులోమాట):**
దుండిగల్ సర్కిల్ పరిధిలో పారిశుధ్యం లోపించిందని, దోమల బెడద విపరీతంగా పెరిగిందని దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై శుక్రవారం ఆయన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బౌరంపేట డివిజన్‌లో వారం రోజులుగా దోమల వ్యాప్తి పెరిగిందని, వెంటనే ఫాగింగ్ చేసి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే బౌరంపేట నుండి సారిగూడెం వెళ్లే ప్రధాన రహదారిలో ఆర్ఎంసీ ప్లాంట్ల వల్ల దుమ్ము, ధూళి ఎగసిపడుతోందని, దీనివల్ల వాహనదారులు ఇబ్బంది పడటమే కాకుండా ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి దమ్మగారి సీతారాంరెడ్డి, సీనియర్ నాయకులు డి. ప్రభాకర్ రెడ్డి, నల్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

**చిన్నశంకరంపేట మండలం చందంపేటలో సీసీఎల్ క్రికెట్ పోటీల ప్రారంభం**

**అతివేగం ప్రాణాలకు ముప్పు.. హెల్మెట్ తప్పనిసరి: ఎస్సై నారాయణ గౌడ్**

**యువతతో ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించిన పోలీసులు**



**చిన్నశంకరంపేట, జనవరి 09 (మనసులోమాట):**
క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చందంపేట గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఎల్ క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీలత సామి రాజ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఇతర నాయకులతో కలిసి ఎస్సై క్రీడలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి విజయానికి నాంది అని క్రీడాకారులకు సూచించారు. అనంతరం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత వాహనాలను అతివేగంగా నడుపుతూ క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా యువతతో ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైకిళ్లు, చిన్నారులకు కుర్చీల పంపిణీ

**కుమారుడి జ్ఞాపకార్థం టేక్మాల్ శైలజ శేఖర్ రెడ్డి దంపతుల వితరణ**

**ధర్పల్లి పాఠశాల విద్యార్థినులకు 2 సైకిళ్లు, అంగన్వాడీకి 50 కుర్చీల అందజేత**

**దాతలను శాలువాతో సన్మానించిన ఉపాధ్యాయులు**




**మెదక్, జనవరి 9 (మనసులోమాట):**
మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం ధర్పల్లి గ్రామంలో తమ కుమారుడు అక్షిత్ రెడ్డి జ్ఞాపకార్థం గ్రామ వార్డు మెంబర్ టేక్మాల్ శైలజ శేఖర్ రెడ్డి దంపతులు సేవా కార్యక్రమం చేపట్టారు. స్థానిక పాఠశాలలో సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వస్తున్న ఇద్దరు విద్యార్థినులకు 2 సైకిళ్లను, అంగన్వాడీ చిన్నారుల కోసం సుమారు 50 కుర్చీలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పక్క గ్రామాల నుంచి పాఠశాలకు నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులకు సైకిళ్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.
విద్యార్థినుల సమస్యను చెప్పిన వెంటనే స్పందించిన శేఖర్ రెడ్డికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపి, ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులోనూ పాఠశాలకు సహకారం అందించాలని కోరారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో తమ కూతురు హర్షిత రెడ్డి చేతుల మీదుగా పిల్లలకు కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సర్పంచ్ మానస మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ తడకపల్లి మహేందర్, మాజీ నీటి సంఘం చైర్మన్ లింగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టైగర్ నరసింహా గౌడ్, పాండు, మాజీ ఎంపీటీసీ ఉప్పరి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల కడుపు కొడితే ఊరుకోం..

- ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు
- కుత్బుల్లాపూర్ టీయూడబ్ల్యూజే విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ హెచ్చరిక
- అక్రిడిటేషన్ కార్డుల కోతపై ఆగ్రహం.. త్వరలో పోరాట కార్యాచరణకు సిద్ధం కావాలి
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక.. అధ్యక్షుడిగా మాదగారి సుగ్రీవుడు




**కుత్బుల్లాపూర్, జనవరి 09 (మనసులోమాట):**
జర్నలిస్టుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే ఉద్యమం తప్పదని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-హెచ్ 143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జర్నలిస్టుల విస్తృత స్థాయి సమావేశం సూరారం వీఐపీ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ అధ్యక్షుడు సుధీర్ మంకాల అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మారుతి సాగర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సంక్షేమ నిధికి ఒక్క రూపాయి ఇవ్వలేదు

గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు తాము అండగా నిలిచామని, నాడు 23,000 అక్రిడిటేషన్ కార్డులు అందించడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కార్పొరేట్ హెల్త్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్యం అందించిన ఘనత తమ యూనియన్‌దేనని మారుతి సాగర్ గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో 42 కోట్ల సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారని, కానీ ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీలు ఇచ్చి 2 ఏళ్లు గడుస్తున్నా సంక్షేమ నిధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆయన విమర్శించారు.

## కొత్త జీవోలతో పాత్రికేయుల మధ్య చిచ్చు

ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన కొత్త జీవోల వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,000 అక్రిడిటేషన్ కార్డులకు కోత పడిందని, ఇది జర్నలిస్టులకు తీరని నష్టమని మారుతి సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేబుల్ జర్నలిస్టులకు అన్యాయం చేయడం సరికాదని, డెస్క్ జర్నలిస్టులకు విడిగా జీవో జారీ చేసి క్షేత్రస్థాయి జర్నలిస్టులకు వారి మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. జీవో నంబర్ 252ను వెంటనే సవరించాలని, లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

## సంక్రాంతి తర్వాత ప్రత్యక్ష పోరాటం

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తే పాలాభిషేకం చేస్తామని, విస్మరిస్తే రోడ్లపై నిలదీస్తామని ఘాటుగా హెచ్చరించారు. పదవులను పొడిగించుకోవడంపై ఉన్న శ్రద్ధ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటం చేస్తామని, ధర్నాలు, రాస్తారోకోలతో నిరసన తెలియజేస్తామని భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు.

## నూతన కమిటీ ఎన్నిక..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుత్బుల్లాపూర్ టీయూడబ్ల్యూజే హెచ్ 143 నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సింగిరెడ్డి కృష్ణ రెడ్డి, అధ్యక్షుడిగా మాదగారి సుగ్రీవుడు, ప్రధాన కార్యదర్శిగా నాలేటి మాధవరెడ్డి, కోశాధికారిగా ఎర్రోళ్ల బాబు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా మహేందర్ రెడ్డి, బాన్సువాడ వెంకటేష్, కోటా శ్రీనివాస్, కళ్యాణ్, సహాయ కార్యదర్శులుగా సాయి జుట్టు, ప్రమోద్, సూర్య చందర్, ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా పలనాటి శివ కుమార్, కార్యవర్గ సభ్యులుగా యాకూబ్, పాండురంగ, బిక్షపతి, పెంటయ్య, సందీప్, పి. శివలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కోలా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలెపాక వెంకట్, మాజీ అధ్యక్షులు అమరేందర్, రాష్ట్ర నాయకులు ఉద్దండపురం వెంకటేష్ గౌడ్, రవి చంద్ర, శివాజీ, శ్రీనివాస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మరియు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కారుతోనే పేదల సొంతింటి కల సాకారం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు: ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు
- పెద్దపల్లిలోని పలు వార్డుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల అందజేత



**పెద్దపల్లి, జనవరి 09 (మనసులోమాట):**
పెద్దపల్లి పట్టణంలోని 13, 14, 32, 33 వార్డుల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ, శంకుస్థాపనలు చేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంలో సొంతిల్లు లేని పేద ప్రజలు చాలా మంది ఉన్నారని, వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట పేదలను మోసం చేసిందని, పేదలకు ఒక్క ఇల్లు కూడా అందించలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కానీ ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని తెలిపారు. ఇళ్ల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏఈ, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ సంబరాలు

**క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి: పిసిసి డెలిగేట్ విట్టల్ రెడ్డి**

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచన**

**జుక్కల్, జనవరి 9 (మనసులోమాట):**
బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిసిసి డెలిగేట్ సభ్యులు విట్టల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, ప్రణాళికాబద్ధంగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దర్పల్ గంగాధర్, వాజీద్ నగర్ సర్పంచ్ గోపాల్ రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని వారు హితవు పలికారు.
ఫేర్‌వెల్ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా అమ్మాయిల ప్రదర్శనలు, యువతీ యువకుల డీజే డ్యాన్సులు కళాశాలలో కోలాహలాన్ని, విద్యార్థులకు ఆనందాన్ని కలిగించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డితో పాటు లెక్చరర్లు శివ కుమార్, నాగరాజు, శంకర్, సంజు, సామ్సన్, ఉర్దూ మీడియం కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# మిర్జాపల్లిలో మద్య నిషేధం

**గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం**




**చిన్నశంకరంపేట, జనవరి 9 (మనసులోమాట):**
ప్రజల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను దెబ్బతీస్తున్న మద్యాన్ని అరికట్టేందుకు మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సర్పంచ్ సునీత యాదగిరి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమై గ్రామంలో మద్యపానాన్ని, బెల్ట్ షాపులను నిషేధిస్తూ తీర్మానం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మద్యం అమ్మితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పాలకవర్గం విద్యార్థులతో కలిసి గ్రామంలో మద్య నిషేధ ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మనోజ్ కుమార్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉలెన్ బ్లాంకెట్ల పంపిణీ

**సత్య దివిస్ ఫార్మా సహకారంతో పంపిణీ**

**విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరాలి: డీఐసీ జీఎం తీర్థు నాయక్**



**సంగారెడ్డి, జనవరి 09 (మనసులో మాట):**

చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు అండగా నిలిచేందుకు అధికారులు, దాతలు ముందుకొచ్చారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు (డీడీ) టి. అఖిలేష్ రెడ్డి ప్రత్యేక చొరవ, సూచనల మేరకు శుక్రవారం సంగారెడ్డిలోని సమీకృత బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఉలెన్ బ్లాంకెట్లను (దుప్పట్లు) పంపిణీ చేశారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ తీర్థు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బ్లాంకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సేవ చేయడం, వారికి సహాయపడటం తనకెంతో సంతృప్తినిచ్చిందని, దీన్ని అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గడ్డపోతారంలోని సత్య దివిస్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఏ. నాగేశ్వరరావు సహకారంతో ఈ బ్లాంకెట్లను సమకూర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి. శంకర్, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వివేకానంద జయంతి

**పాత బస్టాండ్ నుంచి ఐబీ వరకు భారీ ప్రదర్శన**

**యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి: డాక్టర్ కూన వేణు**

**ఆటపాటలతో అలరించిన విద్యార్థులు, కళాకారులు**



**సంగారెడ్డి, జనవరి 09 (మనసులో మాట):**

స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కూన వేణు ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఐబీ (ఎడీ) చౌరస్తాలో ఉన్న వివేకానంద విగ్రహం వరకు ఈ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు, కళాకారుల ఆటపాటలతో ర్యాలీ కోలాహలంగా సాగింది. అనంతరం ఐబీ వద్ద ఉన్న వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూన వేణు మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానందుని ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. యువతరం తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని గుర్తుచేశారు. అనంతరం మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ.. వివేకానందుని బోధనలు నేటి యువతకు దిక్సూచిలాంటివని అన్నారు. విద్య, క్రమశిక్షణ, దేశభక్తి విలువలతో ముందుకు సాగితే సమాజంలో సానుకూల మార్పు తథ్యమని పేర్కొన్నారు. యువత తమ శక్తిసామర్థ్యాలను సృజనాత్మకంగా వినియోగించి రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏర్పుల శ్రీనివాస్, బాలు యాదవ్, రాయల్ కళాశాల డైరెక్టర్ కృపానిధి, మంద భాస్కర్ రెడ్డి, జగదీశ్వర్, సంయుక్త పాఠశాల ప్రతినిధి రామకృష్ణ, అరవింద్, వెంకట్, శివ, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు జుబేదా బేగం, ఆశన్న గౌడ్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# కష్టపడితే పదవులు వరిస్తాయి

**రైతులకు అండగా ఉండాలి**

**సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నర్సింహారెడ్డి ప్రమాణ స్వీకారం**

**హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీనియర్ నేత జగ్గారెడ్డి**




**సంగారెడ్డి, జనవరి 09 (మనసులో మాట):**

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఆలస్యమైనా పదవులు కచ్చితంగా దక్కుతాయని, ఇందుకు నిదర్శనం అలివేని నర్సింహారెడ్డి అని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సదాశివపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సదాశివపేట మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అలివేని నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేత తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీ పనిచేయాలన్నారు. అన్నదాతలకు పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో కమిటీ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందన్నారు. పార్టీ కోసం శ్రమించిన వారికి సముచిత గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు, సీడీసీ (జలజ) చైర్మన్ రామ్‌రెడ్డి, ఆత్మ (గాంధీనా) చైర్మన్ ప్రభు, సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ చందర్ నాయక్, నాయకులు మునిపల్లి సత్యనారాయణ, సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.





# భయం వద్దు.. మేమున్నాం!

- **పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన**
- **ఆపదలో ఉంటే షీ టీమ్స్‌ను సంప్రదించాలి: సిఐ నరేష్ కుమార్**
- **గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై వివరించిన ఎస్ఐ ఉషారాణి**

**మంచిర్యాల, జనవరి 9 (మనసులో మాట):**

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆపద సమయాల్లో పోలీసుల సహకారం తీసుకోవడానికి వెనుకాడకూడదని మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ కుమార్ సూచించారు. నస్పూర్‌లోని మార్టిన్ గ్రామర్ హైస్కూల్‌లో షీ టీమ్, మహిళా భద్రతా చట్టాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను లైంగిక వేధింపుల నుంచి ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని, పిల్లలపై నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఈవ్ టీజింగ్, వేధింపులు ఎదురైతే భయపడకుండా డయల్ 100కి లేదా షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి, ఎస్.ఐ. ఉషారాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు 'గుడ్ టచ్ ఉ బ్యాడ్ టచ్' గురించి అర్థమయ్యేలా వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, తాకకూడని చోట తాకినా వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'టీ సేఫ్' యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 63039 23700 లేదా మంచిర్యాల షీ టీమ్ నంబర్ 87126 59385 లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సభిహా సుల్తానా, షీ టీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ పాఠశాలలో ఉచిత వైద్య పరీక్షలు

- **ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్, మేధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిబిరం**
- **పరీక్షలు నిర్వహించిన డాక్టర్ గోవర్ధన్ రెడ్డి**
- **నిర్వాహకులకు ఘన సన్మానం.. తల్లిదండ్రుల హర్షం**



**కిష్టాపూర్, జనవరి 9 (మనసులో మాట):**

నేటి బాలలే రేపటి పౌరులన్న సూక్తిని నిజం చేస్తూ, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా జన్నారం మండలంలో ఒక బృహత్తర కార్యక్రమం జరిగింది. మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్ మరియు మేధా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విద్యార్థులకు వరంలా మారింది. ఈ శిబిరంలో ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గోవర్ధన్ రెడ్డి (ఎంబీబీఎస్, డీసీహెచ్) విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించారు. గ్రామీణ విద్యార్థుల్లో తరచూగా కనిపించే పోషకాహార లోపం, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఆరోగ్యవంతమైన శరీరం ఉంటేనే చదువుపై ఏకాగ్రత సాధ్యమవుతుందని, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో మేధా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ జిషన్ రాయ్, సీనియర్ కోఆర్డినేటర్ పి. అజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఆదిత్య చిల్డ్రన్స్ హాస్పిటల్ యాజమాన్యం మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతలో భాగంగానే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. గ్రామీణ విద్యార్థుల కోసం సమయాన్ని కేటాయించి సేవలు అందించిన డాక్టర్ గోవర్ధన్ రెడ్డిని, ఆస్పత్రి నిర్వాహకులు మగ్గిడి తిరుపతిని పాఠశాల హెడ్ మాస్టర్ గుండా రాజన్న, ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సత్కరించారు. చిన్నారుల ఆరోగ్యంపై ఆదిత్య హాస్పిటల్ చూపుతున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ధముక కమలాకర్, జడి మురళి, ఏ. గోవర్ధన్, ఇతర ఉపాధ్యాయులు, ఆదిత్య హాస్పిటల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఉచితంగా వైద్య సేవలు అందడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# చైనా మాంజా.. ప్రాణాలతో చెలగాటం వద్దు

- **విద్యార్థులకు అవగాహన కల్పించిన అటవీ శాఖ, సర్పంచ్**
- **పిట్టగోడలు, భవనాలపై జాగ్రత్తగా ఉండాలి: సర్పంచ్ సుతారి సుమలత**
- **విక్రయించినా, వాడినా కఠిన చర్యలు: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భోజ్యా నాయక్**

**మంచిర్యాల, జనవరి 9 (మనసులో మాట):**

సంక్రాంతి పండుగ వేళ గాలిపటాలు ఎగురవేసే క్రమంలో నిషేధిత చైనా మాంజాను వాడటం ప్రాణాలకే ప్రమాదమని, దీని వినియోగం చట్టరీత్యా నేరమని చింతగూడ గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం చింతగూడ గ్రామ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'చైనా మాంజా వాడకం వల్ల కలిగే నష్టాల'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

**ప్రమాదాలకు తావివ్వద్దు..**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ సుమలత మాట్లాడుతూ.. సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పతంగులు ఎగురవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భవనాలపై ఉన్న పిట్టగోడలు, అంచులపై నిలబడి గాలిపటాలు ఎగురవేస్తూ ప్రమాదాల బారిన పడవద్దని కోరారు. కేవలం క్షణిక వినోదం కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని హితవు పలికారు.

**నిషేధిత మాంజాతో ముప్పు..**

అనంతరం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భోజ్యా నాయక్ మాట్లాడుతూ.. పర్యావరణానికి, పక్షులకు మరియు మనుషులకు తీవ్ర హాని కలిగించే చైనా మాంజాలను ప్రభుత్వం నిషేధించిందని గుర్తు చేశారు. ఈ మాంజా తెగకపోవడం వల్ల పక్షులు అందులో చిక్కుకుని మరణించడమే కాకుండా, రహదారులపై వెళ్లే వాహనదారుల మెడకు చుట్టుకుని ప్రాణాపాయ స్థితికి కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించి చైనా మాంజాను విక్రయించినా, వాడినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, మండల మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, ఉప సర్పంచ్ ఆసంపల్లి కావ్య అనిల్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు మేకల అక్షయ్ కుమార్, కొండుకూరి సురేష్, పెంద్రం రవీందర్, లాకావత్ రేణుక మహేందర్, పాఠశాల బోధనా సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# డీసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున్ బాధ్యతల స్వీకరణ

- సమష్టి కృషితో పార్టీని గెలిపిస్తాం: ఎమ్మెల్యేలు మదన్ మోహన్, లక్ష్మీకాంతరావు
- కామారెడ్డిలో నూతన పార్టీ కార్యాలయం ప్రారంభం



**జుక్కల్, జనవరి 09 (మనసులోమాట):**

కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపులు, తగాదాలు లేవని, అందరం కలిసికట్టుగా సమష్టి కృషితో రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం ఎమ్మెల్యేల సమక్షంలో కామారెడ్డి డీసీసీ నూతన అధ్యక్షుడిగా మల్లికార్జున్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు తదితరులు నూతన అధ్యక్షుడిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాజకీయాల్లో కొందరికి అవకాశాలు వస్తాయని, మరికొందరికి రావని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేస్తే అవకాశాలు వాటంతట అవే వస్తాయని, పార్టీని కాపాడుకుంటేనే నాయకులకు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. తమకు పార్టీనే జెండా అని, వేరే ఇతర అజెండాలు లేవని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్నామని, రాబోయే అన్ని ఎన్నికల్లోనూ ఇదే విజయ పరంపర కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన కార్యాలయం అందరికీ సంబంధించినదని, ఏ ఒక్కరికో పరిమితం కాదని తెలిపారు.

## పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి.. ముగ్గురు అరెస్ట్

**వివరాలు వెల్లడించిన ఎస్సై రాజు**



**జుక్కల్, జనవరి 09 (మనసులోమాట):**

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సుల్తాన్ పేట్ గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడి చేశారు. పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఎస్సై రాజు తన సిబ్బందితో కలిసి ఈ రైడ్ నిర్వహించారు. పోలీసుల దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, మరో ఏడుగురు పేకాటరాయుళ్లు అక్కడి నుంచి పరారయ్యారు. ఘటనా స్థలం నుంచి రూ. 11,320 నగదు, 3 సెల్ ఫోన్లు, 8 ద్విచక్ర వాహనాలను (బైక్‌లు) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శంభు దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరించిన హరీష్ రావు

**15న శివపార్వతుల కళ్యాణానికి ఆహ్వానం**

**ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ ట్రస్ట్ సభ్యులు**



**గజ్వేల్, జనవరి 09 (మనసులోమాట):**

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొండపాక మండలం దుద్దెడ శంభు దేవాలయ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు, 15న జరిగే శివపార్వతుల కళ్యాణానికి హాజరుకావాలని కోరుతూ ఆలయ ట్రస్ట్ సభ్యులు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హరీష్ రావు.. కళ్యాణోత్సవానికి తప్పకుండా వస్తానని, ఆ దేవుని దయ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి, ట్రస్ట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంచాల శ్రీనివాస్, పెద్దంకుల శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, గ్రామ అధ్యక్షుడు చిలుముల రామ్మోహన్ ముదిరాజ్, నాయకులు దోమల ఎల్లం, పబోజు భాస్కర్, సలేంద్ర రమేష్ చందర్, ఎండి.మగ్దుమ్, పల్లె బాబు, బసవరాజు నవీన్ చంద్, జక్కుల శ్రీశైలం, కెమ్మసారం సంతోష్, మెరుగు శివ కుమార్, గాధగోని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్నూర్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

**రాహుల్, సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన**



**జుక్కల్, జనవరి 09 (మనసులోమాట):**

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హన్మంత్ యాదవ్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేటీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అబ్బు, అజీమ్ పటేల్, బస్వరాజ్ పటేల్, బాలు యాదవ్, గంగాధర్, అవినాష్, సాహెబ్ రావు, శ్యామ్ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అక్కారంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ

**గ్రామ అభివృద్ధే లక్ష్యం.. తక్షణమే స్పందించిన సర్పంచ్**

**విద్యుత్ సరఫరా పునరుద్ధరణతో గ్రామస్తుల హర్షం**



**గజ్వేల్, జనవరి 09 (మనసులోమాట):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామం 4వ వార్డులో మినీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై గ్రామ సర్పంచ్ శ్రీవాణి హనుమంత్ తక్షణమే స్పందించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయించి సరఫరాను పునరుద్ధరించారు. సమస్యను వెంటనే పరిష్కరించినందుకు గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి, వెంకటేష్ యాదవ్, ప్రసాద్, జి. రాజు, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రభుత్వం సాయం పెంచి భరోసా కల్పించాలి: మాదాసు శ్రీనివాస్**

**అహ్మదిపూర్‌లో లబ్ధిదారులకు చెక్కుల అందజేత**



**గజ్వేల్, జనవరి 09 (మనసులోమాట):**

మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గజ్వేల్ మండలం అహ్మదిపూర్ గ్రామంలో శుక్రవారం పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు: చాద కిష్టమ్మ (రూ. 13,500), కుంటా మాధవరెడ్డి (రూ. 21,000), కుంట్రంగల కవిత (రూ. 33,000), చాకలి పెంటకడి బాల్ రాజు (రూ. 13,500). ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా లేకున్నా బీఆర్ఎస్ ఎప్పుడూ పేద ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటుందన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం సీఎంఆర్ఎఫ్ సాయం తక్కువగా అందుతోందని, ప్రభుత్వం నిధులు పెంచి ప్రజలకు భరోసా కల్పించాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో ఆప్షన్ అహ్మద్, గ్రామ అధ్యక్షుడు నిజామోద్దీన్, మాజీ సర్పంచ్ ఆగయ్య, వార్డు సభ్యులు రజిత, మంజుల, ఎర్ర రాజు, స్రవంతి వెంకటేష్, క్యామీడ్రి రాములు, మహిపాల్ రెడ్డి, సిద్ధోల్లా రాములు, నాయకులు కుంట కిష్టారెడ్డి, బ్యాగారి స్వామి, రాములు గౌడ్, ముత్యం గౌడ్, సకలి శ్రీనివాస్, మంద నరేష్, మంద యాదగిరి, బీమా రమేష్, జగన్ గౌడ్, కర్నాకర్, కనకయ్య, నర్సింహారెడ్డి, అదెపు శ్రీను, మధు, సంజీవ రెడ్డి, గురిమూర్తి, కర్నాకర్ రెడ్డి, భవాని లింగం, ఎల్లయ్య, శ్రీనివాస్, సాకలి కిష్టయ్య, యాదయ్య, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.



## మామిడి పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ఉద్యాన అధికారి అర్చన**

**గొల్లపెల్లి, జనవరి 10 (మనసులోమాట):**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం రాఘవపట్నంలో మామిడి తోటలను డివిజనల్ ఉద్యాన అధికారి అర్చన శుక్రవారం పరిశీలించారు. రైతు మోహన్ రెడ్డి తోటను సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. తీవ్రమైన చలి కారణంగా జిల్లాలో ఇప్పటివరకు కేవలం 20 శాతం తోటల్లోనే పూత వచ్చిందని, మిగిలినవి ఇంకా పూత దశలోనే ఉన్నాయన్నారు. మామిడిలో పూత మూడు దశల్లో (పచ్చి పూత, తెల్ల పూత, జొన్న రవ్వంత పూత) ఉంటుందని వివరించారు. ప్రస్తుతం తోటలు 'పచ్చి పూత' దశలో ఉన్నాయని, ఈ సమయంలో మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. లీటరు నీటిలో 0.5 మి.లీ నీమ్ ఆయిల్ (చీవవఎ), 1 మి.లీ టోల్ఫెనపీరాడ్ (ఁశీశ్రీటవవఅజూఎతీఖు), 1 మి.లీ ప్రొపికొనజోల్ (ర్రాతీశీజూఱఅఎశీఖుఓశీశ్రీవ) కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల తేనె మంచు పురుగు, తెల్ల దోమ, తామర పురుగులను అరికట్టవచ్చని తెలిపారు. తెల్ల పూత దశలో మందులు కొడితే పరాగసంపర్కం జరగక పూత రాలిపోతుందని, ఆ సమయంలో మందులు వాడకూడదని స్పష్టం చేశారు.అలాగే ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి వంశీ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



## బాలరాజుపల్లిలో పంచాయతీ భవన పనుల పరిశీలన

**జూలపల్లి, జనవరి 09 (మనసులోమాట):** జూలపల్లి మండలం బాలరాజుపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఏఈ రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంటూరి అంజమ్మ లక్ష్మణ్, ఉప సర్పంచ్ కోరుకంటి హరికిషన్, పంచాయతీ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

## మడూరు అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**ఎంపీ రఘునందన్ రావుకు సర్పంచ్ వినతి పత్రం**

**చిన్నశంకరంపేట, జనవరి 09 (మనసులోమాట):**

చిన్నశంకరంపేట మండలం మడూరు గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ దివ్యభారతి లింగ గౌడ్ శుక్రవారం ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచులంతా నడుం బిగించి గ్రామాల ప్రగతికి తోడ్పడాలని సూచించారు.



## కాళ్లకల్ నరసన్న మరణం తీరని లోటు

**డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ నివాళి**



**గజ్వేల్, జనవరి 10 (మనసులోమాట):**

భూ సేకరణ చట్టం 2013 ప్రకారం భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం కోసం పోరాడిన వీరుడు కాళ్లకల్ నరసన్న అని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన నరసన్న పార్థివ దేహానికి శుక్రవారం ఆయన నివాళులర్పించి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 2004లో కాళ్లకల్ లో కార్ల కంపెనీ కోసం వేలాది ఎకరాలను సేకరించినప్పుడు, నరసన్న భూ నిర్వాసిత సంఘాన్ని ఏర్పాటు చేసి పోరాడారని గుర్తు చేశారు. పోలీసు నిర్బంధాన్ని ఎదిరించి, సమాచార హక్కు, భూ సేకరణ చట్టాలపై రైతులకు అవగాహన కల్పించి న్యాయమైన పరిహారం సాధించారన్నారు. ఈ పోరాటంలో ప్రొఫెసర్ కోదండరాం, నాటి నాయకులు తన్నీరు హరీష్ రావు, ఈటెల రాజేందర్, న్యాయవాది రవికుమార్, డాక్టర్ ఉష సీతాలక్ష్మి వంటి వారిని కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేశారని, న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారని వివరించారు. డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి గౌతోజిగూడలో దళితుల సామాజిక బహిష్కరణకు వ్యతిరేకంగా, అలాగే పరికిబండ, బిజిలిపూర్ ఘటనల్లో బాధితుల పక్షాన నిలిచారని కొనియాడారు. మాజీ మంత్రి గీతారెడ్డికి వ్యతిరేకంగా జహీరాబాద్ లోనూ పోరాడారన్నారు. ఆర్య సమాజ్, అంబేడ్కర్ ఆశయాలతో నడిచిన నరసన్న మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, నాయకులు భీమ్ శేఖర్, బ్యాగరి వేణు, పోత రాజుశంకర్, తిరుపతి, రాంచంద్రం, జఫర్ భాయ్, నాగరాజు, చెన్న మలవ్వ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టి వైభవ్ సూర్యవంశీ వైపు



టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. జింబాబ్వే వేదికగా జరగనున్న అండర్-19 వరల్డ్ కప్ 2026 కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. జనవరి 15న అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన వేటను ప్రారంభించనుంది. అయితే ఈ టోర్నీలో వైభవ్ ఒక భారీ లక్ష్యాన్ని తన కళ్లముందు ఉంచుకున్నాడు. అదే మిషన్ 607. ఈ సంఖ్య వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో తెలిస్తే మీరు షాక్ అవుతారు. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఆయిన్ మోర్గాన్ పేరిట ఉంది. మోర్గాన్ 2004 మరియు 2006లో ఐర్లాండ్ తరపున ఆడి మొత్తం 606 పరుగులు చేశాడు. అయితే వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి 607 పరుగులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోర్గాన్ ఈ ఘనతను రెండు వరల్డ్ కప్ లలో సాధించగా, వైభవ్ మాత్రం తన అద్భుత ఫామ్‌తో ఈ ఒక్క టోర్నీలోనే ఆ మైలురాయిని చేరుకోవాలని చూస్తున్నాడు. ఇది వినడానికి కష్టంగా అనిపించినా, వైభవ్ బాదుడు చూస్తుంటే అది అసాధ్యమేమీ కాదనిపిస్తోంది. ఇటీవల జరిగిన సౌతాఫ్రికా పర్యటనలో వైభవ్ సూర్యవంశీ చెలరేగిపోయాడు. ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ టీమిండియాకు 3-0తో వన్డే సిరీస్‌ను అందించాడు. బౌలర్ ఎవరైనా సరే ఏమాత్రం కనికరం లేకుండా స్టేడియం బయటకు పంపడమే వైభవ్ స్టైల్. అదే ఊపును ఇప్పుడు వరల్డ్ కప్ లో కూడా కొనసాగించాలని కోరుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్ గా వైభవ్ ఇచ్చే మెరుపు ఆరంభాలు భారత్‌కు కొండంత బలాన్ని ఇస్తున్నాయి. వరల్డ్ కప్ మెయిన్ మ్యాచుల కంటే ముందు వైభవ్ రెండు వార్మప్ మ్యాచుల్లో తన సత్తా చాటనున్నాడు. జనవరి 10న స్కాట్లాండ్‌తో, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. ఇక అసలైన టోర్నీలో జనవరి 15న అమెరికాతో, 17న బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. మూడో లీగ్ మ్యాచ్ జనవరి 24న జరుగుతుంది. ఫిబ్రవరి 3, 4 తేదీల్లో సెమీ ఫైనల్స్, ఫిబ్రవరి 6న గ్రాండ్ ఫైనల్ జరగనుంది. వైభవ్ గనుక ఫైనల్ వరకు తన ఫామ్‌ను కొనసాగిస్తే మిషన్ 607 సాధించడం నల్లేరు మీద నడకే. అతి చిన్న వయసులోనే ఎంతో పరిణతితో ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ, భారత క్రికెట్ భవిష్యత్తు ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. మరి ఆయిన్ మోర్గాన్ 20 ఏళ్ల నాటి రికార్డును వైభవ్ తుడిచిపెట్టగలడా? లేదా అనేది చూడాలి. క్రికెట్ అభిమానులంతా ఈ యువ కెరటం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## కెంద్రా లస్ట్‌తో విరాట్ కోహ్లీ..?

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతనికి భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. శత్రు దేశం పాకిస్థాన్‌లోనూ కోహ్లీ అంటే పడి చచ్చే అభిమాన గణం ఉంది. దాంతో కోహ్లీ తరుచూ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. అయితే తాజాగా కెంద్రా లస్ట్ అనే అమెరికా శృంగార తార.. సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీతో ఉన్న ఫోటోను పంచుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అనుకోకుండా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీని యూకేలో కలిసానని కెంద్రా లస్ట్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఫొటోను పంచుకుంది. ఈ పోస్ట్‌కు కెంద్రా లస్ట్.. 'అనుకోకుండా జరిగే సమావేశాలు ఎప్పుడూ అత్యుత్తమంగా ఉంటాయి. ఎంత గొప్ప స్ఫూర్తి, నిజంగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి'అనే క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటో క్షణాల్లో వైరల్ కాగా.. ఇది ఫేక్ అంటూ అభిమానులు తేల్చేసారు. ఏఐ జనరెటేడ్ ఫొటో అని కామెంట్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ కుటుంబం లండన్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నప్పటికీ.. గత నెలరోజులుగా భారత్‌లోనే ఉన్నాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఆడేందుకు భారత్‌కు వచ్చిన కోహ్లీ.. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు. అలాంటిది కోహ్లీని యూకేలో కెంద్రా లస్ట్ ఎలా కలిసిందని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కెంద్రా లస్ట్ తరుచూ ఏఐ జనరేటేడ్ ఫొటోలను పంచుకుంటుంది. ఇటీవల భారత బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్‌ను కలిసినట్లు ఏఐ జనరేటెడ్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకొని వార్తల్లో నిలిచింది. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ.. తనకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్నాడు. ఆదివారం వడోదర వేదికగా జరిగే తొలి వన్డేతో మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ సెంచరీ, హాఫ్ సెంచరీ( 131, 77)తో రాణించాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు బాది 302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.



## ఎప్పటికీ రోహితే నా కెప్టెన్!

### ఐసీసీ చైర్మన్ జై షా

టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మను ఐసీసీ ఛైర్మన్ జై షా 'కెప్టెన్ణ అని సంబోధించాడు. దీనికి అక్కడున్న రోహిత్ శర్మ కూడా నవ్వులు చిందించాడు. రీసెంట్?గా రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహించిన ఈవెంట్?లో టీమ్ఇండియా క్రికెటర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హర్మన్ ప్రీత్ కౌర్‌తోపాటు జై షా కూడా పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లో మాట్లాడిన జై షా హిట్‌మ్యాన్‌ను కెప్టెన్ అంటూ పిలిచాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'మన కెప్టెన్ ఇక్కడే కూర్చొని ఉన్నాడు. అతడు టీమ్ఇండియాకు అతడు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించాడు. అందుకే నేను రోహిత్‌ను కేవలం కెప్టెన్ అనే పిలుస్తా. 2023 వరల్డ్‌కప్ టోర్నీలో భారత్ వరుసగా పది మ్యాచ్‌ల్లో నెగ్గింది. కానీ, ఆ టోర్నీలో ట్రోఫీ నెగ్గలేకపోయినా, మన జట్టు అభిమానుల హృదయాలు గెలుచుకుంది. తర్వాత నేను 2024 ఫిబ్రవరిలో రాజ్‌కోట్ వేదికగా ఓ విషయం చెప్పాను. వచ్చే ప్రపంచకప్‌లో ట్రోఫీతోపాటు అభిమానుల హృదయాలను కూడా గెలుచుకోబోతున్నాం' అని ఆ ఈవెంట్‌లో జై షా అన్నారు. ఇక ఇదే ఈవెంట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ సైతం 2024 టీ20 వరల్డ్‌కప్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మపై ప్రశంసలు కురిపించారు. రోహిత్ శర్మ జర్నీ గురించి చెబుతూ అతడు యువతకు స్ఫూర్తి అని అన్నారు. 'రోహిత్ చిన్నప్పుడు తన గ్రాండ్ పేరెంట్స్ వద్ద ఉండేవాడు. క్రికెట్ ప్రాక్టీస్ కోసం కిట్‌తో బొరివాలి నుంచి చర్చ్‌గేట్‌దాకా లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేవాడు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ టీమ్ఇండియా కెప్టెన్ దాకా ఎదిగిన తీరు అద్భుతం. అలా రోహిత్ భారత క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాళ్లో ఒకడిగా నిలిచాడు. అతడి జర్నీ ప్రపంచానికే స్ఫూర్తి. అతడో ఐకానిక్ణ అని నీతా అంబానీ అన్నారు. కాగా, రోహిత్ శర్మ 2021లో టీమ్ఇండియా ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా బాధ్యతలు అందుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌లో భారత్ ఓడింది. కానీ ఆ తర్వాత వరుసగా ఆడిన మూడు ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు రోహిత్. అతడి కెప్టెన్సీలోనే టీమ్ఇండియా ఏడాది కాలంలో రెండుసార్లు ఐసీసీ టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. అలా భారత్ క్రికెట్ జట్టు దాదాపు 17ఏళ్ల తర్వాత 2024లో టీ20 వరల్డ్‌కప్, అలాగే 8ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది రోహిత్ కెప్టెన్సీలోనే. దీంతో భారత్‌కు ఒకటి కంటే ఎక్కువ ఐసీసీ ట్రోఫీలు అందించిన రెండో కెప్టెన్‌గా ధోనీ తర్వాతి స్థానంలో నిలిచాడు. అలా కెప్టెన్‌గా కొంతకాలమే జట్టును నడిపించినప్పటికీ రోహిత్ తనదైన ముద్ర వేశాడు. రోహిత్ సారథ్యంలో 56 వన్డేల్లో భారత్ ఏకంగా 42 విజయాలు సొంతం చేసుకుంది. మరో 12 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ టై కాగా, ఇంకో వన్డేలో ఫలితం తేలలేదు. ఇక టీ20లల్లోనూ రోహిత్ కెప్టెన్సీ రికార్డు ఘనంగానే ఉంది. 62 మ్యాచ్?ల్లో 49 టీ20ల్లో టీమ్ఇండియా విజయం సాధించింది. టీ20 ఫార్మాట్లో అతడి విన్నింగ్ పర్సంటేజ్ 79.03గా ఉంది. కాగా, 2024 వరల్డ్?కప్ ఫైనల్ అనంతరం రోహిత్ టీ20లకు గుడ్‌బై చెప్పేశా. ఇక గతేడాది మే నెలలో సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు కూడా రిటైర్మెంట్ పలికాడు. ప్రస్తుతం అతడు వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే గతేడాది ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు రోహిత్‌ను బీసీసీఐ కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ వన్డే, టెస్టు ఫార్మాట్‌కు కెప్టెన్‌గా నియమించింది. ఇక టీ20లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.

## సెమీఫైనల్లో పీవీ సింధు



గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో సింధు సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యఅబశ్రీశ్రీలోనే జపాన్ ప్లేయర్ అకానే యమగుచి గాయంతో తప్పుకోవడంతో సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. యమగుచి ఆట నుంచి తప్పుకోవడానికి ముందు సింధు 21-11తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో ప్రపంచ మూడో ర్యాంకర్ యమగుచితో ముఖాముఖి పోరును 15-12తో 18వ ర్యాంకర్ సింధు మెరుగుపర్చుకుంది. శనివారం జరిగే సెమీఫైనల్లో చైనా షట్లర్, రెండో సీడ్ వాంగ్ జియితో సింధు తలపడనుంది. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్(చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-8, 21-13తో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజకి(జపాన్)ను ఓడించింది. కేవలం 33 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను సింధు ముగించడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో యమగుచి గాయం సింధుకు కలిసొచ్చింది. పురుషుల డబుల్స్‌లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌లో ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 10-21, 21-23 తేడాతో ఎమ్ఎస్ ఫిక్రి-ఎఫ్ అల్‌ఫియాన్ జోడి చేతిలో ఓటమిపాలైంది.

## రియాన్ పరాగ్‌కు ఛాన్స్ లభించేనా?



టీమిండియా యువ సంచలనం తిలక్ వర్మ గాయం కారణంగా న్యూజిలాండ్‌తో జరగబోయే మొదటి మూడు టీ20లకు దూరమయ్యాడు. విజయ్ హజారే ట్రోఫీ ఆడుతున్న సమయంలో అతనికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో రాజ్‌కోట్‌లో అత్యవసరంగా సర్జరీ చేశారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నప్పటికీ, మైదానంలోకి రావడానికి కనీసం రెండు వారాల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో తిలక్ వర్మ స్థానంలో ఎవరిని తీసుకోవాలనే చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటర్ ఆకాష్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీసీఐ అధికారిక సమాచారం ప్రకారం.. బుధవారం జనవరి 7న తిలక్ వర్మకు పొత్తికడుపులో వచ్చిన సమస్య కారణంగా సర్జరీ జరిగింది. గురువారం ఉదయం అతను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రస్తుతం విశ్రాంతి కోసం హైదరాబాద్ వస్తున్న తిలక్, గాయం పూర్తిగా మానిన తర్వాతే మళ్ళీ ట్రైనింగ్ మొదలుపెడతాడు. దీనివల్ల న్యూజిలాండ్‌తో జరిగే మొదటి మూడు టీ20లకు అతను అందుబాటులో ఉండడు. మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఆడతాడా లేదా అనేది అతని రికవరీని బట్టి బోర్డు నిర్ణయిస్తుంది. తిలక్ వర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్ లేదా యశస్వి జైస్వాల్‌ను తీసుకోవాలని చాలా మంది అంటున్నప్పటికీ, ఆకాష్ చోప్రా మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారు. దానికి ఆయన ఒక లాజిక్ చెప్పారు. "మీకు కావాల్సింది ఓపెనర్ కాదు, ఎందుకంటే తిలక్ వర్మ 3 లేదా 4వ స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు. కాబట్టి మిడిల్ ఆర్డర్‌లో ఆడే ప్లేయర్ కావాలి. గిల్, జైస్వాల్ ఇద్దరూ ఓపెనర్లు, కాబట్టి వారిని రిప్లేస్‌మెంట్ గా చూడలేం" అని ఆకాష్ వివరించారు. తిలక్ వర్మ స్థానంలో ఆకాష్ చోప్రా ముగ్గురి పేర్లను సూచించారు. అందులో మొదటిది శ్రేయస్ అయ్యర్ (సర్పంచ్ సాబ్). ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో అయ్యర్ మంచి ఫామ్‌లో ఉన్నాడని, అతనికి అంతర్జాతీయ అనుభవం కూడా తోడవుతుందని ఆకాష్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ అయ్యర్ కాకపోతే రెండో ఆప్షన్ గా రియాన్ పరాగ్ పేరు చెప్పారు. పరాగ్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో కూడా ఉపయోగపడతాడు. ఇక మూడో ఆప్షన్ గా ఫినిషర్ రోల్ కోసం జితేష్ శర్మ పేరును ఆయన ప్రస్తావించారు. న్యూజిలాండ్ లాంటి బలమైన జట్టుపై పోరాడాలంటే మిడిల్ ఆర్డర్ బలంగా ఉండాలి. తిలక్ వర్మ దూరం అవ్వడం టీమ్ ఇండియాకు లోటే అయినప్పటికీ, శ్రేయస్ అయ్యర్ లాంటి సీనియర్ ప్లేయర్ జట్టులోకి వస్తే అది అదనపు బలం అవుతుంది. సెలెక్టర్లు ఆకాష్ చోప్రా సూచనలను పాటిస్తారా లేదా అనేది చూడాలి. తిలక్ వర్మ త్వరగా కోలుకోవాలని కోరుకుందాం.

## రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర శతకం



న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికవ్వని రుతురాజ్ గైక్వాడ్.. తన బ్యాట్‌తోనే సెలెక్టర్లకు సమాధానమిచ్చాడు. విధ్వంసకర శతకంతో చెలరేగి వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. 'నీ అవ్వ నన్నే తప్పిస్తారా?' అని బౌలర్లను శతక్కొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా గురువారం గోవాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర సెంచరీతో అరాచకం సృష్టించాడు. తద్వారా లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 20 శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను విరాట్ కోహ్లీ, బాబర్ ఆజామ్ ఆల్‌టైమ్ రికార్డ్‌లను బద్దలుకొట్టాడు. శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ గాయాల నేపథ్యంలో సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా పిలుపును అందుకున్న రుతురాజ్ గైక్వాడ్.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. తొలి వన్డేలో విఫలమైనా..రెండో వన్డేలో సెంచరీతో చెలరేగాడు. మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. అయితే గిల్, అయ్యర్ అందుబాటులోకి రావడంతో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ నుంచి రుతురాజ్ ఉద్వాసనకు గురయ్యాడు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. రాబిన్ ఊతప్ప అయితే.. భారత సెలెక్టర్లపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముంబై, ఢిల్లీ, పంజాబ్ ఆటగాళ్లకే భారత జట్టులో సుస్థిరం స్థానం ఉంటుందని, రుతురాజ్‌కు అన్యాం జరిగిందని మండిపడ్డాడు. రుతురాజ్ గైక్వాడ్ మాత్రం సెలెక్టర్ల నిర్ణయంపై స్పందించలేదు. మౌనంగా తన బ్యాట్‌తోనే వారికి దిమ్మతిరిగే బదులిచ్చాడు. గోవాతో మ్యాచ్‌లో 2 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న మహారాష్ట్రను రుతురాజ్ సెంచరీతో ఆదుకున్నాడు. 131 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 134 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దాంతో మహారాష్ట్ర 249 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ చేసి 3 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇది రుతురాజ్ గైక్వాడ్‌కు 20వ లిస్ట్-ఏ సెంచరీ. అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన బ్యాటర్‌గా రుతురాజ్ నిలిచాడు. 95 ఇన్నింగ్స్‌ల్లోనే అతను ఈ ఫీట్ అందుకున్నాడు. ఈ క్రమంలో కోహ్లీ, బాబర్ ఆజామ్ రికార్డులను బద్దలు కొట్టాడు. 131 లిస్ట్-ఏ ఇన్నింగ్స్‌ల్లో బాబర్ ఆజామ్ 20 శతకాలు నమోదు చేయగా.. కోహ్లీ 143 ఇన్నింగ్స్‌ల్లో 20 సెంచరీలు అందుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో కనీసం 50 ఇన్నింగ్స్‌లు ఆడిన ఆటగాళ్లలో అత్యధిక సగటు కలిగిన బ్యాటర్‌గా రుతురాజ్ గైక్వాడ్ నిలిచాడు. అతని సగటు 58.83 కాగా.. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైఖేల్ బెవాన్ 57.86 సగటుతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. దేశవాళీ క్రికెట్‌తో పాటు అంతర్జాతీయ క్రికెట్‌లోనూ తన సత్తా నిరూపించుకున్నా రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశాలు ఇవ్వకపోవడంపై మాజీ క్రికెటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేయాల్సిందని రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మిడిలార్డర్‌లో అతను స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడుతాడని, అతన్ని జట్టులో కొనసాగించాల్సిందని అభిప్రాయపడ్డాడు.



# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యుజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది.



చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ÷ట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయి-ంతే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెళిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.

# టికెట్ ధరల పెంపు మెమోలు ఎలా ఇస్తారు

## ధరలు పెంచబోమని మంత్రే స్వయంగా చెప్పారుగా

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తెలంగాణ హైకోర్టు

కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచుకునేందుకు అవకాశం కృస్తూ మెమోలు జారీ చేయడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెవిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించిం. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రే స్వయంగా ప్రకటించారని, అయినా కూడా ధరల పెంపునకు మెమోలు ఎందుకు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసిం. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన మారడం లేదంటూ మండిపడిం. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించిం. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌ల్లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చిం. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌ల్లో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చిం. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసిం. ఈ నేపథ్యంలో 'రాజాసాబ్' టికెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైం. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టుకు వివరించారు.



# ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్

## ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ





సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది. ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ ప్రక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.



# శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల



శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.

# జన నాయగన్' సినిమాకు ఊరట

## సెన్సార్ సర్టిఫజకెట్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం

విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరఫున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు సమాచారం.

## యాక్షన్ మోడల్‌లో సమంత సూపర్బ్

చూస్తా ఉండండి.. మా ఇంటి బంగారం మీ అందరితో కలిసిపోతుంది..' అంటూనే ఫుల్ యాక్షన్ మోడ్‌లో అదరగొడుతున్నారు సమంత. ఆమె ప్రధానపాత్రలో నందిని రెడ్డి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. తాజాగా ఈ సినిమా టీజర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత అమాయకంగా కనిపిస్తూనే యాక్షన్ సన్నివేశాల్లో తనదైన శైలిలో నటించారు. 1980ల నేపథ్యంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్నట్లు ఈ వీడియో ఆధారంగా తెలుస్తోంది. ఇందులో సమంతతో పాటు బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలకపాత్రలో నటిస్తున్నారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861